"ఆంధ్రభూమి"



హారీగార్డాన్ సెల్‌ఫ్రిడ్జి

# అభ్యర్చన

క్షీరాబ్ధిశయనా! కమలంబులు సూర్యుని కెదురుచూచిన యట్లు నాహృదయపద్మంబు రవిమండలమధ్యవర్తియైన నీకెదురుచూచుచున్నది. మయూరంబులు మేఘాగమనంబునకుం జెలంగినట్లు నామనోమయూరంబు నీలమేఘవర్ణంబైన నీతిరుమేనుదలంచి యానందించుచున్నది. ముత్యపుఁజిప్పలు స్వాతిచినుకులకు నోరుదెఱచినట్లు నావదనశుక్తి మీపాదతీర్థంబునకు వికసించుచున్నది. సర్పంబులు గానంబులుగోరి చొక్కి పడగలెత్తి యాడినట్లు నావీనులు నీకథల నాలకించుచున్నవి. నీవు పరాత్పరమూర్తివి. నేను ప్రకృతిసంబంధంబులైన యంగంబులు ధరియించినవాఁడ. అదియెట్లు గూడుననవలదు. ఆప్రకృతికి నీవు చైతన్యమవు. ఈచుట్టఱికము తొల్లి కలుగఁగానే దీనికి ననురాగముం గలిగియున్నది. కన్నెఱుఁగకున్నఁ గడుపెఱుంగునండ్రు లోకులు. ఇంతియకాని మిమ్ము నెఱుంగ నే నెంతటివారము. నాయానవిన్నవించితి నింతియకాని నిన్ను నేఁ గక్కసించినవాఁడఁగానుసుమీ. నమోనమ శ్రీవేంకటేశ్వరా!

గోవిందా! పక్షులకుఁ బుట్టినయపుడే యేయేజాతి యాయావిధంబులం గూఁతలువెట్ట నేర్పినవారెవ్వరు? మృగంబుల గర్భంబులలోనుండి వెడలి తల్లుల చన్నులంగుడువఁగణంగుటెట్లు? పశువుల కసువుమెసంగెడి చందంబెట్టిది? నానావిధవృక్షంబులు మొలచినయపుడు తమతమ యాకారములు పుష్పదళములుగలిగి తతికాలంబెఱింగి చెలంగుటెట్లు? అన్నియును మీయాజ్ఞారూపంబులైన ప్రకృతిభావంబువలెనే మును నీరీతినే మీకల్పితములైన దేహంబులు మోచుచున్నవారము; మానేర్పు నేరములు, మాస్వభావంబులు, మాసంసారకృత్యంబులు మీకల్పితములైన, మీప్రభావంబులైన మమ్ముఁదప్పులెంచఁబనిలేదు. నమోనమ శ్రీవేంకటేశ్వరా!

# ప్రియునితో

౧

కానుక నాకొసంగు తమకంబునఁ గోసినపూల మార్దవం
బో, యనురాగమో, కలశముంగొని చెట్లకు నీరువోయుచోఁ
బ్రాణసఖుండ! యొత్తికొనురాయిడి నెఱ్ఱఁదనంపుఁగెంపు పెం
పూనినక్లేశమో నిలిచియున్నది చూడుము నీకరంబులన్.

౨

తమకపుఁ బారవశ్య మెడఁదన్ ముకుళించినకన్నులందు, నా
ట్యము లొనరించునప్పుడు, రహస్యవనాంతరసీమలందు సం
భ్రమమున నన్నుఁ గైకొని భవద్గళమానుకొనంగ నాదుహ
స్తములకొసంగవో, యటు నెసంగవా మామకకంకణాంకముల్?

౩

ప్రియసఖ! యేనొకర్తు వనవీథివసింపఁగఁ గాంతునేమొ యన్
భయమున మెల్లగా వెనుకపాటున వచ్చి మదీయలోచన
ద్వయమును గప్పునట్లిడిన తావకహస్తములందు నీవిగు
ళ్ళయొఱపుమీఁది నీలికళలంగనుచుం దెలినవ్వు నింపవో?

౪

నాయకుఁడు నాయికయు మనమై యెసంగఁ
జిత్రముగ రచించిన యీ చరిత్రమునకు
నేమియర్థముఁ గూర్చెదో యేవిధమునఁ
జెప్పెదో యన్వయము చిరస్నేహశీలి!

౫

నీయెద వీణాతీవియలు నెమ్మి స్పృశించి మనోహరశ్రుతిన్
నాయనురాగమే సరియొనర్చు టెఱుంగుదు నాత్మలోన; నే
మోయిసఖుండ! నన్విడువనొల్లను! కీర్తిసుఖంబొసంగునే?
యీయెడ నుండిపొమ్ము రచియింతము ప్రేమరహస్యగీతముల్.

—వఝ్ఝల వేంకటేశ్వరకవి, బి.ఏ.

# సూరి సిద్ధాంతం. ౩.

“బ్రాహ్మణులసంగతి ఏమయిందిచెప్పు! ఒకప్పుడు వాళ్ళలో ఈజీవశక్తి ఉండదగినంతఉండే ఉండాలి. అప్పుడు వాళ్ళు తమచేతులోఉన్న కర్మయోగాన్ని పట్టుకు ఏడవక, లక్షమందిలో ఒకడికికూడా అందని జ్ఞానయోగంకోసం పోయినారు. అమితిమీరిన తిండితో జీవశక్తి మందగించిపోయింది. తద్దినాలుపెట్టించే దేవతాస్వరూప బ్రాహ్మణుడిమొహం చూస్తే నీకు జఠరాగ్నిమందగించిన లక్షణాలే కనబడతై; నాకు జీవశక్తి మందగించిన చిహ్నాలుకూడా కనబడతై. ఈకాలపు బ్రాహ్మణుడు కర్మచెయ్యలేడు. ఆకలిలేనివాడికి ఏపదార్థం రుచించనట్టు ఈబ్రాహ్మడికి ప్రతీపనీ తప్పుగా కనబడుతుంది. మడికట్టుకునివస్తుంటే కాస్తపోగు తాలికిందపడగానే వెళ్ళి మళ్ళీ స్నానంచేసివస్తాడు. తనలో జీవశక్తి చచ్చిపోయిందికనక, తన అంటులు సాగుతున్నైకనక, ఇంకాజీవశక్తి చావని ఇతరకులాలవాళ్ళను ఏపనీ చెయ్యవద్దంటాడు—ఆకలికానివాడు మాడుతున్నవాణ్ణి అన్నంతిననివ్వక పక్కనచేరి అన్నంలో మట్టిగడ్డలు చూపించి అన్నంపారెయ్యమన్నట్టు! ఇతరులుచేసేకర్మకు తనెట్లా బాధ్యుడో?—తనశాస్త్రంప్రకారమే చూసినా!... సనాతనమతంఅన్నవాడినల్లా జైలులో పారెయ్యి! ఒక్క సంవత్సరంలోపల ఈహరిజనుల్లోనుంచి సూపర్‌మాన్ రాకపోతే నాపేరు సూరికాదు!... ఈసారి గాంధి వాళ్ళలోపుడితే ఆశ్చర్యంఏముంది?”

ఒకప్పుడు నేను మనుష్యులంతా మంచివాళ్ళూ చెడ్డవాళ్ళూ రెండురకాలుగా ఉంటారనుకునేవాణ్ణి. కాని మనుష్యులతో నాకు సంపర్కం ఎక్కువయినకొద్దీ ప్రతివాడిలోనూ మంచీచెడూ ఉన్నదని గ్రహించాను. ఇదొక పెద్ద డిస్కవరీకాదు కాని దీనిమీద కొంత బుద్ధిని ప్రయోగించి నిజమైనడిస్కవరీ ఒకటి చేశాను. మొత్తానికి బుద్ధిని ఉపయోగించటాన్ని గురించి సూరి చెప్పినదాన్లో కొంతలేకపోలేదు. ఎప్పుడు తెల్లవారుతుందా ఈడిస్కవరీనిగురించి సూరితో ఎప్పుడు చర్చించుదామా అని ఆరాటపడ్డం మొదలుపెట్టాను.

మర్నాడుదయం మొదటికిత్తా పడ్డ తరవాత ఇద్దరం తీరిగ్గా కూర్చున్నాం.

“ఒరే సూరీ! నేనోకొత్తవిషయం కనిపెట్టాను!” అన్నాను.

“ఏమిట్రా అది?” అన్నాడు సూరి పరధ్యానంగా.

‘కృతయుగంలో ధర్మం ఒంటికాలిమీద నడుస్తుందనీ రానురాను కలియుగంలో ఒకపాదంతోనే నడుస్తుందనీ నువ్వు నమ్ముతావా?’

‘ఒక్కకాలితో నడవటం ఎట్లాఉంటుంది? గెంతుతుందను.’

‘ఏడిచావులే! నామాటకు సమాధానంచెప్పు. నీకటువంటి నమ్మకంఉన్నదా?’

‘ఆ! ఏం?’

‘మరేంలేదు! నేనదిశుద్ధ అబద్ధమని నిరూపిస్తాను.’

‘నిరూపించు!’ అన్నాడు సూరి ఆశ్చర్యంతో. ప్రతిరోజూ వాడి ఉపన్యాసాలకు గురిఅయే నేను వాడికి లెక్చరివ్వటానికి చాలాగర్వపడ్డాను—కొద్దిగా భయపడ్డాను. మరేంలేదు. దొంగవెధవ! ఏదోవాదన పెట్టి మనడిస్కవరీలు డిస్కవరీలుకావని నిరూపిస్తాడు! మరోవిషయమేమిటంటే వాడు పురాణాదులతో ఏకీభవిస్తున్నాడంటే ఏదోదొంగఎత్తు ఎత్తాడన్నమాటే! ఎందుకు? ఒకసారినేను మనపురాణాలంత నమ్మదగినట్టుండవన్నాను. వాడిట్లాగే కళ్ళుపెద్దవిచేసి అమాయకుడల్లే ‘ఏం?’ అన్నాడు. నేను ప్రహ్లాదచరిత్ర తీసుకుని, ప్రహ్లాదుడు చావకపోవటం, భగవంతుణ్ణి ఎక్కడపడితే అక్కడ చూపిస్తానని చూపించగలగటం, హిరణ్యకశ్యపుడు శాస్త్రోక్తంగా చచ్చిపోవటం మొదలైనదంతా సింబాలిక్ కాని కథ ఎంతమాత్రం నమ్మటానికి వీల్లేదన్నాను. ఇక సూరి తగిలాడు కాబూ! ప్రహ్లాదచరిత్రలో ప్రతి అక్షరం ట్రూటు

లైఫ్ అన్నాడు. ప్రహ్లాదుడు క్లియర్‌గా సైకిక్ మీడియమ్ అన్నాడు. ప్రహ్లాదుడు చేసిన పనులలో మామూలు క్లేర్‌వాయంట్లు చెయ్యలేనివేవీ లేవన్నాడు. నరసింహమూర్తి ప్రత్యక్షంకావటం అన్‌ది వెరీఫేసాఫిట్ మెటీరియలైజేషన్ అన్నాడు. తండ్రిని చంపేటందుకు కావలిసొచ్చిన మెటీరియల్ ఎనర్జీయావత్తూ ప్రహ్లాదుడే సప్లయిచేశాడన్నాడు. ప్రహ్లాదుడే మళ్ళీ డిమెటీరియలైజేషన్ కూడా చెయ్యగలిగాడు చూడమన్నాడు. ఈ ప్రవాహానికి ఏమడ్డువెయ్యను? అసలే నాకీస్పిరిచుఅలిజంఅంటే అమితఅనుమానం. తరవాత దాన్నిగురించీ నాకు ఏమీతెలీదు. ఇప్పుడుకూడా ఇటువంటి దొంగ ఎత్తుఎత్తి కలియుగంలో ధర్మం గెంతుతున్నది కాని నడవటంలేదని నిరూపిస్తాడని నాకుఒక చెంప అనుమానం ఉండనే ఉంది... నా ఉపన్యాసం ప్రారంభించాను.

'వెనకటియుగాల్లో అంతా సజ్జనులయినప్పటికీ, అందరి మంచితనాన్ని కప్పిపుచ్చగల ఒకదుర్మార్గుడుండేవాడు. ఆరోజుల్లోఅయితే రాముడూ లేకపోతే రావణుడూ! ఒక్కొక్క కంటకుడు అనేక వేలసంవత్సరాలు భూమిమీద ధర్మంఅన్నమాట వినపడకుండా చేసేవాడు. ఇప్పుడో? ఇప్పుడు రావణుడూలేడు. రాముడూలేడు. ప్రతివాడులోనూ కొంతరాముడూ కొంత రావణుడూ ఉన్నాడు. నీకృతయుగంకంటె ఈ కలియుగమే బాగుంది—నన్నడిగితే!' అన్నాను.

సూరి 'హా! హా!' అంటూ వాడివెధవనవ్వు నవ్వటం మొదలుపెట్టాడు.

నాకు వళ్ళుమండి 'ఎందుకురా ఆవెధవనవ్వు? చాతయితే నేను ఏంపొరపాటుపడ్డానో చెప్పు!' అన్నాను.

వాడు యథాప్రకారం 'సారీ!' అని నన్ను ఖండించటం మొదలుపెట్టాడు.

'ఓరి పిచ్చిసాయనా! నువ్వు రావణుడివైనా రాముడివైనా నీకు సృష్టిలో స్థానంఉంది. ఆరెండుశక్తులూ నీలో ఏకమైపోగానే నీలో లైఫ్‌ఫోర్సు చచ్చిపోయింది. నిన్నుమళ్ళీ కరగవెయ్యవలిసిందే. ఇబ్సెన్ రాసిన పీర్ జెయన్‌ట్ చదువు.'

నేను కష్టపడి అర్ధరాత్రివేళ నిద్రలేకుండా చేసిన రిసర్చియావత్తూ సూరి ఒక్కముక్కతో తేల్చివెయ్యటం నాకిష్టంలేకపోయింది. నేను వాడితో లడాయి వేసుకున్నాను.

'ఒరే సూరీ! నీపెడకట్టెతర్కం నాదగ్గిర పనికిరాదు. సృష్టియొక్క ఆదర్శమేమిటి? మంచితనమా, దుర్మార్గమా?'

'నే నావిషయం ఇంకాసృష్టినడిగి తెలుసుకోలేదు. సృష్టిలో వెల్తురూఉన్నది, చీకటీఉన్నది. ప్రకృతికి వెలుతురునుచూస్తే ప్రేమగాని, చీకటిని చూస్తే కోపంగాని ఉన్నట్టు తోచదు.

'జయవిజయులను దుర్మార్గులుగా పుడతారా సన్మార్గులుగా పుడతారా అని అడిగితే తడుపుకోకుండా దుర్మార్గులుగా పుడతామన్నారు ఒక్కజన్మలో భగవంతుణ్ణి చేరుకోటానికై నాసరే నీవంటివాడుగా పుట్టటానికంగీకరించి ఉండరు. నామాట నమ్ము. స్వర్గానికీ నరకానికీ దారి ఒకటేనని వాళ్ళకు తెలుసు.'

నేను కాస్సేపు ఆలోచించాను.

'అయితే స్వర్గం నరకం ఒకటేనంటావా? పుణ్యం పాపం ఒకటేనంటావా?'

'మంచీచెడూ ఒకటేనన్నానా? కాదు! నేనన్నదల్లా త్రిశంకుస్వర్గంకన్న నరకమైనా మంచిదేనన్నాను. నీకన్న ఒక రావణుడికెక్కువపదవి ఉందన్నాను ప్రపంచంలో. ఏదోకర్మచెయ్యి, అజగరవ్రతం మంచిది కాదన్నాను.'

'అట్లాఅయితే నువ్వువర్ని ఒప్పించలేవు. ఏపనీ చెయ్యకుండా ఉండటం మంచిదంటాను పాడు పని చేసేకన్న!'

'నువ్వు పాడనగానే సరా? నీకు మంచిచెడ్డలను గురించి ఏంతెలుసో చెప్పు. నీకిష్టమైనదంతా మంచీ నీకిష్టంకానిది చెడూ అనుకునేవాడివి మంచిచెడ్డలతో ఏంపనిరా?... నాకు అడ్డంరాకు! అట్లాకాకుండా, నీకుమంచి చెడ్డల్లో స్వర్గనరకాల్లో నమ్మకంఉందా? నీకు మంచినిచూస్తే ఇష్టమెందుకు? చెడును చూస్తే అసహ్యమెందుకు?'

'దుష్టుడికి దూరంగా ఉండమన్నారు.'

'నీకర్మఅంటూ ఒకటిఏడిస్తే ఏదుష్టుడు నీపక్క-

ఉన్నా, నిన్నేమీ చెయ్యడు. నీకు నీకర్మ అంటూ లేదు. నువ్వు దుష్టుడికి దూరంగా పోయి నిర్వ్యాపారత్వం వాతపడి త్రిశంకుస్వర్గం చేరతావు.

'ఒక్క ఉపమానం చూడు నీలో ఆకలంటూ ఒకటి పుట్టినప్పుడు ఏదో తింటావు. అది మంచిపదార్థమయితే నీకు సహాయం చేసి బలం ఇస్తుంది. అది అరగని పదార్థమయితే కడుపులో నెప్పి వస్తుంది. దానికి మందు పడవలిసి వస్తుంది. అది డాక్టరు చేతిమీదిగా ఇవ్వబడటం ప్యూర్ ఆక్సిడెంట్. నీకే ఆచికిత్స చాతయి ఉండవచ్చును. అప్పుడా మందు నువ్వే పుచ్చుకుని బాగుపడతావు. ఆవిధంగానే నీలో జీవశక్తి, లైఫ్‌ఫోర్స్ ఉంది, జఠరాగ్నిమాదిరిగానే. అది లోపల ప్రజ్వరిల్లుతూంటే ఏదో కర్మ చెయ్యకుండా ఊరుకోలేవు. నువ్వు అన్నం తినేటప్పుడు తెలివిగలవాడివైతే నీకరిగే పదార్థాలు చూసి మరీ తింటావు. నీకరిగే పదార్థాలు—గమనించు! ఇంకొకడితో సంబంధం లేదు! ఆవివక్షణ లేకపోతే కడుపులో నెప్పి వచ్చినట్టుగానే నువ్వు నరకం అనుభవిస్తావు. (ఆనరకం యొక్క తత్వం తరవాత విచారిద్దాం.) దానిక్కూడా మందు కావలిసివస్తుంది. అది నువ్వే తీసుకోవచ్చును లేదా తెలిసినవాళ్ళు నీకామందివ్వవచ్చును. నీలో ఆలైఫ్‌ఫోర్సు—ఆజఠరాగ్ని లేకపోతే నువ్వెందుకు పనికొస్తావు?

'ఇక ఒక్కక్షణం మనవాళ్ళు చెప్పే నరకాన్ని గురించి ఆలోచిద్దాం. మనవాళ్ళు చెప్పే నరకం ఖయిదు మోస్తరుగా ఉన్నది. నువ్వు అరగని పదార్థాలు తిని కడుపు నెప్పితో బాధపడుతున్న వాడవ్వలేవు. దొంగతనం చేసి విచారింపబడి ఖయిదు అనుభవిస్తున్న వాడవ్వే ఉన్నావు. ఒక్కటాలోచించు. ఈజైళ్ళు ఏక్షణం పోయినా పోవచ్చును. అది శాశ్వతసంస్థ కాదు. మనం పెట్టుకున్నది. మనం తీసేసేది. ఈకడుపులో నెప్పి? ఇది శాశ్వతం. డాక్టరు శాశ్వతం. మందు శాశ్వతం. పైగా మనిషినిపట్టి రోగం. రోగినిపట్టి మందు. డాక్టరు నామమాత్రం. వరసగా నూరుమంది దొంగలను తీసుకురా. అందరూ ఒక్కొక్కరూపాయి దొంగతనం చేసినవాళ్ళనుకో మాటవరసకు. నీకు న్యాయం ఏమాత్రమైన తెలిసుంటే అందరికీ ఒకటే శిక్ష ఇస్తావా? ఎప్పుడూ ఇవ్వవు. తలకొక పదిజామకాయలచొప్పున ఒక వందమందికివ్వు. అందరికీ కడుపు నెప్పి వస్తుందా? రాదు. అరిగించుకునే శక్తి ఉన్నవాడు పదిజామకాయలు తీసుకున్నందుకు ఎందుకు శిక్షపడాలి? నేను అరగని పదార్థమే తిన్నాననుకో. ప్రకృతి నాకు కడుపునెప్పి ఇవ్వటం సహజం కాని, దొంగలుపడ్డ ఆరునెలలకు కుక్కలు మొరిగినట్టు, తిన్న యాభైసంవత్సరాలకు నేను చచ్చి యమధర్మరాజు దగ్గిర నన్ను విచారించి "అబ్బాయి, మాచిత్రగుప్తుడి లెక్కప్రకారం నువ్వు యాభైసంవత్సరాల ఆరునెల్ల పదిరోజుల కింద ఉదయం నాలుగు ఘడియల వేళ పదిజామకాయలు తిన్నావుట! అట్లా నరకంలోకి వెళ్ళి కాస్త కడుపు నెప్పి అనుభవించిరా!" అంటే! నాకు కావలిసింది. డాక్టరు! ఆసుపత్రి!—'

'మనవాళ్ళు చెప్పే నరకం నీఆసుపత్రే నేమో?'

'అట్లా అయితే ఆరోగాలు నయం చేసే పంపిణీ ఉండవలిసినట్టు ఉండక మనఆసుపత్రుల్లో ఉన్నట్టే ఉందన్నమాట, ఆడాక్టర్లు మనడాక్టర్లకంటే రొండాకులెక్కువ చదివినవాళ్ళన్నమాట!...అటువంటి ఆసుపత్రిలోకి పొయ్యేకన్న రోగమే అనుభవిస్తాను. నాకు మందిచ్చే డాక్టరుకు నన్నుచూస్తే జాలిలేకపోతే, నేను పడుతున్న బాధయందు సానుభూతి లేకపోతే నాకు రోగం నయం కానక్కరలేదు.'

నేను కొంత కంగారుపడ్డాను. సూరి కడుపు నెప్పి నొకదాన్ని లాక్కొచ్చి మాట్లాడే మాటలన్నీ ఆముదం కంపు చేశాడు.

'ఆకలయితే అన్నం తినటానికీ, నువ్వు చెప్పే పుణ్యపాపాలకీ నువ్వనుకున్నంత సంబంధం లేదేమో?' అన్నాను.

'మళ్ళీ జాగ్రత్తగా విను! మట్టిబుర్ర! నీలో జఠరాగ్ని ఉన్నట్టుగానే లైఫ్‌ఫోర్స్—తెలుగు తెలీదు! జీవశక్తి అందాం—కూడా ఉంది. ఏమీబాదగ్గిరనించీ రకరకాల జీవకోట్లన్నీ చూస్తూవస్తే ఈజీవశక్తి మనిషిలో ఎక్కువగా ఉంది. రేపు మనిషిలో ఉన్న జీవశక్తి కంటె ఎక్కువ జీవశక్తిగల కొత్తప్రాణి ప్రపంచంలోకి

రావచ్చును. వాణ్ణి సూపర్ మాన్ అను, దేవతను. వాడి భావాన్ని దేవత్వంఅను. మొత్తానికి ఈఆదిమానవుడి ఛాయలు అప్పుడప్పుడూ కనిపించకపోవటం లేదు. నీకన్న తక్కువ లైఫ్ ఫోర్స్ గల జంతువుయొక్క మంచిచెడ్డలు నీకెట్లాచాలవో, నువ్వు ప్రపంచంలో అడుగుపెట్టగానే ఇతరప్రాణికోటిని నీలైఫ్ ఫోర్సుతో ఎట్లా పక్కకు నెట్టేశావో, అట్లాగే రాబొయ్యే సూపర్ మాన్ నిన్ను అట్లాగే నెట్టేస్తాడు. నువ్వు అసంభవమనుకుంటున్న పనులన్నీ చేస్తాడు. ప్రపంచకంలో అందరూ సుఖంగా బతకదగినన్ని పదార్థాలున్నాకూడా కొందరు మాడిచస్తుంటే నువ్వు వాళ్ళకు భోజనసదుపాయం చెయ్యలేక గుడ్లుపెట్టుక చూస్తున్నావు. రాబొయ్యేవాడి కది చాలాసులభం. ప్రపంచంయావత్తూ ఒక్కటేసంస్థ చెయ్యగలశక్తి వాడికుంటుంది. వాడిలోనూ చెడుఉంటుంది. అదిఎట్లాఉంటుందో వాడి బోటివాళ్ళు చెప్పవలిసిందే. నీలోచెడు నీకన్నతక్కువ లైఫ్ ఫోర్స్ గల జంతువులకేం తెలుస్తుంది. వాణ్ణి చూడగానే నీఒక దేవుడితియరీ మర్చిపోయి వాడికాళ్ళమీద పడతావు—ఇప్పుడు వాడి ఛాయలకాళ్ళమీద పడుతునే ఉన్నావు!

'ఇకతిన్నది అరక్కపోవటం విషయం మాట్లాడదాం. నీకాకలిగాఉన్నప్పుడు తినదగిన దానికన్న ఎక్కువ తింటూవస్తే నీలోఉన్న జఠరాగ్ని చచ్చి మాంద్యం ఏర్పడుతుంది. బ్రాహ్మణుల సంగతి ఏమయిందిచెప్పు! ఒకప్పుడు వాళ్ళలో ఈజీవశక్తి ఉండదగినంత ఉండేఉండాలి. అప్పుడు వాళ్ళు తమచేతులో ఉన్న కర్మయోగాన్ని పట్టుకు ఏడవక, లక్షమందిలో ఒకడికికూడా అందని జ్ఞానయోగంకోసం పోయినారు. అమితిమీరిన తిండితో జీవశక్తి మందగించిపోయింది. తద్దినాలుపెట్టించే దేవతాస్వరూపబ్రాహ్మణుడి మొహంచూస్తే నీకు జఠరాగ్ని మందగించిన లక్షణాలే కనపడతై; నాకు జీవశక్తి మందగించిన చిహ్నాములుకూడా కనపడతై. ఈకాలపు బ్రాహ్మణుడు కర్మచెయ్యలేడు. ఆకలిలేనివాడికి ఏపదార్థం రుచించనట్టు ఈ బ్రాహ్మడికి ప్రతిపనీ తప్పుగా కనపడుతుంది. మడికట్టుకుని వస్తుంటే కాస్తపోగు కాలికిందపడగానే వెళ్ళి మళ్ళీ స్నానంచేసివస్తాడు. తనలో జీవశక్తి చచ్చిపోయింది కనక, తనఆటలు సాగుతున్నైకనక, ఇంకా జీవశక్తి చావని ఇతరకులాలవాళ్ళను ఏపనీచెయ్యవద్దంటాడు—ఆకలికానివాడు మాడుతున్నవాణ్ణి అన్నంతిననివ్వక పక్కనచేరి అన్నంలో పుట్టిగడ్డలు చూపించి అన్నం పారెయ్యమన్నట్టు! ఇతరులుచేసే కర్మకు తనెట్లా బాధ్యుడో?—తనశాస్త్రంప్రకారమే చూసినా!

'ఇక రోడ్డుపక్కన కూర్చుని దీనంగా చెప్పులు కుట్టేవాడి గతిచూడు. వాడిమొహంలో ఆకలితీరే అన్నంతిననివాడి లక్షణాలున్నై. పాపం, మానవుడు నిర్మించిన యాభైఅంతస్తుల మేడల్లో, డెబ్బైమైళ్ళ వేగంతో పొయ్యే రైళ్ళలో, మూడొందలు గంటకు పొయ్యే కార్లలో, విమానాల్లో, వేదాంతగ్రంథాల్లో, దాన్లో, దీన్లో, వాడికేం భాగంఉంది? వాడిలో జీవశక్తిని చూస్తే ఎవరికీ గౌరవంలేదూ? వాడిమొహాన మనపాదధూళేనా? వాడీఆకలిని సారాయితో నూకల్లుతోనూ తృప్తిపరిచి, ఏకొలువులో జరిగినపుడు వేటలు నరికి సంతోషించవలిసిందేనా? వాడాస్థితిలో ఉండటానికి సమ్మతిస్తే బాగానేఉండును. అట్లా జరుగుతున్నదా? అన్నం తిననివ్వమన్నామా అని అంటే ఏం లాభం, కంచంకూడా ముట్టుకోనివ్వకుండా! వాణ్ణి నీకు ఆరడుగులదూరంలో పోనివ్వవు! వాడిలో లైఫ్ ఫోర్సు ఇంకా ఎట్లా చంపాలి?'

సూరి ఉద్రేకంపట్టలేక లేచి అటూఇటూ పచార్లు చెయ్యటం మొదలుపెట్టాడు. వాడిమొహం క్రోధంతో భయంకరమైపోయింది.

'మై-గాడ్! సనాతనమతం అన్నవాడినల్లా జైలులోపారెయ్యి! ఒక్కసంవత్సరంలోపల ఈహరిజనుల్లోనుంచి సూపర్ మాన్ రాకపోతే నాపేరు సూరికాదు! బంగారంకావాలంటే పాడుపడ్డ గనులే మళ్ళీమళ్ళీ వెతికితే ఏంప్రయోజనం? కొత్తచోట వెతుగు. వాళ్ళ పాసిబిలిటీస్ పరీక్షించినవాడేడీ? ఈసారి గాంధీ వాళ్ళలో పుడితే ఆశ్చర్యంఏముంది!'

—కొడవటిగంటి కుటుంబరావు.

# నిజమైన ఘనకార్యాలు

## అలెగ్జాండరు

అలెగ్జాండరు పాంచాలమును జయించాలని వచ్చినపుడు పురుషోత్తము డతన్ని మోహాటించినాడు. ఖండాంతరదేశములను జయించి చీమలపుట్టవంటి అసంఖ్యాకసైన్యము కలిగిన అలెగ్జాండరెక్కడ? పాంచాలమును దాటియెఱుగని పురుషోత్తము డెక్కడ? కాని అతడు ప్రాణమునకును స్వాతంత్ర్యమునకును ముడివేసికొన్నాడు; తెగించి పోరుసలిపి పరమవిరోధిఅయిన అలెగ్జాండరుమన్నన వడసినాడు. నేటికిని గూడ పురుషోత్తముని శౌర్యమును మెచ్చుకొని గౌరవించిన కీర్తి అలగ్జాండరునకు మిగిలినది.

## నెపోలియను

నెపోలియనుకూడ ఇట్టి ఘనకార్యా లనేకముచేసినాడు. అతనిచేత ఖైదుచేయబడిన యింగ్లీషునావికయువకుడొకడు వృద్ధమాతృసందర్శనమునందు లగ్నమైనమనసుతో రహస్యముగ ఇంగ్లీషుఛానల్ దాటుటకు తెప్పగట్టుచుండెను. అతనిని పరాసువారు పట్టుకొని నెపోలియనుచక్రవర్తివద్ద పెట్టిరి. చక్రవర్తి యతని వృత్తాంతము యావత్తువిని అతని మాతృభక్తికిమెచ్చి బహూకరించి యింటికిపంపినాడు. నెపోలియను ధరించిన కిరీటాదులు నశించినవి; యేలినరాజ్యములు విచ్ఛిన్నమైనవి. కాని అతని యీచిన్నకార్యము సువర్ణాక్షరములతో లిఖింపబడి తరతరములవారిచేతను స్మరింపబడుతూన్నది.

ఇట్టిపనులు కరుణతోడను, ధర్మశీలముతోడను నిండినవి; పేరుతెచ్చుకోవలెననే ఆశతో ప్రేరేపబడినవి కావు. క్రియాపర్యవసానమును చూడగానే ప్రేక్షకుని మనసులో ఉదయించిన హఠాత్సంకల్పజనితము లీకార్యములు. ఇవి నిష్కామకర్మలు. చేసినవారికిని, వాని ఫలితము లనుభవించువారికిని గూడ ఇవి సంతతానందప్రదములైవెలయును

గొప్పవారుచేస్తే యిట్టికార్యాలకు గ్రంథాలలో స్థానం సులభంగా దొరుకును. కొలదులుచేస్తే కీర్తింపబడకపోతే సరిపోయె గుర్తింపబడవుకూడా. ''గొప్పవారికుక్క చస్తే పదిమందీ వారిని వోదార్చి వారికి కలిగిన తీర్పరానిలోటుకు విచారిస్తారు'' అని గోల్డుస్మిత్తు వ్రాస్తే చదువుకుని యింతవిపరీతమా అనుకున్నాను. కాని నాలుగేండ్ల క్రిందట యిండియాకు సహాయమంత్రిగా పనిచేసిన రస్సెలు ప్రభువుగారు హిందూదేశపు భావిసంస్కరణాలనుగూర్చి అసందర్భంగా వుపన్యసించారు. కారణమేమా అని నాయకోత్తములు యోచిస్తే ఆరోజునసే శ్రీప్రభువుగారికి అభిమానపాత్రమైన భైరవమూర్తిగారొకరు కీర్తిశేషులైనారనీ, ఆమహావిచారమునమునిగి వారావిధంగా మాట్లాడారనీ సర్దిచెప్పారు. నిజమే. అయితే అయివుంటుందని పదిమందీ అంగీకరించి ''పాపం: యెంత కష్టం!'' అన్నారు. అది ప్రపంచలక్షణం: కలవారిని కీర్తించుట; లేనివారిని లెక్కసేయకుండా వుండడము.

ఇట్టి వుదారగుణసంపద గొప్పవారి కొకరికిమాత్రమేయిచ్చి తక్కువవారికి భగవంతుడు నిరాకరింపలేదు. అందరికి యిచ్చి ఇష్టమున్నవారు తీసుకోవలసిందన్నాడనుకుంటా.

నండూరి రామారావు పేదవాడు. చిన్ననాడు పెద్దపెద్దవారిస్నేహం చేశాడు. వారిదయవల్ల యిల్లు వొళ్ళూ గుల్లచేసుకున్నాడు.

ఒకనాటి వుదయం ఒకముసలిది - రోగిష్ఠి - వారియింటికి ముష్టికివచ్చింది. ఏకళని వున్నాడో దాన్నితిట్టి పొమ్మన్నాడు. కాని కొలదిసేపటికే అతనికి తీరని పశ్చాత్తాపం కలిగింది. ప్రతిష్ఠకొరకైనా చూసుకోకుండా వెంటనే వీధుంవెంట వెళ్ళి, ఆముసలిని వెదకి తీసికొనివచ్చి ఒకసేరుబియ్యము ఒక అర్థణాడబ్బులు యిచ్చి పంపినాడు.

### కుందూరి వెంకటరత్నంపంతులు

కుందూరి వెంకటరత్నం పంతులు చిన్నప్పుడు మిక్కిలి కష్టపడి చదువుకున్నాడు. ఎఱిగి అనృతమాడనివాడని నిశ్చయముగ చెప్పవచ్చును. ఒకనాటిరాత్రి అతను స్నేహితులు కొందరు గలసి కూర్చుండిరి. అచటికింకొకడువచ్చి అందున్నవారిలో ఒకనిని పిలచి రహస్యముగ పదినిముషాలపాటు మాట్లాడి వెళ్ళెను. వెళ్ళిన కొలది కాలముననే అతడు హత్యచేశాడనీ దానికి సలహా వెంకట్రత్నంగారిస్నేహితు డిచ్చాడనీ వదంతి బయలుదేరింది. కేసుపెడతారనుకుని ఆసంభాషణ జరగనేలేదని చెప్పమన్నారు వెంకట్రత్నాన్ని. కాని ఆసూనృతవాది ప్రాణత్యాగమునకైనా వొప్పుకున్నాడుగాని అసత్యముపలుకుటకు ఇయ్యకొనలేదు.

### వేదుల సత్యనారాయణశాస్త్రి

వేదుల సత్యనారాయణశాస్త్రియెడ లక్ష్మికి మిక్కిలి విముఖత. ఒకమాటీతడు రెండురోజులు తిండిలేకుండా గడిపాడు. చేతులో అర్థణావుంటే సాయంకాలమువేళ రెండు మినపరొట్టెలు కొనుక్కొని తిందామని బజారుకువెళ్ళి రొట్టెలతో వస్తూంటే అతన్ని మించిన దీనురాలొకతె చేయిచాచింది. ఆ భావుకుడు ఆనీరసస్థితిలోకూడా కరగి నీరయి ఒకరొట్టి దానిచేతిలోపెట్టి రెండవది తాను తిని నీళ్ళుత్రాగుదామని గోదావరికివెళ్ళాడు.

### వీరేశలింగంపంతులు

వీరేశలింగంపంతులుకిన్నీ కొక్కొండ వెంకటరత్నంపంతులుకిన్నీ సంఘసంస్కరణం విషయములో యెప్పుడూ షష్ఠాష్టకమే. కాని అంతమాత్రంచేత వీరేశలింగంపంతులు వెంకట్రత్నంపంతులుతో ప్రతివిషయంలోనుకూడా వేర్పాటుగావుండి గృహస్థమార్గోచితమైన సహాయసంపత్తులను నిరాకరించే లఘుమతిగాడు. వెంకటరత్నంపంతులు వృద్ధాప్యంలో డబ్బుకు చాలా కటకటపడ్డాడు. యూనివర్సిటీపేపర్లు వచ్చేవి దిద్దుబాటుకొరకు. కాని వానిని దిద్దే వోపిక లేకుంటే వీరేశలింగంపంతులు దిద్దిపెట్టి వెంకట్రత్నంపంతులుకు సాయంచేసేవాడు. ఇది యెందరకు తెలుసును?

### సర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు

కొందరు తాముతాముచేసే పనులన్నీ గుప్తముగా వుంచుతారు. సర్ రఘుపతి వెంకటరత్నంనాయుడుగారిట్టివారే. ఆయన వుద్యోగంలోవున్నప్పుడూ రిటైరయిన తర్వాతాకూడా యెంతరాబడివుంటే అంతా ఖర్చుపెట్టడమేగాని నిలవచేసుకొనడము యెరగరు. అనాథలు, దుఃఖితులు తమకష్టాలను గూర్చి వుత్తరాలువ్రాస్తే వీరిహృదయం వెన్నవలె కరగిపోతుంది. ఒకటవతేదీవరకు వచ్చిన వుత్తరాల వరవడిని తనకువచ్చిన డబ్బంతా పంచిపెట్టడమే. అర్థులు పరిచితులా అపరిచితులా అనే విచారణలేదు. కష్టంలో వున్నారంటే ఆయనదయావృష్టి వారిమీద కురియవలసినదే.

వాకిటిలోనికి కుక్కవచ్చినంతమాత్రాన దానికాలు విరగవేస్తాము; చేనుగట్టువంక మోరయెత్తి పశువుచూస్తే దానికి దండతాడనం తప్పదు; వృద్ధాప్యంవచ్చిన ఆవును గాని యెద్దునుగాని రైతు తనవద్ద వుంచు

కోడు. యావనమంతా తమబండిని లాగుటతో గడపిన యెద్దునుగాని, గుఱ్ఱాన్నిగాని వృద్ధాప్యంలో పనిమాన్పించి పోషించిన వివేకులెందరున్నారు? వీరేశలింగంపంతులొకడు, చిత్రపు వెంకటాచలంపంతు లొకడు. వీరేశలింగంపంతులు తనముసలియెద్దును, వెంకటాచలంపంతులు తనముసలి గుఱ్ఱాన్ని చివరకూ జాగ్రత్తతో మేపి మున్న చేశారు. వెంకటాచలంపంతులువద్ద పాతికముప్ఫైయేళ్ళనుంచి పనిచేస్తున్న గుఱ్ఱపువాడున్నాడు. గుఱ్ఱపుబండి తీసివేసి మోటారు పెడితే వాడిని మాన్పింపవలసి వస్తుందని మోటారు కొనకుండా గుఱ్ఱపుబండితోనే తనకాలముగడపి ధన్యుడైనాడు. ఒక సేవకుని క్షేమముకొరకు తనవిలాసతృష్ణను అడచిపెట్టుకొనిన యజమాని మందుకైనా దొరక డీరోజులలో.

ఘనకార్యాలు చూచుటకు మఱ్ఱివిత్తనాలవలె మిక్కిలి సూక్ష్మములు. అవి మొలకలెత్తిన అనంతరఫలితాలు మిక్కిలి సుఖకరములు; ఉభయలోకతారకములు. మహావృక్షములయి ఎందరికో చల్లనినీడ నిస్తవి, ఎన్నిజీవరాసులకో నివాసమై రాణిస్తవి. అటులే యిట్టి ఘనకార్యాలు మిక్కిలి చిన్నవైనప్పటికి—మనస్థూలదృష్టికి చిన్నవిగా కన్పిస్తవిగాని అణువులలో అణువును, స్థూలములలో స్థూలమును అయిన వాసుదేవుని దృష్టిలో మిక్కిలి ఘనముగానే చూపట్టుతవి—ఐహికాముష్మికములను సాధింపగలవిగా వున్నవి. జీవితమునందలి స్వల్పవిషయములలోకూడ దయాసత్యశౌచములను స్థిరముగ ప్రతిష్ఠించుకొని నడువగలిగినవారే ధన్యాత్ములు. వారే ఆదర్శపురుషులు, అనుకరణీయులు, చిరస్మరణీయులు.

—నిడమర్తి సత్యనారాయణమూర్తి, బి.ఏ.

## విముక్తి

ఆమె యేడేండ్ల బాలిక.

ఆమె చికురములలో మల్లెపూవులు కిలకిల నవ్వుచుండెను. ఆమె చెక్కులలో గులాబిరేకుల శోభ, ఆమె కనులలో కలువరేకుల నిగనిగ, హరిద్రవర్ణభూషితమైన యామెనుదుట నుదయభానునిం బోలిన కుంకుమబొట్టు తళతళ, ఆమెమెడలో మాంగళ్యంపు మిలమిల, ఆయమాయిక బాలికా సౌందర్యమునకు మనోహరత కూర్చుచుండెను.

విద్యుత్ప్రవాహమున వచ్చిన వార్త యాయింట నశనిపాతము. … …

ఆమె కన్నులలో బెదురు. ఆమె చేతులు వడకుచుండెను. అద్దముముందు కూర్చుండి యామె తలలో గబగబ పూవులు ముడుచుకొనెను. నుదుట పెద్ద కుంకుమబొట్టు పెట్టుకొనెను.

నీటికై పోయిన ముసలమ్మ యప్పుడే తిరిగివచ్చినది. 'ఏమో యాదారుణపు పని. పువ్వులతీసి పారవేయుము. బొట్టు చెరుపుకొనుము, ఊఁ' అని గర్జన. 'పెట్టుకుంటేయేమి?' అని యాబాల బిక్కవోయిన మోముతో ప్రశ్నించినది.

అవశ్యకతానిగళబంధితమును దురాచారకఠినశిలాకుడ్యపరివేష్టితంబును అగు నిమ్మహావిశ్వసాంఘికదేవతావిముక్తికై 'పెట్టుకుంటేయేమి?' అను ప్రశ్నతో ప్రయత్నించిన యాముగ్ధబాలికా వాక్యములకు నా హృదయము స్పందించినది.

—వజ్ఝల కాళిదాసు.

# బీహారము.

దూరపుదీవు లెయ్యవియొ దూఁగునటంచును విందుమార! యీ
భారతధారుణీరమణి బంధురకంఠవిహారహారి బీ
హారము బ్రహ్మవేత్త జనకావనిభుక్కృత శస్త్రమోక్షుల
క్ష్మీరమణీయరంగతలి గీడ్పుడు నిట్లని యెంతుమే? యహో!

మహితపతివ్రతాజనము మన్ననఁగన్నులఁగొన్న జానకీ
మహిళ భవత్సమాయుతసమస్తశుభంబుల పంటగాదె! త
త్తుహినకరాస్య కూరుములు దోఁగెడుపుట్టిలుగాదె యిద్ది! యి
ట్లహితముగూర్పఁగాఁ దలఁచి తంతశివంబట నీకు ధారుణీ?

తనరాజన్నవయౌవనంబు గని మందాక్షాలసేక్షాతతిన్
మనమించించుక దెల్పు భూరమణి నాత్మప్రేమబింబంబు మో
హనమూర్తిం గనుగందునందనుఁ దృణప్రాయంబుగావీడు ధ
న్యుని బోధామృతమాని త్రేనిచిన నీకో యీవగల్ మాగధీ?

చంద్రికాతపముల చనుపకాగుడిసెలతో భగ్నహర్మ్యముల్ తుడిచిపెట్టి.
కనులనూపిరిదాల్చు కటికిపేదలతోడ విత్తాధిపుల నొక్క వేదిఁగూల్చి
పొడచూడఁగారాని కడపటిజాతితోఁ భూసురాన్వయమును బొదివిమెదిపి
వాయెఱుంగని నరవ్రాతంబుతోఁ గనుల్దలఁగల యధిపులఁగలిపి మట్టి
తెప్పపాటునఁ బురములు గుప్పఁగూల్చి చెరువుమరువులు తలక్రిందు చేసి యిట్లు
పీరవిహారణ నెఱప మానేరమేమి? పరమకరుణాసమేత! ఓ ప్రకృతిమాత!

నేఁటి కిటు లూయెలలనూఁగ నీకు బుద్ధివొడమెనో ధాత్రి! మొన్నటి బొట్టెవోలె,
నంకతలి పుత్రకుల నింత యరయవలదె యీవెయిటులైన మాకు దిక్కేది? తల్లి!

కడచినదానికి వగచినఁ గడచనునే యడలుకడలి కానున్నది యేఁ
గడమవడునె? బీహారమ! యుడుగుము వలవంత దిటవునూనుము యింతన్.

తనజననీమణీస్తనసుధారసమాని సంబరంపడుచున్న చంటిపాప
తనభావిసుఖవరంబునుగోరి బొమ్మలఁగొలిచి యూలాడించి కులుకుఁగన్నె
తనవలపులరూపుఁగని యూలమున నేత్రముల మేలమాడెడు ముద్దరాలు
తననోముపంట బిడ్డను గుస్తరించుచు బిగియఁగౌఁగిటనొత్తు మగువమిన్న
పేఁడుఁగాలంపుఁ దనశ్రమ యిటుపండె ననుకొనుచుఁ బైరుపచ్చలఁ గనెడురైతు
నట్టి తిలకించులోపల నిట్టె పొట్టఁ బెటుకొంటి వదేమి పాపిష్ఠిభూమి!.

—వడ్లమూడి వేంకటరత్నము.

# 'తప్పేమున్నది?'

ఆయనపేరు హనుమయ్య. చాలమంచిబ్రాహ్మడు. అట్టేచదువుకున్నవాడుకాడు. చదువంటే ఇంగ్లీషని కాదు. తెలుగుకూడ నట్లులేకుండా చదువలేడు. అక్షరాలుగుర్తుపట్టి మెల్లిగా వెళ్ళదీసినా చదివినదాని అర్థమసలే తెలియదు. మంచిబలశాలి. కాయకష్టమెంతైనా పడగలవాడు. కొద్ది భూవసతి ఉన్నది.

ఆయన భార్యపేరు మహాలక్ష్మమ్మ. ఆమె హనుమయ్యగారికంటె ఉదాణీగా అవుపడుతుంది. ఏదైనా వస్తువు ఇంట్లోకికావాలని హనుమయ్యగారికి తోచి తీసికొనివచ్చింతర్వాత ఇరుగుపొరుగమ్మలక్కలతో "ఏమేవ్! కావమ్మ!! ఫలానివస్తువలేక ఇంట్లో మహాఅవస్తపడుతున్నామే. నిన్న కంచరవాళ్ళొచ్చారు. అప్పుడు మీఅన్నయ్యతో చెప్పి ఇది కొనిపించానే." అని లేనిపోని పెత్తనం నెత్తినవేసుకొనేది. నిజానికి ఆవస్తువు కొనేవిషయంలో ఆవిడ అభిప్రాయమైనా పుచ్చుకునేవాడుకాదు హనుమయ్యగారు. ఆమె ప్రతివిషయంలోనూ ఇంతే.

ఈదంపతులకు ముగ్గురు మగపిల్లలు, ఏడుగురు ఆడపిల్లలు-వెరశి పదిమంది.

కాపురం పెద్దదైంది. ఉన్నభూవసతితో ఎనిమిదినెలలగ్రాసం గడుస్తుంది. తక్కిన నాలుగునెలలకు సరిపోను సంపాయించాలి. అందుకుగాను స్వంతవ్యవసాయం మొదలుపెట్టాడు హనుమయ్యగారు. శక్తికిమించి కష్టపడేవాడు. కాని అదృష్టము చిన్నచూపు చూచింది. కూలిమళ్ళితే గొప్ప. అదీ చేతిదిపడితే లంగు. ఇతరులకంటె ఎక్కువకష్టమే పడేవాడు. గ్రహవీక్షణ సరిగా లేకపోతే కష్టానికి తగినఫలితమురాదు. బ్రాహ్మణవ్యవసాయమన్నమాట సార్థకమైంది. దెబ్బతిన్నాడు బ్రాహ్మడు.

మొదటిముగ్గురికూతుళ్ళ పెళ్ళిళ్ళుచేశాడు. తాను దమ్మిడీకట్నము ఇవ్వలేదు దమ్మిడీపుచ్చుకోలేదు. సాలంకృతకన్యాదానాలు చేశాడు. బ్రాహ్మడు బీదతనంలోఉన్నా శాస్త్రోక్తంగా చేశాడన్నారంతా. తరువాత ముగ్గురికూతుళ్ళపెళ్ళి ఎదురుకెదురిచ్చి ముగ్గురికొడుకులపెళ్ళిళ్ళుకూడా పూర్తిచేశాడు. శాస్త్రోక్తముగాకపోయినా ఇంతకంటె చేయతగ్గది లేదన్నారంతా.

దానాదీనా రెండువేలపైకి దాకొన్నది అప్పు. ఏ సంవత్సరం రాబడి ఆసంవత్సరం తిండికి చాలక అప్పు తీసుకురావలసివస్తున్నది. పెద్దపత్రంలోకి ఏమాత్రం చెల్లులేకపోగా కొత్తఅప్పులు బలమాతున్నవి. అప్పులకు వడ్డీలు పెరుగుతున్నవి. కొద్దిరోజులలో ఉరుముణిగేట్టు తోస్తున్నది. కుడితిట్లోపడ్డ ఎలుకలాగా కొట్టుకుంటున్నాడు హనుమయ్యగారు. ఏమీతోచక కొట్టుకోటమే నిలిచిందిగాని మార్గమేమీ అవుపడలేదు. కాని మహాఆవేదన పడుతున్నాడు.

* * *

శేషగిరిరావుగారు యఫ్. ఎ పరీక్షలో ఉత్తీర్ణులై కోర్టుయిలాకా ఉద్యోగముచేశాడు. మంచిదైవభక్తిగలవాడు. వేదాంతంలో కొంతవరకు పరిశ్రమచేశాడు. ఉద్యోగరీత్యా బాగాడబ్బుసంపాదించి బెజవాడలో చక్కని మేడగట్టాడు. మేడగాక పైగా పదిపదిహేనువేల రూపాయలు కిమ్మతుగల ఆస్తి సంపాదించాడు. చనిపోయినా, జ్ఞాపకమువచ్చినప్పుడు "మహాదొడ్డమహారాజు. చల్లనివేళ తలపుకువచ్చాడు, చెయ్యెత్తిదణ్ణంపెట్టొచ్చు" నంటూ రాయననుగురించి.

ఆయనభార్య కామమ్మ గయ్యాళిగచ్ఛపోద. ఆమెనుచూస్తే ఆయన హడలిపోయేవాడు. అమహాతల్లి కన్నకన్నవాళ్ళకాళ్ళు పట్టుకొని, అవుపడ్డ రాయికి రప్పకల్లా మ్రొక్కి కన్న దొకసుపుత్రుణ్ణి.

వాడికి ఇరవయ్యేండ్లనాటి సంగతిది.

మనిషియావత్తూ నాలుగున్నరడుగుల పొడవుంటాడు. తలకాయ పసిపిల్లవాడి తలకాయంత లావుంటుంది. మొహం కోతినిగెలిచితెచ్చుకున్నాడు. కళ్ళు,

ముక్కు, నోరు, అన్నీ ఉన్నవి క్రమములు. నోరు చక్కగా అన్నంతినడానికి పనికివస్తుంది. మాట్లాడబోతే గొంతుకోమాట బయటపడుతుంది. అవైనా సాంతంగా మూగిగాక, సాంతంగా రాగగాక నంగిమాటలు. చేతులు మొరికిపోయి మధ్యకు వంకరపోయిన మిల్లిగరిటెల్లా ఉంటవి. కాళ్ళు మోకాళ్ళదగ్గర వంకర. సాఫీగానిలబడలేడు. అడుగుపెడితే అడుగడుగుకు పడిపోతాడేమో ననిపిస్తుంది. కాని పడిపోకుండా నడవడం చాలామంది చూశారుట. వాళ్ళమ్మ చెప్పడంమాత్రం "మా అబ్బాయి ఇవ్వాళ్ళ పొలంవెళ్ళి పెరుగు తెచ్చా"డంటుంది. ఆ పిల్లవాడికి మొత్తంమీద ప్రపంచధోరణి ఏమీలేదు. కాకపోతే "అబ్బాయి! ఇదిగో నెయ్యి" అంటే చెయ్యిపట్టి "ణెయ్యి" అంటాడుగనుక మనిషి అనుకోవాలె.

ఈసుపుత్రుడివల్ల తనభర్తకోవ సాగవలెనని కామమ్మగారి ఆశయం. అందువల్ల అనేకవిధాల ప్రయత్నం చేసింది పెళ్ళిచేద్దామని. ఎవ్వరూ ఇచ్చారుకారు.

విచారణవల్ల హనుమయ్యగారి దగ్గర ఒకపిల్ల ఉన్నట్టు తెలిసికొన్నది. పనీపడా వాళ్ళ ఊరువెళ్ళి హనుమయ్యగారిని కలుసుకొని మాట్లాడి "మాఅబ్బాయికి పిల్లనిస్తే రెండువేలరూపాయలిస్తా"నన్నది.

పిల్లవాడిసంగతంతా తెలుసు హనుమయ్యగారికి. ఇల్లాంటిపని ఇదివర కెప్పుడూ చేసినవాడుకా డాయన. ఇదివరకు చేసినవన్నీ సాలంకృత కన్యాదానాలు. దమ్మిడీపుచ్చుకోలేదు, దమ్మిడీయివ్వలేదు. ఇప్పుడీగడ్డి ఎట్లాతినేదా అనిపించింది. "ఇదివర కెన్నివేలు నా కుటుంబానికి ఖర్చుకాలేదు! ఇంకా ఎన్నివేలుకావు!! వెధవ ఈరెండువేలూవచ్చి నన్ను ఉద్ధరిస్తవా? ఉద్ధరిస్తేమాత్రం నాకుగాను ఒకచిన్నపిల్లగొంతు అజన్మాంతం కోయ్యనా? ఛీ! ఈపనినేను చెయ్య"ననుకొన్నాడు. ఈవిషయం వినగానే కలిగిన భావాలివి.

తిరిగి ఆలోచించాడు. "రెండువేలిస్తానంటున్నది కామమ్మగారు. రెండువేలతో అప్పు చాలావరకు తీరిపోతుంది. చాలాభారము తగ్గుతుంది. ఎల్లకాలం ఆడపిల్లలు నాయింట్లోఉండరు. వాళ్ళయిళ్ళకు వాళ్ళు కాపురాలకు వెళ్ళుతారు. ఖర్చుతగ్గడానికి అవకాశమున్నది. అప్పుడు సంవత్సరానికింతని మిగిలిన అప్పు తీర్చ-కాని కూతుళ్ళు వెళ్ళితే కోడళ్ళు కాపురాలకువస్తారు. సంవత్సరానికొకసారి ఏకూతురినో ఒక కూతురుని పురుడుకో పుణ్యానికో తీసుకురావలసి ఉంటుంది. కనుక ఖర్చుతగ్గడానికి అవకాశంలేదు. కామమ్మగారి కొడుక్కు పిల్లనిస్తే వా రాస్తిపరులుకావడంచేత తన కాపురంఖర్చులు, పైయితరఖర్చులు వాళ్ళింట్లోజరుపుకుంటూ అప్పుహాయిగా తీర్చుకోవచ్చు. పైగా కామమ్మగారు ఎట్లాఅయినా ఆడది. తా నజమాయిషీ చేయవచ్చు." ఈ అభిప్రాయాలు ఆయనమనస్సుకెంతో ఉత్సాహమిచ్చినయి. దానినుండి తప్పించుకోలేకపోయినాడు.

ఈ అభిప్రాయానికి అనుకూలంగా ఆలోచించడానికి మొదలుపెట్టాడు. 'పిల్లకుమాత్రంఏమి? పెద్దమేడ. ఇల్లంతాగచ్చు. దొడ్లోబావి. కాలుబయటికి కదపాలిసిన అవసరంలేదు. కావలసినన్ని సొమ్ములుపెట్టుకోవచ్చు. ఎండకాలంలో మేడమీద హాయిగా పడుకోవచ్చు. సంవత్సరానికి పదిపుట్ల గింజలొస్తవి. తానింత తిని ఇతరులకింత పెట్టవచ్చు.'

"సరే" నన్నాడు హనుమయ్యగారు. లలితకు—హనుమయ్యగారి కనిష్ఠపుత్రిక—కామమ్మగారి కుమారుడికి మహావైభవంగా వివాహమైంది. బ్రాహ్మడు చెయ్యరానిపని చేశాడన్నారంతా.

* *

తరువాత ఆరుసంవత్సరములనాటికథ.

లలితకు తల్లిపోలికవచ్చింది. చాలతెలివిగలపిల్ల. సంస్కృతం, తెలుగుసాహిత్యాలలో చక్కని ప్రవేశం కలిగించుకుంది. రెండుభాషలలోనూ గొప్పగొప్ప ప్రబంధాలుచదివి లలితభావాల నలవరుచుకుంది. "పతే దైవమని, పాతివ్రత్యమే సతికి భూషణమని" ఉత్తమగ్రంథాలుద్ఘాటిస్తున్నవి.

లలిత కిప్పుడు పదిహేనోయేడు. అత్తవారింట్లో కాపురంచేస్తున్నది.

కామమ్మగారు వంటచేసి రాత్రి ఏడుగంటలకు కుమా




రుడికి భోజనం పెట్టారు. లలితభర్తను చేయికడుక్కోనుసీళ్ళు, తుడుచుకోను తుండుగుడ్డయిచ్చి ఆవిస్తట్లోనే కూర్చొని భోజనంచేసింది. తరువాత ఇంట్లో పనిపూర్తిచేసి బయటికి వచ్చింది.

సాయంత్రం అయిదుగంటలకు తలదువ్వుకొని జారుజెడ వేసుకున్నది. కాని యిప్పుడుమళ్ళీ అద్దంముందుకు వెళ్ళి చెంపలుదిద్దుకున్నది. పమిటకొంగుతో నుదురు, కళ్ళక్రింద, ముక్కుమీద గట్టిగాతుడుచుకుని మళ్ళీ అద్దంలో చూచుకున్నది. కాటుకపెట్టుకోనిలోపముస్పష్టముగా అవుపడ్డది. వెంటనే బొట్టుపెట్టెలోనుంచి కాటుకకాయతీసి చక్కగా తీర్చినట్లు కాటుకపెట్టింది. మళ్ళీ చూచుకున్నది తననుతాను అద్దంలో. బయటికిపోయి పూలతీగనున్న ఎర్రనిపూలు ఆకులతోకూడకలిపి పట్టెడైతే జడలో తురుముకున్నది. లోపలికివచ్చి పెట్టె తీసి అదికాదని ఇది, ఇదికాదని అది నాలుగుచీరలు కాదని బ్లు ఆగ్రాచీర బాగున్నదని కట్టుకున్నది. తననుతాను అద్దంలో నాలుగోసారిచూచుకున్నది. తనఅందానికి తానే ముగ్ధురాలైపోయింది ఏవేవో భావాలు ఒక్కసారిగా ముసురుకొని వచ్చిన 'వా మెకు. ఆగలేక ముందు కొకఅడుగువేసింది. కాని చీరెకట్టుకుంటున్నప్పుడు తలకుతగిలి తలచెరిగినట్లు తోచింది. మళ్ళీ వెనుకకువచ్చి తలచక్కగా దువ్వుకున్నది. దువ్వుకుంటూతన ప్రతిబింబాన్ని చూచినప్పుడు ఏమింతభావాలువచ్చినవో, కంటివెంట ఒకనీటిబొట్టు జారింది ఆమెకు. కొలకులనుంచి చెక్కిళ్ళమీదికి జారిన కన్నీరు తుడుచుకుని బయలుదేరింది తనదైవాన్ని సంతోష పెట్టడానికి.

మంచముమీద ఒకప్రక్కకుఒదిగి పడుకొని నిద్రపోతున్నాడు భర్త. మెల్లగా తట్టిలేపింది. అందరకువలెనే కళ్ళునలుపుకుంటూ, ఒళ్ళువిరుచుకొని, ఆవులించి నిద్రలేచాడు. "తనభర్తకూడ మనిషే. అట్టేభయపడవలసిన అవసరములే"దనుకున్నది. తమలపాకులు సేవింపనిచ్చింది. మేకమాదిరి నమలుతున్నాడు. తానూ సేవించింది అధరోష్ఠము ఎర్రగా దొండపండులాగ పండి తన అందాన్ని ద్విగుణీకృతముచేసింది. మంచముదిగి ఊదుకడ్డీలు వెలిగించింది. అవి గదంతా కమ్మనివాసనలు వెదజల్లుతున్నవి. అత్తరుబుడ్డితెచ్చి అతనిమీద కుమ్మరించింది. తాంబూలసేవనముకాని, వాటిసౌరభాలుకాని అతనిలో ఏమీచదలిక కలిగించలేదు. ఈకమ్మనివాస

నలు లలిత తలకెక్కినవి. తాంబూలసేవనం వాటికి తోడైనది. దీనా, దానా ఆమెకు పిచ్చెత్తుతున్నది. మంచముమీదికివచ్చి అతనినిగట్టిగా ఆనుకుని కూర్చొని తన మృదులహస్తముతో అతనిదేహాన్ని వివిధప్రదేశాల తాకింది. అస్పర్శ్యాసుఖానికి ఆమెఒళ్ళు జలదరించింది. కనులు విశాలములైనవి. ముక్కుపుటము లదురుతున్నవి. హృదయముతటతట కొట్టుకుంటున్నది. కాళ్ళు వణుకుతున్నవి. అతనిలో ఏమికదలికలేదు. ప్రాపంచికసౌఖ్యాలు తననుకదపజాలని ఋషీశ్వరుడులాగున్నాడు. తనచేత్తో ఆమె అతనిప్రక్కను తాకీతాకకుండా అతనికి గిలిగింతపెట్టింది.

"ఏమిటీ చక్కిలిగిలిపెడతావు" అన్నాడు అతను నంగిమాటలతో కోపంగా.

తాను ప్రేమించేది చెక్కగాని, రాయిగానిగాదు. పైకగపడకుండా లోనణగిఉన్న యౌవనాని కుద్వేగం కలిగించగలనేమోనని ఆశకలిగింది. తనహృదయావేగానాపుకోలేక పైబడి ముద్దుమీదముద్దుగా వేయిముద్దులు పెట్టుకున్నట్టు పెట్టుకున్నది. పెట్టుకుంటున్నకొద్దీ తన్నుతాను మరచిపోతున్నది. తల దిమ్మెక్కినది. ముచ్చెమటలు పోసినవి. ఒళ్ళంత గజగజ వణకిపోతున్నది. ఒళ్ళువేడెక్కింది. అతన్నికౌగిటిలోకి తీసుకొని ఎదురురొమ్ముకు గట్టిగా అదుముకొన్నది. కళ్ళు వాటంతటవి మూసుకుపోయినవి. పెదవులు కదలుతున్నవి. ఒకక్షణమాత్రం అతనికౌగిటిలో చైతన్యములేని ఒక పదార్థములాగుండిపోయింది. అతనిలో మాత్ర మేమీ కదలికలేదు.

కౌగిలివిడిచి, ప్రక్కకుతిరిగి కళ్ళుతెరిచేటప్పటికి జలజలాజారింది కన్నీరు.

"నన్ను ఇలాంటివాడి కెందుకివ్వాలి తనతండ్రి ఎరిగి యెరిగి ?" తనమీదతీసుకున్న రెండువేల రూపాయలు ఆయన్నేమి బాగుచేసినవి ? ఆయనస్థితి ఇప్పటికీ అప్పటికీ ఏమీతేడాలేదే ? ఉంటేమాత్రం తన్నిలా అన్యాయంగా గొంతుకోయడాని కాయన కేమధికారమున్నది? ఆయన్ననడమెందుకు ? పాపము! పూర్వకర్మఫలితమిది. క్రిందటిజన్మలో ఎవరికాపురానికి ఏంచేటు తెచ్చానో? ఈజన్మలో ఇది అనుభవించకతప్పదు. ఈ జన్మ కిక యింతే." ఈతుది అభిప్రాయాన్ని సహించలేకపోయింది. తనయౌవనోద్రేకాన్ని ఎట్లా ఆపుకుంటుంది. ఎన్నాళ్ళని ఇట్లా ఉండగలుగుతుంది. ఏక్షణానికి ఏమితప్పుచేస్తుందో, ఏంపాపము మూటగట్టుకుంటుందో. హృదయం పగిలిపోతున్నది. ఒకపావుగంట మంచంమీద బోర్లపడుకుని వెక్కివెక్కి ఏడ్చింది. తలక్రింద తలగడ తడిముద్దయింది.

పైకి ఏడ్చినందువల్ల మేఘంలేని ఆకాశములాగయింది తనహృదయము. అక్కడ అప్పుడేవిధమైన భావాలులేవు. హృదయానికి శూన్యత్వమావేశించింది. ప్రపంచంలో శూన్యప్రదేశ మెక్కువసేపుండడానికి వీల్లేదు. క్రొత్తభావాలు తరుముకొస్తున్నవి. వాటిని తోసివేయడానికి మంచందిగి బీరువాలోనుంచి చేతికొచ్చిన పుస్తకంతీసింది. మహాభారతము ఆదిపర్వము చేతికొచ్చింది. కళ్ళుమూసుకుని పుస్తకంతెరిచి చదివింది.

పాండురాజు తనకుగాను ఏదేవుణ్ణయినా ఉపాసించి కుమారులను కనమని బ్రతిమాలుతున్నాడు కుంతిని. ఆమె తప్పని అనుమానించింది. పాండురాజు, భర్త ఆజ్ఞ ప్రకారం జేస్తే తప్పుగాదని సప్రమాణంగా నిరూపిస్తున్నాడు. కుంతి చాలసేపు పరపురుషుణ్ణి సంతానమివ్వమని కోరడానికి ఒప్పుకోలేదు. పాండునృపతి ఉదాహరణలమీద ఉదాహరణ లిస్తున్నాడు. ఒకంతకు కుంతి ఒప్పుకున్నది. తనకు దూర్వాసమహాముని యిచ్చిన మహామంత్రంయొక్క ఉపాసనాఫలితంగా ఏదేవుడి దయనైనా పొంది కుమాళ్ళను కంటానని వాగ్దానము చేసింది పాండురాజుకు.

అసహాయులకు దేవుడే సహాయం. లలిత కాకథలో దేవుడుతనకు చూపించినదారి కనుపడ్డది. సన్నని ఆమె పెదవులమీద చిరునవ్వు తాండవమాడింది. హుషారుగా లేచి మంచము సమీపించింది. నిద్రపోతున్న భర్తను గట్టిగా తట్టిలేపి "నీకు కొడుకులు కావలెనా?" అన్నది ఆవేశంతో. అతని కేంఅర్థమైందో, ఏంకాలేదో "ఆ" అన్నాడు. "ఆ అంటే కావలెనా" అంది. "కావలె" నన్నాడు. ఆమెమొహం తేజోవంతమైంది.

*  *  *

వీరింటికిప్రక్కనే నివసిస్తున్నాడు కృష్ణమూర్తి. కలెక్టరాఫీసులో గుమాస్తా. పచ్చగా, సన్నగా ఉంటాడు. అతనిక్రాపింగు మొహంమీదికి వాలిఉంటుంది. వెంట్రుకలలోనుండి అతనుపెట్టుకున్న ఎర్రనిసిందూరపుబొట్టు అవుపడుతూఉంటుంది. అతనినుదురు వెంట్రుకలచాటున దోబూచులాడుతూ ఉంటుంది. అతని మొహానికి అందం అతనికళ్ళు. మనిషిచాలా నాజూకుగా ఉంటాడు. అతనుండే ఇల్లు కామమ్మగారి వసారాలోకి కనపడుతూఉంటుంది.

సాయంత్రం 5 గంటలయింది. లలిత చక్కగా సింగారించుకొని వరాండాలో బెంచిమీద కూర్చొని ఏదోపుస్తకంచదువుతున్నది. కృష్ణమూర్తి ఆఫీసునుంచి వచ్చి కోటువిప్పకుండానే తనవాకిట్లోనిలుచుని లలితవైపు చూస్తున్నాడు. "చాలాచక్కనిపిల్ల. అన్యాయం జరిగిం"దనుకున్నాడు. లలిత చదువుతున్న పుస్తకంమీదినుంచి కళ్ళుఎత్తి చూచింది. ఇద్దరిదృష్టులు కలిసినయి. వెంటనే తలవాల్చింది లలిత. మరల ఎత్తేటప్పటికి కృష్ణమూర్తి తనవైపే చూస్తున్నాడని గ్రహించింది. ఆమెకు తెలియకుండానే ఆమెకన్ను చలించింది, ఓరచూపు చూచింది. మరుక్షణమే తననుగురించి అతడేమి దురభిప్రాయపడతాడోనని భయపడ్డది. ఆమె కనుసైగచూచిన కృష్ణమూర్తి తను భ్రమపడ్డానేమోననుకున్నాడు. అయినా తెలుస్తుందిగదా అని తన్నామె చూచినప్పుడు చిరునవ్వునవ్వాడు. ఆమె ముద్దులొలికేటట్లు నవ్వింది.

మరునాడే కృష్ణమూర్తి భార్య నేవోసాకుమీద పుట్టింటికి పంపాడు. అదిమొదలు రెండునెలలు లలితాకృష్ణమూర్తులు స్వర్గసౌఖ్యా లనుభవించారు. లలిత తన సాహిత్యజ్ఞానంతో ప్రేమను అలంకరించింది. రసజ్ఞుడైకృష్ణమూర్తి దాని ఉత్కృష్టతను మనసార గ్రోలినాడు. లలిత గర్భవతియైనది. నవమాసస్ఫూర్తై శుభలగ్నాన చక్కనికుమార్తెనుకన్నది. పిల్ల అచ్చంగా కృష్ణమూర్తిపోలిక. లలిత ముచ్చటపడి "కృష్ణ" అని నామకరణం చేయించింది పిల్లకు.

తనభర్త అనుజ్ఞప్రకారం ఆయనకోవ కొనసాగే ఏర్పాటు జరుగలేదు.

కృష్ణమూర్తికి రేపల్లె తాలూకాఫీసుకు బదిలీ అయింది. ఆయనఉన్నయింట్లోకి ఆనందరావని బి.ఎ. యల్.టీ., స్కూలుమేష్టరు వచ్చాడు. ఆయనభార్యను, కనడానికి పుట్టింటికి పంపించి ఒక్కడూ ఆ యింటిలో ఉంటున్నాడు. సామాను వెనుకగదులలో సర్ది, ముందు రెండుగదులు తానుపయోగించుకుంటున్నాడు. ఆనందరావు గారు స్ఫురద్రూపి. కొంచెం బొద్దుగాను, పొట్టిగాను ఉంటాడు. చక్కని తీరైన మీసాలు ఆయన అందాన్ని ఎక్కువజేస్తున్నవి.

ఒకవారంరోజులలోనే లలిత, ఆమెభర్తల మధ్యనున్న సంబంధాన్ని పూర్తిగా గ్రహించాడాయన. కాని లలితకు కుమార్తెకలిగింది. 'అవును, పాపం! ఎవరైతే మాత్రం ఎన్నాళ్ళని ఊరుకుంటారు. తప్పేమున్నది గనుక' అనుకున్నాడు. ఆనందరావుగారిభార్య అక్కడ లేకపోవడంమూలాన లలితాఆనందరావులకు స్నేహం కావడం ఎక్కువరోజులు పట్టలేదు. భార్యప్రసవమై పిల్లవాడికైదోనెలవచ్చి తీసికొనివచ్చేదాకా వారిద్దరూ మేఘాలమీద ఆడిపోయినారు. పరిచయంవల్ల లలిత తెలివితేటలను ఆనందరావు గ్రహించాడు. భగవంతుని ఎదుట తనేమైనా తప్పుచేస్తున్నానేమోనని ఆనందరావుకు తోచినప్పుడు లలితనుజూచి "ఇంత చదువుకున్నదానివి కదా ! ఈపనిచేయడం తప్పుకాదా? దీనికి దేవునిదగ్గర ఏంప్రత్యుత్తరం చెబుతా"వంటే ఆమె తన స్థితిని తెలియజేసి తనయిప్పటిస్థితి తనభర్త అనుజ్ఞాప్రకారమే కాని ఇతరముకాదని సమాధానముచెప్పింది.

లలితకు రెండోసారి గర్భమై, పదినెలలు నిండినపిదప ఒకకుమారుడు కలిగినాడు. చిదానందం అని నామకరణం చేయించింది లలిత. ఆనందరావు కుమారుడిని, లలితకుమారుడిని ఒకేబళ్ళోకి పంపారు. చిదానందం తెలివితేటలుచూచి పరవశుడైపోయేవాడుపాధ్యాయుడు.

కామమ్మగారు మనుమడినిచూచి ఉప్పొంగిపోయేది.

— మొదలి సీతారామస్వామి, బి.ఏ.

# కరిబసవస్వామి

[ఆంధ్రదేశ స్థానికచరిత్రకు చెందిన ఒక చిన్న కథ.]

అనంతపురపుఁ గోటయందు రెండువందల సంవత్సరములకు ముందు 'పవాడప్పనాయఁడు' అనువాఁడు రాజ్యముచేయుచుండెను. అతఁడు 'కడప' పట్టణమున రాజ్యముచేయుచుండిన ఒక తురకనవాబునకు లోఁబడి ప్రతిసంవత్సరము కప్పముకట్టుచుండెను. ఆ నవాబు 'రామాజీ' అను బ్రాహ్మణుని తనపక్షమునఁ గార్యములు చక్కఁబెట్టుటకు పవాడప్పనాయని దగ్గఱ యుంచెను.

హాండేయనంతపురాఖ్యలక్ష్మిని, పవా
డప్పనాయఁడు కయిసందినపుడు
స్వామివిద్రోహియై రామాజి నృపుని సం
స్థానంబుఁ గోల్పెట్టఁ బూనినపుడు
కడపసేనానులు కడుకొని, దారసేమ
రించి, యొంటరిగ బంధించినపుడు
కోటతల్పులు మిత్రకోటికి గుటినిమీటి
తురకమూఁకలతోడ బెరసినపుడు
తనమహామంత్రశక్తి నేర్పునఁ, దదీయ
యవనసేనను దునిమి, నాయకునిఁ బ్రోచి,
లలిని రాజభక్తికిఁ బూర్ణలక్ష్యమగుచు
మొనరె, కరిబసవస్వామి మోక్షకామి.

—సీరిపి ఆంజనేయులు.

కడపనవాబు కొలువున మహమ్మదుఖాను, ఆలీఖాను, సర్దారుఖాను అను ముగ్గురు సరదారు లుండిరి. వారు ముగ్గురును తమసేనతో నొకసారి యెక్కడికో పోవుచు అనంతపురమున కొకమైలుదూరముననున్న జూటూరువంకదగ్గఱ డేరాలువేసికొనిదిగిరి. ఈసంగతి పవాడప్పనాయనికిఁ దెలిసెను. తాను కడపనవాబునకు సామంతరాజు. వచ్చిన ముగ్గురును నవాబువద్ద కొలువునన్నవారు. కావున నాయఁడు వారిని గౌరవించుట మర్యాద. అందుకని పవాడప్పనాయఁడు వారికిఁ గొన్ని కానుకలుపెట్టి రామాజీని వారివద్దకుఁ బంపించెను.

రామాజీ మంచివాఁడుకాఁడు. కుయుక్తులమారి. అగుటచే నాతఁడు కడపసరదారులవద్దకుఁ బోయినప్పుడిట్లుచెప్పెను: "పవాడప్పనాయఁడు త్రాగుబోతు. అందుచేత అనంతపురసంస్థానముస్థితిగతు లిప్పుడు చాల చెడియున్నవి. కోటలో సేనలేదు. బొక్కసమున ద్రవ్యములేదు. కొంచము ధైర్యముతో మీరీసమయమున పవాడప్పనాయని బెదిరించిన అనంతపురము మీచేతులలోఁ జిక్కును. ఇతఁడు నాలుగుసంవత్సరములనుండి మననవాబునకుఁ గప్పముకట్టుటలేదు. ఈమిషతో మీరీసంస్థానమును సులభముగా లాగుకొనవచ్చును. కడపనవాబువారి సరదారులు తమదర్శనానికి వచ్చుచున్నారని నేను పవాడప్పనాయనితోఁ జెప్పెదను. అప్పుడాతఁడు మిమ్ములను లోనికిఁ బిలిపించును. మీరువచ్చి దర్శనముచేసినతరువాత బాకీయున్న కప్పముకొఱకు నిక్కచ్చిగొనర్చి బెదిరింపుఁడు. వెంటనే అనంతపురము మీ స్వాధీనమగును."

ఇట్లు రామాజీచెప్పినమాటలు విని కడపనవాబు సరదారులు చాలసంతోషించిరి. పిమ్మట వారు రామాజీతో "నీవుపోయి మేముచూచుటకు వచ్చుచున్నామని పవాడప్పతోఁ జెప్పుము. మాపక్షమున మాసేవకులను కొందఱిని తీసికొనిపొమ్ము." అని చెప్పిరి.

అందుమీఁద వారివద్ద సెలవుతీసికొని రామాజీ కోటలోనికివచ్చి పవాడప్పనాయనితో నిట్లు చెప్పెను: "నవాబువారిసరదారులు తమదర్శనముకొఱకు వేచి యున్నారు. దర్శనమిప్పించుమని మిమ్ములను కోరుటకు నావెంట వారిమనుష్యులను పంపించినారు. కావున సరదారులను పిలిపించి దర్శన మిచ్చి వస్త్రతాంబూలములు బహుమానముచేసి పంపించిన గౌరవముగనుండును. మన

కార్యములకు ముందుముందుఉపకారిగా నుండును.''

రామాజీచెప్పిన దానికి పవాడప్పనాయఁడు సమ్మతించి వారిని తోడ్కొని రమ్మని ఆజ్ఞాపించెను. అప్పుడా బ్రాహ్మణుఁడు వారిని పిలుచుకొని వచ్చి యొక మేడమీఁద విడియించెను. పిమ్మట నతఁడా వృత్తాంతము పవాడప్పనాయనితోఁ జెప్పెను.

అప్పుడు పవాడప్ప కొలువుకూటమునకు వచ్చెను. కడపనవాబు సరదారులుముగ్గురు నచ్చటికివచ్చి యతని దర్శనముచేసిరి. నాయఁడు వారిని కుశలప్రశ్నముచేసెను. ''మీకుఁగావలసిన వస్తువులు సమస్తము నగరిలోనుంచి పంపించెదను. రెండురోజు లిక్కడనుండి నన్ను సంతోషపెట్టుఁడు'' అని నాయఁడు సరదారులను కోరెను. వారందులకొప్పుకొని తమ విడిదిమేడలోనికిఁ బోయిరి. తురకసరదారులకుఁ గావలసిన సమస్తపరికరములు, సకలపదార్థములు నొసంగుటకు పవాడప్పనాయఁడు రామాజీని నియమించెను.

వెంటనే రామాజీవారివద్దకుఁ బోయెను. వారికి వలసిన ఉపచారములు చేయించెను. పిమ్మట నాతఁడు వారితో ''రేపు మీరు పవాడప్పను దర్శించినప్పుడు నేనుచెప్పినప్రకారము కప్పముకొఱకు నిక్కచ్చిచేయుఁడు'' అని వచించెను.

మఱునాఁడు సరదారులు పవాడప్పనాయని దర్శనముకొఱకుఁ గొలువుకూటమునకు వచ్చిరి. రామాజీ ఈ సంగతి యంతఃపురమునను న్న పవాడప్పకుఁ దెలియఁజేసెను. వెంటనే నాయఁడువచ్చి




దర్శనమై కూర్చుండెను. అప్పుడు సరదారులు పవాడప్పనాయనితో నిట్లు చెప్పిరి: ''నవాబు వారికి నీవు నాలుగు సంవత్సరములనుండి కప్పము బాకీపడియున్నావు. ఇప్పుడామొత్తము చెల్లించవలెను. లేదా మావెంట కడపకువచ్చి నవాబువారికిఁ దగిన సమజాయిషీ చెప్పుకొనవలెను.''

ఇట్లు ఖండితముచేసి సరదారులు చెప్పగా పవాడప్పనాయఁడు ''ఇప్పుడు సొమ్మిచ్చుటకు వీలులేదు. నవాబుసాహేబులవారి సన్నదు ఉండినచో నీయండి. అది చూచుకొని మీవెంట కడపకువచ్చెదను.'' అని బదులు చెప్పెను.

ఆ మాటకుఁ గోపమువచ్చి తురకసరదారు లీవిధమునఁ బలికిరి: ''మేము స్వయముగా వచ్చియుండ నింకను సన్నదుకావలెనా? మామాటలయందు నీకు నమ్మకములేకపోయినను మాకుఁ జింతలేదు. నీవు మావెంట రానక్కఱలేదు. నవాబుగారికి నాలుగు సంవత్సరములకు నీవీయవలసిన అచ్చుబడిరూక లిచ్చివేయుము. అవి యిచ్చువఱకు నీ విచ్చటినుండి లేచివెళ్ళుటకు వీలులేదు. అన్నమునకు నీళ్ళకుఁగూడ వెళ్ళరాదు.''

ఇట్లు చెప్పి యా సరదారులు పవాడప్పను అక్క-

డనే ఖైదుచేసిరి. వారికి దయపుట్టినప్పుడు గుప్పెడు మెతుకులు, దొప్పెడు నీళ్ళుమాత్ర మిచ్చుచుండిరి. నాయఁడు తనస్థితికిఁ జాలదుఃఖపడుచుండెను. తంత్రగాఁడైన రామాజీచేసిన ద్రోహమువలన పవాడప్ప తన నగరిలోనే ఈ విధమున ఖైదుచేయఁబడెను.

పవాడప్పనాయనికి 'నిడుమామిడి కరిబసవస్వామి' అని యొక స్నేహితుఁడుండెను. కరిబసవస్వామి మతగురువు. కావున నతనిని 'స్వాములవారు' అని జనులు పిలుచుచుండిరి. అతనికి కొత్తచెఱువు అను గ్రామములో నొకమఠము, అనంతపురములో నొకమఠము నుండెను. అనంతపురములోని స్వామివారిమఠము పవాడప్పనాయని నగరినంటి పడమటిదిక్కున నుండెను. పవాడప్ప తన నగరిలో బంధింపఁబడిన సమయమున నతని స్నేహితుఁడు కరిబసవస్వాములవారు కొత్తచెఱువుమఠములో నుండెను. అతఁ డీసమాచార మెట్లో తెలిసికొనెను. ఇహలోకచింతలేని మతగురువైనను స్వామికిఁ జాల రాజభక్తి కలదు. అగుటచే నాతఁ డేవిధముననైన పవాడప్పను ఖైదునుండి విడిపింపవలయునని నిశ్చయించుకొనెను. కావున నాతఁడు కొత్తచెఱువునందలి తనవారినందఱిని తీసికొనివచ్చి అనంతపురమునఁ దన మఠములో దిగెను.

పవాడప్పనాయనికి చెన్నబసవన్న అని బావబఱఁది యుండెను. కరిబసవస్వామి యతనికి వర్తమానించెను. అందు మీఁద చెన్నబసవన్న స్వామిదగ్గఱకువచ్చెను. అప్పుడు స్వామి శివపూజకుఁ బూవులుకోసి పెట్టుగువు కొని రమ్మని చెన్నబసవన్నను పూలతోఁటలోనికిఁ దీసికొనిపోయెను. అచ్చట రహస్యముగ నాతనితో స్వామి యిట్లు చెప్పెను: "మీ బావగారిసంస్థానము నడిసముద్రములో మునుఁగునట్లున్నది. రామాజీ ద్రోహముచేసి యింతపని యొనర్చినాఁడు. మనమేవిధముననైనను తురకసరదారులను పాఱఁద్రోలి పవాడప్పను చెఱవిడిపింపవలయును. అతని సంస్థానము తిరిగి నిలుపవలెను."

కరిబసవస్వామి యిట్లు చెప్పగా చెన్నబసవప్ప వినెను. పవాడప్ప చెఱవిడిపించుటకు మార్గమేమున్నదాయని వారిద్దఱును చాలసేపాలోచనచేసిరి. పిమ్మట వారు గ్రామములోని కట్టుబడివాండ్రలోఁ బలుకుబడి కలవారిని పిలిచి యిట్లు చెప్పిరి: "మనసంస్థానము మునిఁగిపోవు స్థితిలో నున్నది. పవాడప్పనాయనివారిని అన్నమునకు, నీళ్ళకుఁబోనీయక తురకసరదారులు ఖైదు చేసినారు. దయపుట్టిన కాసిని మెతుకులు, కాసినినీళ్ళు నిచ్చుచున్నారు. మనమిందఱము బలగముండియు మన రాజు ఈ ప్రకారము శ్రమపడుచుండగాఁ జూచుచు నూరకుండుట న్యాయము కాదు అతని చెఱవిడిపించుటకు మనమాహారనిద్రలుమాని ప్రయత్నింపవలసియున్నది"

అప్పుడు వారిమాటలకుఁ గట్టుబడివాండ్రిట్లు చెప్పిరి: "అయ్యా! మేము మనుష్యమాత్రులము. మే మేమి చేయఁగలము? కోటగుమ్మములలో రెండు తురకసరదారుల స్వాధీనమైయున్నవి. పాతవాళ్ళమని మమ్ములను కోటలోపలికి రానీయరు. తురకసరదారులు కోటలోనికి వచ్చునప్పుడు చాలమంది భటులతోఁ గలసి వచ్చిరి. పిమ్మట వారిసేనయంతయువచ్చి కోటలోఁ బ్రవేశించెను. మేము తొందరపడి దౌర్జన్యముచేసిన వారి చేతులలోఁ జిక్కియున్న పవాడప్పనాయనివారి కేమి యుపద్రవముకలిగింతురోయని సంశయించుచున్నాము. మీ మఠము రాజుగారి నగరినంటియున్నది. కావున మీ రేదియైన యుక్తిచేత నాయనివారిని మీ మఠములోనికి రప్పింపుఁడు. పిమ్మట మీ మాటప్రకారము మేము ప్రాణములకు తెగించి యెంతపనియైన చేయుదుము."

కట్టుబడివాండ్రిట్లు మాటయిచ్చినమీఁదట కరిబసవస్వామి యిట్లు చెప్పెను: "మీరు చెప్పినట్లు కోటగుమ్మములలో రెండు తురకవారిచేతులలో నున్నమాట నిజమే. కాని మా మఠము దిక్కుననున్న దిడ్డివాకిలి మట్టుకు వారి స్వాధీనమునలేదు. మా స్వంత కమతగాండ్లు ఆ దిడ్డివాకిలిగుండా పశువులకు గడ్డి, నగరికిఁ గట్టెలు తెచ్చుచున్నారు. వారు తెచ్చెడిగడ్డి మాపశువులమేఁత బీళ్ళలోనిదే. కావున మీరాబీళ్ళదగ్గఱకు వెళ్ళుఁడు. మీ కత్తులను గడ్డిమోపులలోఁ గట్టుకొని రోజుకుఁ బది, యిరువదిమంది మాకమతగాండ్లతోఁగలసి మా పశువులదొడ్డిలోనికి వచ్చుచుండుఁడు. ఇక్కడ మీకు నేను అన్నోదకములిచ్చెదను. మిమ్ములను రహ

ప్యముగ నుంచెదను. సమయముకనిపెట్టి మనముపవాడప్పనాయని విడిపించుకొందము.''

స్వామిచెప్పిన ఈ ఆలోచనకుఁ గట్టుబడివాండ్రు సమ్మతించిరి. అట్లే చేయుదమనిచెప్పి వారు వెడలిపోయిరి. పిమ్మట కరిబసవస్వామి యూరిలోనున్న యొక కమ్మరివానికిఁ గబురుపంపి మంచి యాకురాయి యొకటి తెప్పించెను. తన మఠమునకును రాజనగరికిని నడుమనున్న తలుపు నాగవాస మాయాకురాయితో తెగగోసి స్వామి మార్గము చేసియుంచెను. ఇంతలోఁ గట్టుబడివాండ్రు స్వామిచెప్పినవిధమున దినములవెంట రెండువందలమంది కత్తులతోడను, కటారులతోడను వచ్చి మఠములో దాగియుండిరి. చెన్నబసవన్న వీరి యందఱకు నాయకుఁడైయుండెను.

ఒకనాఁడురాత్రి నాలుగుగడియలమీఁద తురకసరదారులు భోజనముచేయుటకు వెళ్ళిరి. పవాడప్పదగ్గఱ తురకవారిబంటులు ముగ్గురుమాత్రము కావలియుండిరి. కరిబసవస్వామి యిది కనిపెట్టెను. అప్పుడాతఁడు పవాడప్పనాయనికి అన్నము నీళ్లు తీసికొని వెళ్ళియిచ్చు సేవకురాలిని పిలిచి మఠములోనికిఁ బోవుమార్గము తీసియున్నసంగతి రహస్యముగఁ జెప్పెను. ఆ సేవకురాలు మామూలుప్రకారముగ నన్నము, నీళ్ళు తీసికొనివెళ్ళి రాజుముందఱనుంచెను. అతఁడు తినుటకుఁ గూర్చుండెను. కావలియున్న సిఫాయిలు కొంచముదూరమున నుండిరి. అప్పు డామె రాజుతో మెల్లగా "మఠములోనికిఁబోవు తలుపుతీసియున్నది. ఆమార్గమున మీరు పోవచ్చును. మీపక్షమున సేనకూడియున్నది. కరిబసవస్వామివారు సర్వము సిద్ధముచేసియున్నారు'' అని చెప్పెను. పిమ్మట నామె పవాడప్పను మఠములోనికిఁ బిలుచుకొనిపోయి లోనగడియవైచెను.

కావలియున్న సిఫాయిలు జరిగినమోసమును తెలిసికొనిరి. పవాడప్ప తప్పించుకొనిపోయెనని వారు పెద్దగోలచేసిరి. తురకసరదారు లిదివిని కత్తులుధరించి పవాడప్పను తిరిగి పట్టుకొనుటకుఁ బరుగెత్తుకొనివచ్చుచుండిరి. కరిబసవస్వామి మఠములో దాగియున్న పవాడప్ప తరఫువా రప్పు డాసరదారుల ముగ్గురిని చంపివేసిరి. తమ్మునడుపు నాయకులు చనిపోవుటతోడనే తురకసైనికులు చెల్లాచెదరై పాఱిపోయిరి.

అప్పుడు పవాడప్ప పోయినరాజ్యమును తిరిగి పొందెను. తనకింతటికష్టము కల్గించినది ద్రోహియగు రామాజీయని నాయఁడు తెలిసికొనెను. అప్పుడాతనికిఁ బట్టరానికోపము వచ్చెను. వెంటనే సేవకులనుపంపి నాయఁడు రామాజీనిపట్టి తెప్పించెను; ఆతని నాలుక కోయించెను.

"స్వామివిద్రోహు లీసరణి యెఱింగి,
నాపాటు గుర్తించి, నయమార్గమంద
చరియింత్రుగాక! నిచ్చలు భూతలమునఁ
జెలువాఱుఁగాక యంచితరాజభక్తి."

అనితలచి మూఁగబ్రతుకు బ్రతుకలేక రామాజీ ఆత్మహత్యచేసికొనెను. రాజద్రోహముచేసిన రామాజీ యిట్లు కనాకష్టపుఁ జావు చచ్చెను.

తనకుఁ బోయినసంస్థానము నిర్వాహకముచేసిన కరిబసవస్వాములవారికి పవాడప్పనాయఁడు సాష్టాంగపడి మ్రొక్కెను. నిజముగా కరిబసవస్వామి రాజభక్తి మెచ్చతగినది. ఆతఁ డిహలోకచింతలుమాని 'కృష్ణా రామా' అనుకొనుచు నెల్లవేళల మతవిషయములను గూర్చి చింతించుచుండువాఁడు. అట్టివాఁ డవసరము వచ్చినది కావునఁ దనబుద్ధిని, శక్తిని ఇహలోకవిషయములం దుపయోగించి పవాడప్పరాజ్యమును నిలిపెను. ప్రజలసుఖమునకును, దేశమున శాంతికిని రాజే యాధారము. కావున నట్టిరాజునకుఁ గష్టముకల్గినప్పుడు కరిబసవస్వామివంటి మతగురువులు సయితము మతచింతలు మాని రాజుకొఱకుఁ బనిచేయుట మనదేశమున అనాదినుండియునున్న యాచారము. కూలిపోయిన మిత్రుని రాజ్యమునుకూడఁ దీసి ఈరాజభక్తుడు లోకపూజ్యుఁడైనాఁడు.

"ఒనరు ననంతవిశ్వోద్యానసీమఁ
బూవు లవెన్నియో పూచి నశించు;
నందుఁ గమ్మనితావు లంతటఁ గ్రమ్మ
వఱలినసుమమె యాశ్వాసమోదకరము."

—సీరిపి ఆంజనేయులు.



# 'కృషితో నాస్తి దుర్భిక్షమ్'

సీ. ఈలోక మింతయు నాలుగుపాళు లిందొకటభిక్షుకులు సోమకులు నొక్క-
పాలు, సేవావృత్తి బ్రతికెడువారు విద్యోపజీవికులును నొక్క-పాలు,
వ్యవహారమాడెడువారుఁ దస్కరులును నొకపాలు, కర్షకు లొక్క-పాలు
మొదలిపాళ్ళు మూఁడుఁ బిదపటిపాలిన యనవరతంబును నపహరించు

గీ. నపహరించియు నంతంత కవి నశించు, నపహృతం బయ్యు నదివృద్ధినందుచుండుఁ
గానఁ దగురాజు గలిగినఁ గరిసనంపు, జీవనముఁ బోల దొండొక జీవనంబు.

—మంచన మహాకవి

# చెప్పుదెబ్బలు తిన్న పెద్దలు

## చెప్పుదెబ్బలతత్త్వం

పెట్టి పెట్టలేదంటే ప్రాణసంకటం, తిని తినలేదంటే దీర్ఘసంకటం, పెట్టకుండా పెట్టేనంటే పెద్దసంకటం అని తెలుగులో ఒక సామెతఉంది. పెట్టడం, తినడం అనే రెండుధర్మాలు కలిగిఉన్న చెప్పుదెబ్బలవిషయంలో ఈ సామెత ఎంతవఱకు వర్తిస్తుందో కొంచం విచారిద్దాం. పెట్టకుండా పెట్టాననంటే ప్రాణసంకటం అని ఉన్నప్పటికీ కొందరు కోతలరాయుళ్ళు తమ పాదాలుపుట్టిన తరువాత చెప్పులు ఎల్లావుంటాయో ఎఱక్కపోయినా తమ విరోధులకిమాత్రం చెప్పుదెబ్బలు బహుళంగా ప్రసాదించామని ప్రజ్ఞలుకొట్టుతారు. తిని తినలేదంటే దీర్ఘసంకటం అని ఉన్నప్పటికీ చెప్పుదెబ్బలు తిన్నవాళ్లు ఎవళ్ళూ తాము వానిని తిన్నామని మఱిచిపోయిఅయినా, మనసిచ్చిన మిత్రులతోకూడా చెప్పుకోరు. పెట్టి పెట్టలేదంటే పెద్దసంకటం కాబట్టి చెప్పుదెబ్బలను పెట్టినవాళ్ళుమాత్రం ఆవిషయం గొప్పగా నలుగురిలో అవకాశం కల్పించుకొని కూడినంతవిపులంగా ఉపన్యసిస్తారు. తిన్నవాళ్ళు చెప్పుకోనివి, తినిపించినవాళ్ళు గొప్పగా చెప్పుకునేవి అయినవస్తువుల్లో చెప్పుదెబ్బలు అగ్రస్థానంవహిస్తాయని అంగీకరించకతప్పదు. ఒకడికి మఱొకడుచేయగల అవమానాల్లోను, ఒకడు మఱొకనిచేపొందగల అవమానాల్లోను చెప్పుదెబ్బలు సాటిలేనివి. ఇట్టి సాటిలేని చెప్పుదెబ్బలను పురాణాల్లోను, సారస్వతంలోను, రాజకీయంలోను గల స్థానాన్నిగురించి ఇంతవఱకు ఎవరూ తెలుగులో చర్చించినట్లు కనబడదు. ఈ క్రొత్తవిషయాన్ని నేను తెనుగులో ప్రథమంలో వ్రాయగలిగినందులకు చాలా ఆనందిస్తున్నాను.

## శ్రీకృష్ణుడు, యమధర్మరాజు

పురాణాలు పురాణమైనవి కాబట్టి వానిలోని చెప్పుదెబ్బలవిషయం తొలుత నే ప్రస్తరించడంన్యాయం. సమ్మోహనాస్త్రం, ప్రభంజనాస్త్రం, పావకాస్త్రం మొదలైనవి యుద్ధసామగ్రిగా ఉపయోగించిన పురాణపురుషులు చెప్పులను ఈ కాలమునందువలె అప్పుడు యుద్ధసామగ్రిగా వాడియున్నారని చెప్పడానికి నిదర్శనాలేవీ కనిపించవు. పౌరాణికయుగంలో చెప్పులవాడకం అంత తఱుచుకాదని చెప్పాలి. నేడు హైస్కూళ్లలోను, కాలేజీలల్లోను చదువుకునే ఆడపిల్లలకందఱు ఏవో ఒకమాదిరిచెప్పులు విధిగా ఉంటున్నాయి. పురాణాల్లో రేణుకాదేవికోసం ఆదిలో చెప్పులు సృష్టింపబడ్డట్టుఉన్నా పురాణస్త్రీలు చెప్పులను ఉపయోగించిన ఉదాహరణలు ఏవీ నాకు దొరకలేదు. పదునాలుగుఏళ్ళ అరణ్యవాసానికిపోతూ శ్రీరాముడు పాదుకల్ని భరతుడికి ఇచ్చిపోయాడు. రాళ్ళరప్పలవెంట మగనితో సీతామ్మవారు నడుస్తూకూడా చెప్పులుతొడుక్కుందని వాల్మీకి ఎక్కడా వర్ణించలేదు. స్త్రీలు చెప్పులుతొడుక్కోటం ఆరోజులలో నేటికివలె ఆచారంకాదేమో! యుద్ధకౌశల్యమును ప్రదర్శించిన సత్యభామకూడా చెప్పులు తొడుక్కున్నట్లు చెప్పబడలేదు. పారిజాతాపహరణంలో అలిగి సత్యభామ చీకటింటి చివరమంచంమీద పడుకున్నప్పుడు మాసిన చీరతోబాటు ఏపాతచెప్పుల జోడో తొడుక్కొని ఉండి ఉంటే శ్రీకృష్ణభగవాన్లుగారికి తనభార్య ఎడమకాలి చెప్పుతాపులు లభించి భగవద్గీత అనుభవంలోకి వచ్చి ఉండును. మార్కండేయస్వామివారి ఆయుర్దాయవిషయంలో శివుడు డాకాలిమడమతాపుకి గుఱియైన యమధర్మరాజుకి ఆసమయంలో శివుడికాలికి చెప్పులులేక పోవడంవల్ల అవమానంయొక్కవాడి కొంచంతగ్గింది. శివుడు వీభూదిరాయుడు కాబట్టి తోలుముట్టుకోడను కోవడానికి వీల్లేదు. పచ్చిఏనికతోలు పచ్చడముగ ధరించు పరమబ్రాహ్మణోత్తముడు ఆతడు. మార్కండేయుణ్ణి యమపాశాలనుండి రక్షిద్దామనే ఆదుర్దాలో శివుడు తోలుచెప్పులు తొడుక్కురావడం మఱచి ఉం

టాడు. మఱుపనేది ఎట్టివారికైనా ఉండేదే. గజేంద్రుణ్ణి రక్షించపోతూ విష్ణుమూర్తి శంఖచక్రాలే మఱచిపోయాట్ట. శ్రీకృష్ణుడికి, యమధర్మరాజుకి ఇట్లు కొంచంలో చెప్పుదెబ్బలుతప్పినాయి. సూటిగా చెప్పుదెబ్బలుతిన్న పురాణపుపెద్దలు ఎవరూ మనకి దొరకడం లేదు కాబట్టి ఇంతలో వీళ్ళని వదిలేయవలసి ఉంటుంది.

## పిండిప్రోలు లక్ష్మణకవి

ఇక సారస్వతంలో చెప్పుదెబ్బలనుగూర్చి విచారిద్దాము. ఇతరసారస్వతాలకంటె మనసారస్వతంసంగతి మనకు ముఖ్యంకాబట్టి ఆంధ్రసారస్వతంలో చెప్పుదెబ్బలుతిన్న పెద్దలుఎవరేనా ఉన్నారేమో చూద్దాము. రాజమండ్రిలో చారిత్రకవేత్త ఒకడు శాసనపరిశోధన మాని శ్రీరామనవమిదినాలలో స్త్రీపరిశోధనకు కడంగగా చెప్పరానన్ని చెప్పుదెబ్బలు తిన్నాడని వెల్లడైంది. ఆయనపేరు నాలికమీద ఆడుతోందికాని సమయానికి జ్ఞాపకం రావటంలేదు. తెలుకులదాన్ని, దూదేకులదాన్ని, తములపాకులు అమ్మేదాన్ని, పూజారివారి కోడల్ని, సాతానిదాన్ని, అగసాలిదాన్ని, బొందిలిదాన్ని, చాకలిదాన్ని, వడ్లుదంపుతోన్నదాన్ని, పిండి రుబ్బుతోన్నదాన్ని, పేడచేస్తోన్నదాన్ని మొదలగు స్త్రీలను ఎందఱినో వర్ణించిన శ్రీనాథుడికి ఒక్కసారి కూడ చెప్పుదెబ్బలు తగిలినట్లు తెలియరాదు. 'గండము దప్పె నాంధ్రకవిగానికి' అన్నపద్యం ఈకారణంచేతనే పుట్టిందేమో! పదాలతో తిట్టుకోవడమేకాని ఆంధ్రకవులు ఒండొరులను చెప్పులతో కొట్టుకొన్న నిదర్శనాలాట్టే కనిపించవు. ఒకసారిమాత్రం శిష్టు కృష్ణమూర్తిశాస్త్రిగారు పిండిప్రోలు లక్ష్మణకవిగారికి పైజార్లతో కొడతానని కబురుపంపారట. దానిమీద లక్ష్మణకవిగారు పైజారులదాకా ఎందుకు లోజారుల సంగతి ఆలోచించమని చమత్కారంగా అని చెప్పుదెబ్బలు తప్పించుకున్నారు. మొత్తంమీద సరస్వతి అందెళ్ళచప్పుణ్ణి చప్పబఱిచే చెప్పుదెబ్బల చప్పుడు తెనుగుసారస్వతానికి లేదని చెప్పాలి.

## సురేంద్రనాథబెనర్జీ

రాజకీయాల్లో ఏ విషయమైనాసరే తీవ్రరూపం తాలుస్తుంది. సూరతుకాంగ్రెసులో అతివాదులకు మితవాదులకు రాజకీయాభిప్రాయాలు తీవ్రతరమై కాట్లాట్లకు కారణమయ్యాయి. ఆ కాంగ్రెసులో చెప్పుల జోళ్ళు తమతమ నెలవుల్ని వదలి సభాధ్యక్షులు కూర్చున్న వేదికవైపు—అధ్యక్షస్థానం అర్థించికాబోలు—పూలచెండ్లల్లా పరుగులెత్తాయి. అందులో ఒకటి సూటిగా వచ్చి సురేంద్రనాథబెనర్జీ గారికి తగిలింది. ఆ చెప్పును ఆమహానీయుడు తాను చచ్చిపోయేవఱకు తనవద్ద భద్రంగా దాచుకున్నాడు. మహాసభలో తిన్న చెప్పుదెబ్బ కాబట్టి దీనివిషయం దాచుకోవడానికి వీల్లేక బెనర్జీగారు అవకాశం ఉన్నప్పుడల్లా దాన్నిగూర్చి నలుగురితో చెప్పుతూ వీలుపడితే ఆచెప్పునుకూడా ప్రదర్శిస్తూ ఉండేవారు. బహిరంగంగా చెప్పుదెబ్బలు తిన్న భారత నాయకులు మఱియెవరూ లేరనుకుంటాను. గాంధిమహాత్ముడు దక్షిణాఫ్రికాలో తిన్నది చెంపకాయమాత్రమే.

## రామ్సేమాక్డొనాల్డు

సూరతులో కాంగ్రెసుకి చెప్పుదెబ్బలతో సంపర్కం కలిగింది. 1911 లో కాంగ్రెసుకి నేడు బ్రిటిష్‌సామ్రాజ్యానికి మంత్రిమాణిక్యమైఉన్న రామ్సేమాక్డొనాల్డు గారిని అధ్యక్షునిగా చేయడానికి కొంతప్రయత్నం సాగింది. మన కాంగ్రెసుకి చెప్పుదెబ్బలసంపర్కం కలగడంమూలాన్నికామోసు కాంగ్రెసు అధ్యక్షుడుగా సూచింపబడ్డ మేక్డొనాల్డుకికూడా చెప్పుదెబ్బలు తగిలాయి. అసలు చెప్పుదెబ్బతినడమే అవమానకరమైనవిషయం. అందులో ఆడదానిచేత అది తినడంకంటె అవమానకరమైంది మఱి ఒకటి ఉండబోదు. అఖండబ్రిటీషుసామ్రాజ్యాన్ని నేడు నిర్వక్రపరాక్రమమున ఏలుతూఉన్న రామ్సేమేక్డొనాల్డు ఒకప్పుడు ఒక ఆడదానిచేత చెప్పుదెబ్బతిన్నాడు. పెట్టిపెట్టలేదంటే ప్రాణసంకటం కాబట్టి చెప్పుదెబ్బలను పెట్టినవాళ్ళు మాత్రం ఆవిషయం గొప్పగా నలుగురిలో అవకాశం కల్పించుకొని కూడినంత విపులంగా ఉపన్యసిస్తారని మొదట్లోనే మనవిచేశాను. మేక్డొనాల్డుకి చెప్పుదెబ్బ ప్రసాదించినస్త్రీ అట్లు ఉపన్యసించడంతో తృప్తిపడక ఆవిషయం పత్రికలోవ్రాసి అచ్చువేసి దానికి అక్షర

రూపం ఇచ్చింది. ఆస్త్రీ నామము పోలా నెగ్రి. లోకప్రఖ్యాతిగాంచిన సినీమానటకురాలు. చెప్పుదెబ్బల విషయం తినిపించినవారు చెపుతేనే రక్తిగా ఉంటుంది కాబట్టి ఆమె మాటల్లోనే ఈవిషయం ఇక్కడ ప్రదర్శిస్తాను. "రామ్సేమేక్డొనాల్డుతో నాకైన ప్రథమసందర్శనం నేను ఎప్పుడూ మఱిచిపోను. అది ఆసమయంలో సంభవించింది. నేను అప్పుడు యాత్రచేస్తూ బర్మింగుహామ్‌లో ఉన్నాను. అచ్చటి ఒక పెద్దహోటల్లో మకాంచేశాను. నాడువచ్చిన సినీమావేషగాళ్ళుఅయిన మిత్రులతో సల్లాపగోష్ఠి అయింతరువాత రాత్రిపొద్దుపోయి గదికివెళ్ళాను. పడుకుని పదినిమిషాలు కాలేదు. అంతలో నాజన్మంలో నేను విననంతటి పెద్దగుఱ్ఱు వినిపించింది. నిదానంమీద అది పక్కగదిలోనుంచి వస్తోన్నట్లు కనిపెట్టాను. అడ్డగోడ సన్నమైంది కాబట్టి ఇక నాముట్టుకి ఆరాత్రికి నిద్రప్రాప్తి లేదనుకున్నాను. ఓర్చగలిగినంతసేపు ఆగుఱ్ఱు ఓర్చాను. ఇక భరింపలేకపోయాను. గోడనుతట్టి శబ్దంచేశాను. ప్రయోజనంలేకపోయింది. గోడమీద చాలాసార్లు అల్లాగే చప్పుడు చేశాను. గట్టిపిడికిటితో పెద్దశబ్దంచేశాను. నిష్ఫలం. ఆపెద్దగుఱ్ఱు ఏమాత్రం తగ్గలేదు. ఉబ్బెత్తుగా నాకో ఆలోచన తోచింది. ఆనాడువచ్చిన నాస్నేహితుల్లో సినీమావేషగాళ్ళల్లో హాస్యపాత్రధారిఅయిన యువకుడొకడు ఈగుఱ్ఱుకి కారణంఅయి ఉంటాడనితోచింది. సామాన్యదేవరూ అంతబిగ్గరగాను, దీర్ఘంగాను గుఱ్ఱుపట్టలేడని అభిప్రాయంపడ్డాను. హాస్యగాడికి తగినశాస్తి చేయాలని బయలుదేరాను. గౌనుతొడుక్కుని చేతులో రష్యన్‌బూటు ఒకటిపట్టుకునివెళ్ళి నెమ్మదిగా పక్కగది తలుపుతోశాను. అది లోపల గడియవేయబడియుండలేదు. తలుపు తెరచాను. వసారాలోంచి వస్తూన్నదీపపు వెలుతురులో నిద్రితుడు స్పష్టంగా కనిపిస్తూ ఉన్నాడు. నిదానంగా గుఱిచూచి ఆ విగ్రహంమీదికి నా రష్యన్‌బూట్ విశిరాను. తోడనే జువ్వలాగ ఆతడు లేచికూర్చుండి మీటునొక్కి గదిఅంతా వెలుగువెల్లువలో ముంచినాడు. నేను ఆశ్చర్యసముద్రంలో మునిగిపోయాను. నేను అనుకున్న హాస్యగాడుకాడు. వింతవాడు. వింతవాడుకూడా కాదు. ఆతనిముఖం నాకు బాగా పరిచయం అయిందే. క్షమాపణవచనాలు అస్పష్టంగా గొణుక్కుంటూ గది ఈవతలికివచ్చేను. నేను ఆముఖం ఎక్కడ చూశిఉంటానా అని ఆలోచించాను —వార్తాపత్రికల్లో తఱుచు ప్రచురింపబడే చిత్రపటాల పరంపర నామనోనేత్రాలఎదుట పొడగట్టింది. అప్పుడు నాకు తెలిసింది—ఆంగ్లమంత్రిమాణిక్యానిపై నేను చెప్పు విశిరానని. ఉదయాన్నే లేచి హొటల్లో విజిటర్సు పుస్తకంచూశాను. నా ఎఱుక నిజమైందేనని తేలింది. కొన్నాళ్ళు అయినతరువాత రామ్సేమాక్డనాల్డుగారికి రాజకీయంగా ఆయనకు జరిగిన ఒక స్వాగతోత్సవసందర్భంలో నేను పరిచయంచేయబడ్డాను. అప్పుడు ఈసంగతి ఆతనితో ప్రస్తావించాను. ఆతడు కడుపుబ్బానవ్వి ఇట్లు చెప్పేడు: "నాకు తగినశిక్ష అయింది అనుకుంటాను. నేను ఎల్లప్పుడూ గుఱ్ఱుపడతానని మా అమ్మాయి చెపుతుంది. ఏమైనాసరే ఈకథమాత్రం నువ్వు చెపితే తప్ప నేనైమాత్రం ఎవరితోనూ చెప్పను."

## చెప్పుదెబ్బలవిషయంలో ఒకరహస్యం

ఈవ్యాసం చదివేవాళ్ళలో ఎవళ్ళైనా రాజకీయ నాయకులు చెప్పుదెబ్బలు తిన్నవాళ్ళు ఉంటే వాళ్ళ చెవిలో నేను ఒకరహస్యం చెప్పదలచుకొన్నాను. ఇతరులు ఎవరితోటీ ఈరహస్యం చెప్పకుండా ఉంటారనే నమ్మకంతోటే దీన్ని వాళ్ళకు నేను చెప్తూతున్నాను. చెప్పుదెబ్బలుతిన్న సమయంలో తత్కాలికంగా కొంత అవమానభారం కలిగినా దాన్నిగురించి రాజకీయాలలో పనిచేసేవారు నిరుత్సాహపడవలసిన అవసరం ఏమీ లేదని మనవిచేస్తున్నాను. చెప్పుదెబ్బతిన్నతరువాతనే సురేంద్రనాథ బెనర్జీ హిందూదేశానికి తలమానికం అనతగ్గ వంగరాష్ట్రానికి మంత్రిపుంగవుడు అయాడు. చెప్పుదెబ్బ తిన్నతరువాతనే రామ్సేమేక్డొనాల్డు రవిఅస్తమించని విశాలాంగ్లమహాసామ్రాజ్యానికి మంత్రిమాణిక్యమయ్యాడు. రాజకీయాల్లో పనిచేసేవారిలో తమ్ము ఎవరుతిందురో వారిని మంత్రులుగాచేయగల గొప్ప గుణం చెప్పుదెబ్బలకు ఉందని పైనిదర్శనాలు రెండూ చెపుతూఉన్నవి. మనం ఆకళించిన ఈఫలశ్రుతివిషయం

కూడినంత రహస్యంగా ఉంచవలసిందిగా రాజకీయాల్లో తిరుగుతూ చెప్పుదెబ్బలు తినిఉన్న ఈ వ్యాసపాఠకుల్ని, మరఒకసారి కోరుతున్నాను. మనదేశంలో కొద్దిరోజులలో ఫెడరల్ రాజ్యాంగం ఏర్పడపోతోంది. అప్పుడు ఒక్కొక్కరాష్ట్రంలో కనీసం అయిదుగురేసి మంత్రులు ఉండగలరని తెలియవస్తోంది. ప్రభుత్వంలో ఉద్యోగాలు సాధారణంగా ఆచారాన్నిబట్టి, సాంప్రదాయాన్నిబట్టి లభిస్తాయి. చెప్పుదెబ్బతిని ఉండడం మంత్రిత్వంపొందడానికి అర్హతను ప్రసాదిస్తున్నదని సురేంద్రనాథ బెనర్జీవిషయం చెప్పక చెప్తూలోంది. ఫెడరలురాజ్యాంగంలో వివిధరాష్ట్రాల్లో నియమింపబడే మంత్రులలో చెప్పుదెబ్బతిన్న అర్హతగల రాజకీయవేత్తలకు ఎక్కువ ఛాన్సులు ఉండగలవు. ఇంతవఱకు చెప్పుదెబ్బతినకుండా ఉండి ఫెడరల్ రాజ్యాంగంలో మంత్రిత్వంసంపాదించాలని ఎదురుచూస్తూఉన్న రాజ్యాంగవేత్తలు త్వరగా ఏదోవిధంగా చెప్పుదెబ్బతిని జీర్ణించుకోవడానికి ప్రయత్నించడం మంచిది. మంత్రిత్వానికి అర్హతలు సంపాదించడంలో పురుషప్రయత్నానికిలోపం ఎంతమాత్రం రానీయకుండా ఉండడం నాయకలక్షణం. రాజకీయాల్లో పనిచేస్తూన్న వారివిషయంలోనే చెప్పుదెబ్బలు వారు మంత్రిత్వంపొందడాన్ని సూచిస్తాయి కాబట్టి కేవలం కుటుంబవిషయాల్లో ఆస్తిపంపకం సందర్భంలో కోర్టులో కొడుకుచేత చెప్పుదెబ్బతిన్న పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంకాపురస్తుడగు లాయరు మహాశయుడుగాని, విచారణసమయంలో ముద్దాయిచేత చెప్పుదెబ్బతిన్న మీరటుమేజిస్ట్రేటుగాని, పెళ్ళినాడిస్తానని కార్యంఅయిన నాలుగుఏళ్ళవఱకూ కట్నం ఇవ్వకపోయిన కారణంవల్ల అల్లుడిచేత విజయేశ్వరాలయం దగ్గర చెప్పుదెబ్బతిన్న బెజవాడనివాసిఅయిన మామగారుగాని—చెప్పుదెబ్బతిన్న కారణంచేతనే—తాము తమతమరాష్ట్రాలికి మంత్రులము కాగలమనుకోవడానికి ఎంతమాత్రం అవకాశంలేదు. అవకాశంలేకపోయినా వాళ్లు మంత్రులముకాగలమనిభావిస్తే ఆభావానికి నేనుగాని, నా ఈ వ్యాసంగాని బాధ్యులముకామని మనవి.

—ఎ. శేషాచలపతి, బి.ఏ.

# దయ్యం

పొగబండి 'రంయి'మనిపోతున్నది. గాఢాంధకారం. మబ్బుపట్టింది. నక్షత్రాలుకూడాలేవు. బయటికిచూస్తే భయంవేస్తున్నది కాని రైలుబండిమాత్రం, ప్రక్కనున్న విషయాలను గమనించకుండా, నిశ్చలచిత్తంతో తపస్సుచేస్తున్నప్పుడు పరమాత్మానుసంధానంకొరకుపోయ్యే యతియొక్క జీవాత్మవలె, వెళ్ళిపోతున్నది.

ఉన్నట్టుండి నేను,

'ప్రభూ!' అనిపిలచి 'ఆ కనబడుతున్న కొరువు లేమిటో తెలుసునా?' అన్నాను.

'మిణుగురుపురుగులో లేకపోతే దగ్గరనున్న పల్లెటూళ్ళలో దీపాలో' నన్నాడు ప్రభూ.

'కాదు. కాదు. కొరివిదయ్యాలు' అన్నాను.

'దయ్యాలులేవు. భూతాలులేవు' అన్నాడు ప్రభూ వింతనవ్వుతో.

'అయితే దయ్యాలులేవనేనా నీ అభిప్రాయం' అన్నాను నేను కొంచెం కోపంతో.

'నిశ్చయంగా' నన్నాడు ప్రభూ బల్లగుద్దినట్లు.

వెనుకటి పెద్దమనిషికి సందుదొరికింది మాట్లాడటానికి. 'దయ్యాలులేవని చెప్పటానికి వీల్లే'దన్నాడు తలకాయతిప్పుతూ.

'నిజమే. దయ్యాలున్నవనిచెప్పిన మనపూర్వులందరు తెలివితక్కువవాళ్ళు కాదు. పైపెచ్చు నాగరికత బలిసిన పాశ్చాత్యులుకూడా దయ్యాలున్నవని ఒప్పుకుంటున్నారు' అని అంటూ ప్రభూవైపుచూసి ఒక్క చిరునవ్వునవ్వాను. ఆ చిరునవ్వులో విజయసూచన కనుబడుతున్నది.

ప్రభూకు కోపంవచ్చింది. అన్నాడుకదా పెద్దమనిషితో 'మీరు మీజీవితంలో యెన్నిదయ్యాలను చూశారో చెప్పగలరా. అప్పుడుగాని నమ్మను' అని.

పెద్దమనిషి సిగరెట్టుతీసి వెలిగిస్తూ 'అట్లా అడుగు. చెపుతాను' అంటూ ప్రారంభించాడుకథ.

'మైసూరుసంస్థానంలోని ఒకానొక చిన్నపట్టణంలో ఒకఫాదిరీ వుండేవాడు. ఆయనది ఫరాసుదేశమనీ, దా

డాపు ఒకఅర్ధశతాబ్దంనుంచి ఆయన మతప్రచారం చేస్తు న్నాడనీ వాడుక. స్వార్థత్యాగం ఆయనలో మూర్తీభవించిందని చెప్పటానికి, ఆయన స్వదేశాన్నివదలి, ఆరు, యేడు వేలమైళ్ళదూరం వచ్చి,తిండికి గుడ్డకు సరిపోయేజీతంమాత్రం తీసుకుంటూ మానవసేవచెయ్యడమే తార్కాణం. పరోపకారపారీణతకు ఆయన్ను చెప్పి మరొకరిని చెప్పాలి. ఆయనమొహం యెప్పుడూ నవ్వుతూవుండేది. దయారసం పొంగిపొరలిపోతూవుండేది. కోపమనేది ప్రపంచంలో వున్నవిషయం ఆయనకు తెలియదేమోననిపించేది చూసినవారికి. ఆయన ఆవూళ్ళో ఒక మేడకిందిగదె అద్దెకుతీసికొని నివాసంచేస్తున్నాడు. ఆయనకు కావలసిన చిన్నగ్రంథాలయంకూడా దాంట్లోనే యేర్పాటు చేసుకున్నాడు. ఎప్పుడు చూచినా సరె యేవోపనిమీదనే వుండేవాడేకాని, సోమరితనంగా వున్నట్లుచూచి యెరగనేయెరగమని ఆయనను యెరిగినవాళ్ళు చాలామంది చెప్పారు.'

ఇక్కడికి వచ్చేటప్పటికి ఆయనకు సిగరెట్టు అయిపోయింది. వెంటనే యింకొక సిగరెట్టుతీసి, వెలిగించి గుప్పున పొగవిడుస్తూ, 'మిస్——పేరేదో జ్ఞాపకం లేదు మాస్నేహితుడు చెప్పాడుకాని.......' 'అయితే మొదటి ఫాదిరీగారికథ అయిపోయిందన్నమాట. ఇది రెండవది కాబోలు' నన్నాడు మా ప్రభూ.

'కాదు. కాదు. విను. తొందరపడతావేం బాబూ' అంటూ, 'ఆ. అన్నట్టు యెంతవరకుచెప్పాను? మిస్——ఆంగ్లోయిండియనులపిల్ల. సౌందర్యవతి. చదువుకున్నదికూడాను. యౌవనవతి అయింది. వాళ్ళలో తగిన కట్టుబాట్లు వుండవన్నవిషయం జగద్విదితమేకదా!అందువల్ల యౌవనవతులకు సహజంగా కలిగేవికారాలు ఆమెకుగూడా కలిగినై. ఆ రోజుల్లో, యువకులలో ఆమెనెరుగనివారు,— అంతేకాదు,— పరిచయంలేనివారు, సామాన్యంగా లేరనేచెప్పవచ్చు.

కాలంగడిచింది. దానితోపాటు ఆమె సౌందర్యం గూడా గతించింది. వెనుక ఆమె సౌందర్యానికి ముగ్ధులయినవాళ్ళెవరూ ఆమె నిప్పుడు కన్నెత్తియినా చూడటంలేదు. పాపం ఆమె యౌవనంలో విచ్చలవిడిగా సంచరించినందుకు ఫలితంగా, వ్యాధులు చుట్టుకున్నై. మంచం పట్టింది.

వ్యాధిగ్రస్తులను పరామర్శచేసి, వారికి తగిన ఔషధసేవచేయించి, దేహస్వాస్థ్యం కలుగచేయటం మన ఫాదిరీగారి దినచర్యలో ముఖ్యమయినవిషయం. ఆంగ్లోయిండియను వనితయొక్క కష్టాలు, ఫాదిరీగారి హృదయాన్ని ద్రవింపచేసినై. ఆమెకు తనగదిలోనే చోటిచ్చి తనే ఔషధసేవ చేయిస్తున్నాడు. ఒక్కొక్కప్పుడు ఆవనిత 'అయ్యా! నేను మహాపాపిని. భగవంతుడు నన్ను రక్షిస్తాడా? వట్టిది. నావంటి మహాపాపులు భగవంతుని కరుణకు పాత్రులా? కల్ల.'అని నిరుత్సాహంతో ఫాదిరీని అడిగేది. 'బిడ్డా! భగవంతుడు కరుణాసముద్రుడు. హృదయపూర్వకంగా పశ్చాత్తాపపడితే చాలు భగవంతునికి. కాని నీకు దేహస్వాస్థ్యంకలగనీ. లేనిపోని విషయాలతో మనస్సు కలవరపెట్టుకోకు' మని ఫాదిరీ ఓదారుస్తూవుండే వాడామెను.

రోజులుజరిగినకొద్దీ పాపంపెరిగినట్లు పెరిగిపోయింది వ్యాధి. తనచేతికి తప్పిందనుకొన్నాడు ఫాదిరీ. ఆవూళ్ళోవుండే డాక్టరును పిలిచి చూపించాడు. 'నిశ్చయం మాత్రం చెప్పలే'నని ముందరేచెప్పి డాక్టరు మందులిస్తూనేవున్నాడు.

ఒకరోజున వ్యాధి యెక్కువయింది. యౌవనంలో తాను చేసిన మహాపరాధాలన్నీకూడా బ్రహ్మరాక్షసుల రూపంతో మింగటానికివస్తున్నవి కాబోలు ఆమె పెద్ద పెట్టున కెవ్వుమని కేకలువేసింది. ఫాదిరీగారికి భయంవేసింది. డాక్టరును పిలిపించాడు. ఆయన లాభం లేదని పెదిమలువిరిచాడు. 'కాని, నేనొక యింజక్షను యిస్తాను. దానివల్ల ఒకగంటకాలం తెలివికలిగివుంటుంది. లేకపోతే యిప్పుడే ప్రాణం పోతుం'దన్నాడు డాక్టరుగారు. ఫాదిరీగారు దానికి సమ్మతించాడు.

మిస్——కు తెలివివచ్చింది. అన్నదిగదా ఫాదిరీతో 'అయ్యా! నా అవసానదశయేమో దగ్గరకు వచ్చింది. యౌవనమదోన్మత్తతచేత చేయరానికార్యాలు చేశాను. ఘోరపాపిని. కాబట్టి నాకు మారుగా మీరు నాతప్పులను మన్నించేటట్టు యేసును ప్రార్థింపకోరు

తాను. ఇదే నా అంత్యప్రార్థన' అని. ఫాదిరీ కన్నీళ్ళు కార్చాడు. మిస్——'అయ్యో! త్వరగా' నన్నది. ఫాదిరీ కలం, కాగితం తీసుకొని ఆమె తప్పిదాలనన్నిటినీ వరుసగా వ్రాసుకున్నాడు. 'మిమ్మల్ని ఆలోకంలో కలుసుకుంటా'నన్నది ఆమె. 'బిడ్డా! నీ హృదయపూర్వక పశ్చాత్తాపమే నిన్ను స్వర్గధామానికి చేరుస్తుంది. నీవు సుఖంగా ప్రాణం విడువవలసింది' అంటూ ఆయన ఆశీర్వదించడానికి యెత్తినచేయి యెత్తినట్టుగానే వున్నది. ఆమె ప్రాణం విడచింది.

* * *

ఆరోజు ఆదివారం క్రైస్తవాలయానికి వెళ్ళి, కాగితంలో వ్రాసివున్న తప్పిదాలనన్నిటిని యేసునకు నివేదించి, ఆమెను రక్షించమని అనేకవిధాల ప్రార్థించాడు ఫాదిరీగారు. మనస్సు మనస్సులో లేదు. ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నభోజనం చేశాడు. తలకాయ నొప్పిగా వున్నట్టు కనబడ్డది. ఆశ్చర్యపడ్డాడు ఫాదిరీగారు. తనజీవితంలో యింతవరకు ఒక్కతలనొప్పే కాదు, యేవిధమయిన శరీరబాధా యెరుగడు. అనేక ఆలోచనలుపోయినై మనస్సులో. 'మృత్యువు యెప్పుడూ తప్ప తనమీద వుంచుకోదు' అనుకున్నాడు పడుకుని. ఆమాట పెదిమలు దాటివచ్చింది. కళ్ళు తిరిగిపోతున్నై. ఎవరో ఒకవ్యక్తి కనుపించి 'అవసానదశ సమీపించింది. రమ్మ'న్నట్లు సంజ్ఞ చేసింది. 'వస్తున్నా' నన్నాడు ఫాదిరీగారు కొంచెం బిగ్గరగా, చేతితో తావళం తిప్పుతుంటూ. 'వస్తున్నా'నన్నమాట యింట్లో వున్న బోట్లరుకు వినపడ్డది. వాడు పరుగెత్తుకుంటూ వచ్చి 'అయ్యా! అయ్యా!' అంటూ మంచంచుట్టూ తిరగటం ప్రారంభించాడు పాపం. ఫాదిరీ మనస్సు ప్రహలో లేదు. వెర్రిచూపు చూస్తున్నాడు. అంత అవస్థలో వుండికూడా, దేనికోరకో పాపం ఫాదిరీ చెయ్యిచాపి బీర్వావైపు చూపాడు. అదేమిటో అర్థంకాలేదా అమాయకపుబోట్లరుకు. కళవళపడ్డాడు. 'అయ్యా! ఏమిటి! ఏమిటి!! అయ్యో! అయ్యో! మాటలేదే! ఇంతలోకే ముంచుకువచ్చిందా.' అని తలబాదుకున్నాడా బోట్లరు. ఫాదిరీ కళ్ళ వెంబడి నీరుకారుస్తూ ప్రాణంవదిలాడు. ఆ అశ్రువులు చెంపలనుండిజారి పక్కను తడిపినై. దానికి కారణం యెవరికీ తెలియలేదు మొట్టమొదటలో.

పాపం ఆయన మరణాన్నిగురించి చుట్టుప్రక్కల గ్రామాదులలో విచారించనివారులేరు. సీమలోని క్రైస్తవసంఘంవారుకూడా చాలా విచారించారు. ఇతర ప్రాంతాల్లో మతప్రచారంచేస్తున్న ఒక ఫాదిరీగారిని చనిపోయిన ఫాదిరీగారిస్థానంలో నియమించారు. ఆఫాదరీగారు వచ్చాడు వుద్యోగం స్వీకరించటానికి. వచ్చి ఆఫీసులోకి అడుగుపెట్టాడో లేదో గుండెపగిలిపోయింది. వెనకటిఫాదిరీగారు యథాప్రకారంగా కుర్చీలో కూర్చున్నాడు. చచ్చిపోయిన ఫాదిరీ మళ్ళీ యెట్లావచ్చాడు చెప్మా అని నిర్ఘాంతపోయినాడు కొత్త ఫాదిరీగారు, కాళ్ళునిలువలేదు. తాను కలకంటున్నాడా? లేకపోతే మతిభ్రమించిందా? కాదు. కాదు. నిజంగానే. సాక్షాత్తు ఆ నెరసినగడ్డం, తెల్లటిగౌనూ, చిరునవ్వు నవ్వుతూన్న మొహం, అన్నీచూస్తే మూడుమూర్తులా ఆఫాదరీగారే సందేహంలేదు. పాపం కొత్తఫాదిరీగారికి వళ్ళు ముచ్చెమటలుపోసినై. జీవితంలో తానింతవరకు యిటువంటి దృశ్యం చూడలేదు. చూడకపోవుటమేకాదు. వినికూడా యెరుగడు. తడబడేకాళ్ళతో గబగబా తలుపు మూశాడు. ఈవింతవిషయం సీమలోని 'సంఘం' వారికి తెలియబరిచాడు. వారీవిషయం వినటంతోనే ఫక్కున నవ్వారు. కొత్త ఫాదిరీగారికి మతిభ్రమించిందనుకున్నారు. ఇంకొక ఫాదిరీగారిని నియమించారా స్థానంలో ఆయనకూ వెనకటివాని అవస్థేపాపం. తనవల్లకాదని చెప్పుకున్నాడు సీమలోవారితో. వారు ఇంకొకరిని నియమించారు. ఇదే అవస్థ మళ్ళీను. 'సంఘం' వారికి విసుకుపుట్టింది. పర్యవసానాన్ని కాలానికి వదిలిపెట్టి 'గప్‌చిప్'గా వూరుకున్నారు.'

ఈ మాటలు చెపుతూనే ఆ పెద్దమనిషి జేబులో చేయిపెట్టాడు సిగరెట్టు తీసికోడానికి.

ప్రభూ అన్నాడుగదా ఆయనతో 'క్రైస్తవసంఘమువారనుకున్నదే నిజం. బహుశః ఈఫాదిరీలకు మతిభ్రమించి వుండొచ్చు'అని. 'ఒక్కరికి మతిభ్రమించిందంటే అర్థంవుంది. కాని ప్రతివాడికీనా? అసంభవం'అన్నానేను.

మా పెద్దమనిషి చిరునవ్వునవ్వుతూ 'తొందరపడకండి. ఈసంగతంతా మాస్నేహితుడు అసలు విషయం జరిగినతర్వాత చెప్పినది. ఇంతకూ నా అనుభవంసంగతి చెప్పనేలేను. మొట్టమొదట నేనదే కాదు మీకు చెప్తానన్నది? అప్పుడే మరచిపోయినారా?' అన్నాడు.

నేను కుతూహలంతో ముందుకు జరిగాను. ఆయన మళ్ళీ ప్రారంభించాడు.

'నేను కొన్నాళ్ళు మైసూరుసంస్థానంలో వుద్యోగం చేశాను. మాస్నేహితు డొకాయన దగ్గరగానున్న ఒక వూళ్ళో వుద్యోగంచేస్తున్నాడు. వాళ్ళవూరికి రమ్మనమని బలవంత పెట్టాడు నన్ను చాలాసార్లు. ఏదో ఉద్యోగపు పనులలో తీరికలేకపోవడంవల్ల 'వస్తాలే, వస్తాలే' అంటూ తలాయిస్తూవచ్చాను.

ఒకసారి, శనిఆదివారాల శెలవలుకలిసి రావడంవల్ల, మాస్నేహితుడిని చూసివద్దామని బయలుదేరాను శుక్రవారంనాడు సాయంత్రం నేను మా స్నేహితుడి వూరు చేరేటప్పటికి దాదాపు తొమ్మిదిగంటలయింది. మా స్నేహితుడు వుంటున్నది పెద్దమేడ. కిందిభాగమంతా యెందువల్లనో శూన్యంగావున్నది. పైభాగం అద్దెకు తీసికొని మాస్నేహితు డుంటున్నాడు. క్రిందిభాగంలో పెద్దవసారావున్నది. దాంట్లో ఒకవైపు మేడమీదికి వెళ్ళటానికి మెట్లున్నూ, రెండోవైపు ఒకగదిన్నీ. ఆగది తలుపు తెరచివుంది. మేడమీదికి వెళ్ళటానికి నేను మొదటిమెట్టుమీద కాలుపెట్టి వెనక్కు తిరిగిచూశాను. గదిలో ఒక తెల్లటిమనిషి కూర్చున్నాడు కుర్చీలో. వంటినిండా తెల్లటిగౌను, నెరసినగడ్డం, మెళ్ళో క్రాసు చూసి యీయన ఒక క్రైస్తవమతప్రచారకు డనుకున్నాను. ఆయన నన్ను రమ్మని చేతితో సంజ్ఞచేశాడు. నేనువెళ్ళి పక్కనున్న బల్లమీదకూర్చున్నాను. ఆయన నాతో యేమీ మాట్లాడలేదు. నేనూ మౌనంగానే కూర్చున్నాను. ఆవిధంగా రెండు మూడు నిమిషాలు గడచినై తరువాత ఆయన లేచినుంచోని తనతో రమ్మని నాకు సంజ్ఞచేశాడు.

ఆయనముందుగ నడుస్తున్నాడు. ఆయనవెనుక నేను గొర్రెవలె తలకాయవంచుకోని నడుస్తున్నాను. కొంత దూరం నడిచేటప్పటికి, గుండెఝల్లుమన్నది. పైప్రాణాలు పైనే పోయినై. నాకళ్ళు అప్రయత్నంగా ఆయన పాదాలమీదపడ్డై. ఆవ్యక్తిపాదాలు మనపాదాలకు మల్లేలేవు. ఆయన ముందరకు నడుస్తున్నా, పాదాలు వెనక్కున్నై. నాకు వళ్ళంతా చెమటపోసింది. లోపల దడ పుట్టింది. కాళ్ళు గజగజ వణికిపోతున్నై. నిదానించి చూశాను. చేతులూ అట్లాగేవున్నై. ఆవిషయం యెప్పుడైనాసరే తలచుకుంటే అదృశ్యం కళ్ళముందర కట్టినట్లువుపడుతుంది. (అంటూ భయం అభినయించాడా పెద్దమనిషి) పెద్దగా అరుద్దామనుకున్నా కాని గొంతు కరాలేదు. ఎట్లాగయినా సరే గొంతు పెకలించుకోని అరుద్దామూ అంటే, యిక్కడివాణ్ణి యిక్కడనే మాయంచేస్తుందేమో దయ్యం అన్నభయం. ఆ భయంలోనే ఆ దడదడతోనే, నా దెయ్యివెనక్కుపోనిచ్చి మెల్లగా, చప్పుడుకాకుండా, వీపు తట్టుకున్నాను. ఆబుద్ధి నాకెట్లా తోచిందో తలుచుకుంటే నాకిప్పుడూ నవ్వువస్తుంది (అంటూ ఒక్కచిరునవ్వు నవ్వాడు). నిస్పృహతో కూడిన ధైర్యం తెచ్చుకున్నాను. ముందుకు సాగాను ఆవ్యక్తిని కలుసుకోటానికి. చప్పుడుగాకుండానే అడుగులు వేస్తూ, ఇప్పుడుచేస్తే దయ్యం యేంచేస్తుందో నన్నభయమే.

ఆవ్యక్తి బీరువాదగ్గర ఆగింది. బీరువా తలుపు తెరవమన్నట్టుగా సంజ్ఞచేశా డావ్యక్తి. అక్కడనేవున్న తాళపుగుత్తి సహాయంతో తలుపుతీశాను. వేలుపెట్టి చూపుతూ దాంట్లోవున్న బైబిలుగ్రంథాన్ని పైకితీయుమన్నట్టు సంజ్ఞచేశా డావ్యక్తి. పుస్తకం బైటికితీశాను. తెరవమన్నట్టుగా సంజ్ఞవచ్చింది మళ్ళీ. పుస్తకం తెరవగానే దాంట్లో ఒకకాగితం అవుపడ్డది. ఆ కాగితం అవుపడగానే ఆవ్యక్తిముఖాన సంతోషం తాండవమాడింది. ఆకాగితాన్ని తగులపెట్టమన్నట్టుగా సంజ్ఞవచ్చిం దావ్యక్తి దగ్గరనుంచి. ఈ ఆఖరిసంజ్ఞమాత్రం నేనతికష్టంమీదగాని అర్థంచేసికోలేకపోయినాను. జేబులోనుంచి నిప్పుపెట్టెతీసి కాగితాన్ని తగలేశాను. ఆకాగితం తగులబడటం పూర్తిఅయిందో, లేదో దయ్యం మాయమైంది. నేను కెవ్వునకేకవేసి క్రిందబడిపోయాను. తరువాత యేమిజరిగిందో నాకు తెలియదు. కళ్ళు తెరిచి

చూసేటప్పటికి, నేను మేడమీదవున్నాను. మా స్నేహితుడు నాకు వుపచారాలు చేస్తున్నాడు. తిరిగి ఆరు నెలలకుగాని నేను మనిషిని కాలేదు.

ఇంతలోకే బెజవాడస్టేషనువచ్చింది. ప్రభూ, నేను 'వెళ్ళివస్తా'మని పెద్దమనిషితో చెప్పి రైలుదిగి వచ్చేశాం. దిగి ఇంటికివెళ్ళుతూ 'పెద్దవాళ్ళు చెప్పేది అబద్ధమా? ఏదైనా ప్రాణంతో సమానమయిన కోరికలుంటే మనిషి చచ్చిపోయినప్పటికీ పిశాచంగా జన్మించి కోరిక తీర్చుకుంటాడుగదా' అన్నాను. 'ఈయన యెవరో బతేవాడులాగున్నాడు. మనలను పిచ్చివాళ్ళనుచేసి యేదో కత చెప్పాడు. లేకపోతే యీయనస్నేహితుడేమిటి? ఎక్కడనో దయ్యాలకొంపలో వుండటమేమిటి? ఎవరన్నా అటువంటి పనిచేస్తాడా? ఇదంతా శుద్ధఅబద్ధం' అన్నాడు ప్రభూ.

—క. సాంబమూర్తి.



"అలరెడురెప్ప లల్లార్చినయందాక
అనిమిషకన్య గాదనగ వశమె?"

## ఓ నాథ!

కారుచీకటి పొగల మేఘములు గ్రమ్మ
ప్రకృతి భీభత్సగంభీరమయ్యె నవుడు,
ఆ వికృతమేఘ మేలొకో యశ్రువులను
రాల్చి పయనమ్ము సాగించె, రాత్రి సాము
గడచిచనె, హోరుమనుచును గాలి సాగె.
ఆక్రమవ్యాప్త శైతల్య—మందు శీత
పవను సాహాయ్య మకట! ఎవ్వండు మాన్పు;
మరణబాధాప్రభుగ్నుడై పొరలు నతని
చల్లనై పోవుచున్న నిశ్వాసములకు
దీపికలు నారిపోయె, సందీప్త మరణ
మహితరకోమలమ్మగు నధర మయ్యె!
వాడుచున్న దిదేమి దుష్ప్రాప్తి నాథ!
క్రమ్ముకొనివచ్చు దుఃఖాశ్రు కణములకును
తడియు భూతలమున స్మృతిదప్పిపోయె,
వింటికొనదూసి వెడలి ఉవ్వెత్తుగాగ
వచ్చుశరవేగమున నీదు స్వామిరథము
అదియె! చేరువకేవచ్చె ననుట నాదు
హృదయకుహరాంతరమున ధ్వనించెనయ్యె!
కాలుసేతులు గదుప శక్యమ్ముగాదు.
సంధిసంధియువిరిగె; నిశ్చలత గుదిరె
నదియు మద్హృదయనాథరథాంగపటువి
ఘట్టనప్రాప్తినోట, నుత్కంఠ, లేవ
గా బెనగి, నీల్గి, యుబికి, ఎక్కడకొ ఆని
శాసమయమున తూలుచు శ్వాసలెగయ
తడబడుచు పరువులెత్త రథమ్ముగంటి.
నాల్క తడియార, నాథ!ఓ—నాథ!యనుటె
గాని, రావయ్యెభావముల్ ...కదలిపోయె
రథము, నాతోంటిచోట సర్వము శూన్య
మై చనియె, కంటిలోపాప యంతరించె.
ఈమహారక్తపాతమే హితవొ నాథ!
నాథ!.... ... ....ఓ——నాథ!

—ఊటుకూరు సత్యనారాయణరావు.



మ. ..........................................

......................ముక్తాహారకర్పూరసాం
ద్రపరాగప్రసరంబుఁ జందనముఁ జంద్రజ్యోత్స్నయుం బుత్త్రిగా
త్రపరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే? కడున్ శీతమే?

ఉ. తనయుమొగంబుపై మొగముదార్చి తళత్తళలీను చెక్కు మూ
ర్కొని సకలాంగముల్ వడి గగుర్పొడువన్ననుఁ గన్న యన్న ర
మ్మని పలుమాఱుఁ బిల్చుచును హర్షపయోనిధి నోలలాడఁజా
లని యతిమందభాగ్యుల కిలాస్థలియందున జన్మ మేటికిన్ ?

# తేటి బోటి

ఏమే భ్రమరాంగన! ఇట్లేమొయి దిరుగాడుచుంటి వేటికే? ప్రణయ
శ్రీమహితుడు ప్రాణేశ్వరు, డేమీ! పెడబాసి చనియనే? నుడువగదే!
ఎక్కడివాడె యింత బులిపింపుల బుచ్చెడి మాయకాడు? ప్రా
ద్దెక్కక మున్న లేచి పనులేమొ మునింగినతీవి పూవుట
మ్మక్కలం జేరి ఇచ్చకము లాడుచు కాలము ద్రోసిపుచ్చు ఈ
టక్కరి మాయదారుల తెఃటూరిచి నీవెటు గట్టకొంటివే?
అహ్వ! వచింప సిగ్గు; అదియూ మరియాద? కులాని కంతయున్
రవ్వను దెచ్చుపోకిళులె? రాతిరియుం పవలంచు లేదె! ఇ
ట్లివ్విధి.—రామరామ!! చరియించుట ఇంచునె నీకుగూడ? ఆ
పువ్వులు రాలిపోను! తలపుంగొనదేమి రవంత నీయెడన్?
ఏటికి! ముద్దరాల వతడే తనమాటలు నిల్పజాల డీ
పాటికి చాలులే! వెదకి వానికి వేసరిపోయినావు ఆ
లాటి మహాసురూపసుపిలాసి లభింపకపోడు! తేటిబో
టీ! టకటాంకు కూరిమి నటించెడి వారలతో పనేమిటే!
తూరుపు తెల్లవారినది దాట్టి చెలీ! మునిమాపుదన్క సం
చారములు, ఇంటి మూబిడ విచారము దూరము; వాడవాడ సిం
గారపు టుత్సవమ్ములు బికారిమగండిక చాలు! ఏలక
న్నీరొలికింతు వింతయు గణింపని యా వెడచెల్మి సేతకున్?
ఓపిక ఏది కాల్ నిలిపియుంచి సుఖింపగ ఇంటిపట్టునందు?
ఈపరువంపు నీవయసు కేదిసమానము! నిన్నవిచ్చి ఈ
మాపున వాడిపోవుచు దుమారముదోగెడి రాలుపూవులే
తీపులు గూర్చువానికి సఖీ! అత డీవలపే యెరుంగడే!
ఇంటనె కాదు పో; నిముసమెచ్చట పాదము మోపడు. ఒక్కవా
ల్గంటియె కాదు, రోజునకు లక్షలు - కోటులు - అర్బుదాలు - మి
న్నంటులు;—చూడ మీమమత లావొనగానికి జెల్లెగాని! ఇ
ట్లంటియు నంటకుండ తిరుగాడుటయే మతమేమొ వానికిన్?
ఇంతకు నీవెరుంగవనియే తలపోసెద. వీధిబడ్డ నీ
మంతిను లిందరుండ మతిమాలినవాడగుగాక పద్మినిన్
చెంతకు సేరునే! బ్రదికె నీదగు తాళిబలాన; భూమిపై
నింతకు నూకలున్నవి మహోగ్రుడు దాని సకుం డెరింగినన్.
పాయని ఈ వియోగమున పాపము! సామయి నావు నీవు మీ
ఆయన తోడిచెల్మి మలయానిల నందను దప్పుడప్పు డా
ప్యాయన మేర్పడం దిరుగువాడు, అగుపించిన వానిజాడలన్
దీయనువచ్చు కష్టపడి. తెల్పితి నా ఎరుగున్న సంగతుల్.

ప్రతివచనము:—

అమ్మకచెల్ల! ఆత డెడమైనపు డాత్మను పట్టరాని కో
పమ్మున కక్షబూని కలబంధము తెంపులు సేసుకొందు గా
నిమ్ము, హఠాత్తుగా ఎదుట నిల్చినవేళల నేనెరుంగకే
సొమ్మసిలున్ మనమ్ము, ఒడిచొచ్చును మేను; ముఖమ్ము ముద్దిడున్.
అతనిదై పోయె ఈ హృదయమ్ము నమ్ము, ఒక్కగడియ ఎడాటమే ఓర్వజాల
సన్నిధిని నున్న లేకున్న జాలువారు౦ ఏటిఝురులతో ఎసగ! — కన్నీటివరద.

—బొడ్డు బాపిరాజు.

## ఉత్తరములు

కల మనసిచ్చినట్టి జతగాడనుచున్ దలపుంచి రాకరా
కలకయి చిన్నికల్వపువు కన్నులు కాయలు గాయచూచి ఊ
ర్పులసిరి ద్రోసిపుచ్చె; నెనరుంగలవాడె హితుండుకాని, లో
కులతరహా లెరుంగ నదిగోల, అమాస స్మరింపదయ్యెగా!
'క్రమ్మరవత్తు' నంచు చెలికాడు మధుప్రియు డానగొన్నమా
త్రమున నమ్మి చేతికిని దక్కని యాతని—మాతమిద్ది కా
ని—మ్మని పోవనిచ్చితివి; నెమ్మది నీదరినున్న మేలికా
లమ్మున రేకులన్ విచికిలా! బలవంతమునన్ బిగింపవు, ఆ
ద్రిమ్మరి కేటిబాస? పలుతీరులు ప్రొద్దొకవింతచెద్దియముల్!
అతిపిపాసాకులాత్మ కృశాంగియయ్యు, తొలకరితలంపులాగ మిన్నులనుగాంచు
అకట! చాతకి తనదప్పి యార్చుకొనగ, నీళ్ళు కరవయ్యెనే ధరణీతలాన?..'రాజు'

ఏమని నిందమోపి సహించును పద్మిని? లోకబాంధవుం
డా మగడొక్కచోట దనయానతిపై నిముసమ్ము నిల్చి, ప్రే
మామృతధారజిల్కి మనసారగ బల్కడటంచు; లోన దా
నేమి యెఱుంగదే? పతి యహీనమనఃప్రియతానురాగముల్.

ఆమని రాకగోరి హృదయంబున తల్లడమందనేల నీ
వీమెయి కోకిలా! మనను నించుక నశ్వమొనర్చుకొమ్ము. రా
కేమి ప్రియమ్ము కల్గినపు డింతట నంతట, నీదు స్వాగతం
బేమని రిత్తపుచ్చగల దీమధుమాసము? గుండెలున్నవే!
''చని. మలు సంజవేళ కిటుసాగుము; చీకటిపడ్డ ద్వారముల్
మునుపటివోలె మూయబడ మోసమొనర్చితి నందు''వంచు ప
ద్మినియనుపల్కు లో హతవిధీ! నిజమా యెసటంచుగుందు దే
మనెద? మధువ్రతా! మఱల నామలుసంజయె రాకపోవునా?

—'శర్మ'

## హిందూదేశములో పోస్టుకార్డుచరిత్ర

1854 వ సంవత్సరమునకు పూర్వము హిందూదేశమున పోస్టాఫీసులకు ఒక క్రమనిర్మాణముగాని, ఒక నీతినియమముగాని లేదు. ఒకరాష్ట్రముననున్న నియమములు మఱియొక రాష్ట్రమున లేవు. ఒక జిల్లాలో పోస్టు ఆఫీసుల నిర్వహణమునకు ఆ జిల్లాకలక్టరు బాధ్యుడై యుండెను. మెయిన్‌లైన్ల టపా బట్వాడా నేటివలె వాడు ఏర్పడియుండలేదు. స్టాంపులులేవు. దూరమునుబట్టి రేట్లనిర్ణయము జరుగునది. ఒకతావునుండి మఱియొకతావునకు దూరమెంతో సరిగా నిర్ణయింపబడియుండలేదు. కావున దూరనిర్ణయము పోస్టల్ క్లార్కు చేతిలోనుండెను. అతని చేతిలో నాలుగుడబ్బులుపెట్టినవాడివిషయమున దూరస్థలములు కొంచము చేరువపడుచుండెను. పెద్దపెద్ద పోస్టాఫీసులలోని ఆనాటి క్లార్కులకు 'పైనదొరకడం' చాల ఎక్కువగానుండెను. 1854-వ సంవత్సరములో పోస్టుఆఫీసు ఆక్టు ఆమోదింపబడెను. అప్పటినుండియు పోస్టుఆఫీసులపరిపాలన కేంద్రప్రభుత్వమునకు లోబడెను. హిందూదేశమున పోస్టుకార్డులు 1879 వ సంవత్సరమున మొదటిసారి ప్రవేశపెట్టబడెను. నేడు పోస్టుఆఫీసులద్వారా బట్వాడాఅగు వస్తువులలో దరిదాపు సగము కార్డులే. ఈ కార్డులప్రవేశము తొలుత ప్రజలచే మిక్కిలి అనుమానముతో చూడబడెను. కాని మిక్కిలి చౌకయగుటచే అచిరకాలముననే అవి విశేష ప్రచారమునందెను. హిందూదేశపు దినపత్రికలలో చిరప్రతిష్ఠనార్జించిన అమృతబజారుపత్రిక 1879-వ సంవత్సరము జూలై 18-వ తేదీనాటి సంచికలో ఈ పోస్టుకార్డుల ప్రవేశమునుగూర్చి ఇట్లు సంపాదకీయము వ్రాసెను: "ప్రస్తుతము పోస్టుకార్డులు హిందూదేశమునంతటను ప్రాకిపోవుచున్నవి. ప్రభుత్వమువారు ప్రజలరహస్యములను కనుగొనుటకు వీనిని ప్రవేశపెట్టిరనువారు కలరు. కార్డులోని విషయములు ఇతరులకు తెలియకుండుటకై తమవ్రాతను ప్రయత్నపూర్వకముగ జిలుగుకత్తులోనికి కొందఱు దింపుచున్నారు. కొందఱు పట్టిపొడి అక్షరములను వ్రాయుచున్నారు. ఆపొడి అక్షరములు పోస్టల్ క్లార్కునకేగాక చిరునామాదారునకు కూడ తెలియరానిస్థితిలో ఉంటున్నవి. పోస్టులో గాని, సొంతమనుష్యులచేత గాని పంపు ఉత్తరములన్నియు ఈ కార్డులమీదనే వ్రాయవలయునని ప్రభుత్వమువారి ఆజ్ఞఅయినట్లు కొందఱు అభిప్రాయపడుచున్నారు. ఒక కార్డుమీద సరిపోవని విషయములు కవరువల్ల పంపవచ్చుననుట కొందఱికి తెలియదు. రాజభక్తుడగు ఒకలావుపాటి జమీందారు ఈనడుమ ఈకారణముచే తాను తన తాబేదారునకు వ్రాయవలసిన విషయములను పదికార్డులమీద వరుసగా వ్రాసి తన అజ్ఞానమును వెల్లడించెను. మఱికొందరు తాము వ్రాయవలసిన విషయములను కార్డులమీదవ్రాసి వానిని కవరులోపెట్టి కవరు అంటించి దానికి అర్ధణాబిళ్ళ అతికించి పోస్టుచేయుచున్నారు. పైగా ఇంతటి వ్యయమునకు మమ్ము ఏల పాల్పఱచెదరని ప్రభుత్వమునుగూర్చి వారు ఆందోళన చేయుచున్నారు. రాజద్రోహము పురికొల్ప కంకణము కట్టుకొన్న దేశభాషాపత్రికలు ఈ విషయమును జారవిడువవని నమ్ముచున్నాము. ఈ పోస్టుకార్డుల విషయమైన ఒక పెద్దకష్టమేదియన ఏ ప్రక్కను చిరునామా వ్రాయవలయునో అనునది నేర్పుట. ఇది అందఱికి నేర్పుటకు కొద్ది సంవత్సరములుపట్టునని తలంతుము. కావున ఒక్కసంగతి. చిరునామా ఏ ప్రక్కను వ్రాసినను అభ్యంతరముండకుండుట మంచిది. బ్రిటీషు వారి చల్లనిప్రభుత్వముక్రింద బ్రతుకుచున్న ఈహిందూదేశపు ప్రజలకు వారి ఇష్టమువచ్చినట్లు కార్డులమీద ఏప్రక్కనైనను చిరునామా వ్రాయుటకు హక్కు ఉండవలయునని మేము అభిప్రాయపడుచున్నాము." ఆనాటి అమృతబజారుపత్రికవారి అభిప్రాయము ప్రకారము పోస్టు

కార్డుమీద ఏ దిక్కునైన, ఏ ప్రక్కనైన చిరునామా వ్రాయుటకు ప్రజలకు ఈయబడియుండినచో పోస్టాఫీసులో సార్టర్లపని ఏనాటికానాడే చావుతప్పి కన్ను లొట్టపోవుచుండియుండును. ఇంతయును నేడు ఆ అమృతబజారుపత్రికయే ఆనాటి తన సంపాదకీయముతో ఏకీభవింపదని నిస్సంశయముగ చెప్పవలసియుండును. 1879 మొదలు పదియేండ్లక్రితమువఱకు కానీ విలువలో నుండిన పోస్టుకార్డు నేడు మూడు కానులమ్ముచున్నది. అన్నివస్తువులకు ధరలుతగ్గిన ఈ కఱవురోజులలోకూడ పోస్టుకార్డుధర మన ప్రభుత్వమువారి దయవలన తగ్గలేదు. తోకలేకుండ తొంబదిఆమడ పోగల పిట్ట అని పొడుపుకథలలో వర్ణింపబడు పోస్టుకార్డువెల తొమ్మిది పైసాలు ఉండడం ప్రభుత్వంవారికి వింతగ నుండకపోవచ్చును. కాని ప్రజలకు...ప్రజలమాట ఎవరికికావలెను?

—ఆర్. శ్రీరామమూర్తి, బి.ఏ.

* * *

## ఆయుర్వేదవైద్యుల శస్త్రకర్మాభ్యాసము

'ఆంధ్రభూమి' ఫిబ్రవరి సంచికయందు ప్రకటింపబడిన విపులవిజ్ఞానదమును, విశేషవినోదకరమును అగు "శస్త్రవైద్యుల కరకౌశలము" అను వ్యాసరాజమును చూచిన తదుపరి పాఠకలోకమునకు ఆధునికశస్త్రవైద్యవిధానమునకంతటికిని మూలాధారమనదగు ప్రాచీనకాలమందు హైందవశస్త్రవైద్యశేఖరుల కరకౌశలవిద్యావిధానమునుకూడా విన్నవించుకొన బుద్ధిఒడముటచే ఈపంక్తులు వ్రాయుచున్నాను. పూర్వకాలమందు శస్త్రవైద్యశేఖరులలో అగ్రగణ్యులనదగు శుశ్రుతాచార్యాదులు ప్రపంచమందలి దుఃఖపరంపరలకు కారణభూతములగు శారీరక మానసిక ఆగంతు అభిఘాతము లనువాని యుపద్రవములను, వానివలన ప్రజలకు గల్గుబాధలను చూచి సహింపలేనివారై భగవంతుడగు ధన్వంతరియొద్దకు జని ప్రజాహితార్థము రోగనివారణోపాయయుక్తమగు ఆయుర్వేదమహాశాస్త్రమును నేర్చుకొని మానవసేవకు గడంగియుండిరి. అందువలన అట్టి మహనీయులు ఎంతటి దయార్ద్రహృదయులో, ఎంతటి పరోపకారపారీణులో పాఠకమహాశయులకు విదితమేకదా? మరియు పూర్వము శస్త్రవైద్యము, (వైద్యవృత్తిని) శీలవంతులుమాత్రమే అభ్యసించుటకును ఆతురులను రక్షించుటకును, యశోవంతులగుటకును, అర్హతకలవారైయుండిరి. ఇదియునుకాక ప్రాచీనకాలమందు వైద్యవిద్యార్థులను సేకరించునప్పుడే యున్నతకుటుంబములందు జన్మించినట్టివారిని శీలశౌచఆచారవినయశక్తిబలమేధాధృతిస్మృతిసంపన్నులగువారిని, మతిమంతులగువారిని పరీక్షించి అర్హతవిచారించి వైద్యశాస్త్రమును అభ్యసింపచేయుచుండిరి. తదితరులకు వైద్యవిద్య నేర్పుటకు కూడా సాహసించకుండిరి. ఇట్టి గుణగణవిరాజితులగు శిష్యవర్యులను కామక్రోధలోభమోహ అహంకార ఈర్ష్యపారుష్యములకు వశ్యులనుకానీక సత్యవ్రతాచరణులుగను, బ్రహ్మచర్యతత్పరులుగను, మానవసేవకు అర్హులుగను నొనర్చి క్రమశిక్షనొసంగి వైద్యపట్టము నొసంగుచుండిరి. అందువలన ఆకాలమందలి శస్త్రవైద్యులు ప్రజాసేవయే ప్రధానోద్దేశముగనెంచి లోకమునకు వైద్యసహాయము నొనర్చుచుండిరి. మరియు శస్త్రవైద్యమునందు సమర్థులుకాగోరు వైద్యశేఖరులు శౌర్యము, ఆశుక్రియ, అస్వేదము, వణుకు లేకయుండుట యీ మొదలగు గుణవిరాజితులుగ నుండవలయును. శస్త్రవైద్యునకు ప్రధానముగనుండవలసిన గుణములలో ప్రసన్నచిత్తము అత్యుత్తమమయినది. అట్లు ఉండుటకు సంతోషకరములగు పనులుచేయుట, వినోదములు దర్శించుట, యుల్లాసముగ మిత్రులతో సంభాషించుట అనునవి చేయుచుండవలయును. అందువలననే శుశ్రుతాచార్యుడు "ప్రసన్నచిత్తాఙ్ఞ" అని చెప్పియున్నాడు. అందునను ముఖ్యముగ శస్త్రకర్మ చేయబోవుదినమునను దానిక్రిందటి దినముననుకూడా ప్రసన్నచిత్తుడయి అనగా నిర్మలచిత్తముతో ఉండవలయును. అందువలన తాను చేయబోవు శస్త్రకర్మను గురించి బాగుగా ఆలోచించి దానిని ఎట్లు చేయవలయునో, ఏదిముందు చేయవలయునో అనువిషయమును బాగుగా తెలుసుకొనగలుగుచున్నాడు. అట్లుకాక చింతానిమగ్నుడయి రోగిని యుపచరించుటయందు అశ్రద్ధ, ఆయాసము, విముఖతచూపినయెడల అతడు

'శస్త్రవైద్యుల కరకౌశలము' అను వ్యాసమునందు డాక్టరు అబ్రహామ్ ఊల్ఫారాస్టు చెప్పినటుల రోగికి యము డగుననుటకు సందేహములేదు. పూర్వకాలమందు శస్త్రవైద్యులు వారి కరకౌశలమును వృద్ధినొందించుటకు 8 విధములగు శస్త్రకర్మలను వారివారి అభిరుచి ననుసరించి యీ క్రింద చెప్పునటులచేసి వారి హస్తములకు నిపుణత అలవరచుకొనుచుండెడివారు.

(1) ఛేదనం:— ఇందు అత్యంతసమర్థులుకాగోరు శస్త్రవైద్యశేఖరులు వారితీరికసమయములందు బూడిద గుమ్మడికాయ, దోసకాయ మొదలగు వానిని పుష్పములను వీనిని ఛేదించి తమ కరకౌశలమును వృద్ధిచేసికొనుచుండిరి.

(2) లేఖనం:— (స్క్రేపింగు) ఈ కర్మయందు రోమములతోకూడిన చర్మములమీద వారు పరిశ్రమ చేయుచుండెడివారు.

(3) వేధనకర్మ:—(టాపింగు : రంధ్రముచేయుట) దీనియందు మృతపశువుయొక్క రక్తనాళములు గాని, ఉత్పలనాళములను గాని గ్రహించి వానిమీద పరిశ్రమ చేయుచుండెడివారు.

4. ఏషణకర్మ:—(ప్రోబింగు : పుండు మొదలగు వానిని శోధించుట) ఇందు తామరతూడులు మొదలగు వానియందు పరిశ్రమచేసి అలవరచుకొనుచుండిరి.

(5) ఆహరణం:—(ఎక్స్ట్రాక్షన్ : ఊడదీయుట) ఇందు మృతపశుదంతములను మొదలగువానిని పెకలించి ఆకర్మయందు ప్రవీణతనందుచుండిరి.

(6) విస్రావణం:—(చీము మొదలగునవి వెలార్చుట) ఇందు తేనెమయినమును బూరుగ చెక్కమీద ఒత్తుక పట్టించి దానిని కరగించి స్రవింపచేసి అందు పరిపూర్ణత నందుచుండిరి.

(7) సీవనం:—(గాయమైనచోట చర్మమును చేర్చి కుట్టుట) ఇందు మృదుచర్మములను, వస్త్రములను మొదలగువానినిపట్టి ఆకర్మయందు ప్రవీణత నందుచుండిరి.

(8) బంధనం:—(గాయమునకు గాని పుంటికి గాని వస్త్రములో కట్టుకట్టుట) ఇందు వస్త్రములతోను తదితరమగు వానితోను తయారుచేయబడిన బొమ్మలయందు కట్టుకట్టి దానియందు సమర్థత సంపాదించుచుండిరి.

ఈ విధముగా శస్త్రకర్మలనన్నిటియందును సమర్థత సంపాదించి ఋజువర్తనులై పూర్వకాలమందు భారతశస్త్రవైద్యశేఖరులు ప్రస్తుత వైద్యశేఖరులకు మార్గదర్శకులై, శస్త్రవిద్యాభివృద్ధికి ప్రధానబీజములై సహస్రవత్సరములకు పూర్వమే ప్రజాసేవయొనర్చియుండిరి. కనుక ప్రస్తుత భారతవైద్యశేఖరులును ఆమార్గమనుసరించి అభివృద్ధిపొంది ప్రాచీనగౌరవమును నిలబెట్టగలందులకు ఆశించుచున్నాము.

—ముఖ్యగు రాజలింగ ఆరాధ్య.

* * *

## స్త్రీలు: గర్భధారణకాలము

గర్భవతులైన స్త్రీలను పలుప్రశ్నలడిగి తెలిసికొనిన విషయముల నాధారముచేసికొని జర్మనుశాస్త్రజ్ఞుడొకడు 'స్త్రీలు: గర్భధారణకాలము' అను విషయమును గూర్చి ఇట్లు తెలుపుచున్నాడు: "ఋతుస్నానమైన పిమ్మట రజస్సు పూర్తిగకట్టుబడిన యనంతరము తొలిదినములలో గర్భములు ధరించిన నిదర్శనములు పెక్కు గలవు. నేను పరీక్షించిన వారిలో ముట్టునెల ముందు దినములందు గర్భము ధరించినవారు ఒక్కరుకూడ లేరు. ఆకాలము గర్భధారణకు కాలము కాదనియే చెప్పవలసియున్నది. ఋతుస్నానమైన పిమ్మట గర్భధారణకాలమును సూక్ష్మదృష్టిలో మూడు భాగములుగ విభజింపవచ్చును. రజస్సు కనిపించిన మొదటి తొమ్మిదిరోజులు ఒకభాగము, పదియవదినము మొదలు పదునాలుగవ దినమువరకు ఒకభాగము, పదునాలుగవదినము మొదలు ఇరువదిరెండవ దినము వరకు ఒకభాగము. తరువాత ఆరుదినములు గర్భధారణకు అననుకూలములని నా భావము. ఈ విషయమై నేను ఎనుబదిమంది గర్భవతులగు స్త్రీలలో సంప్రదించితిని. వారిగర్భధారణకాలమును గుర్తించి నోటుచేసికొంటిని. ఇందు మొదటి తొమ్మిది రోజులలోను గర్భముధరించిన కాంతలు నలుబదినలుగురు. అందు ముప్పదియేడుగురు మగబిడ్డలను, ఏడుగురు ఆడబిడ్డలను ప్రసవించిరి. తొమ్మిదిరోజులు దాటి పదునాలుగురోజులలోపు కాలమున గర్భము ధరించిన

కాంతలు పండ్రెండుగురు. అందు నలుగురు మగబిడ్డలను ఎనమండుగురు ఆడబిడ్డలను ప్రసవించిరి. పదునాలుగు దినములు దాటి ఇరువది రెండు రోజుల లోపల గర్భము దాల్చిన కాంతలు ఇరువదిముగ్గురు, అందుముగ్గురుబాలురను, ఇరువదిమంది బాలికలను ప్రసవించిరి. ఋతుస్నానమైనక్రొత్తలో గర్భముధరించిన వారు మగబిడ్డలను హెచ్చుగను, దినములు అతిక్రమించినకొలది గర్భము ధరించినవారు ఆడుబిడ్డలను హెచ్చుగను ప్రసవించుట గమనింపదగినది.''

—మాట్రిమోనియల్ రెవ్యూ.

* * *

## రూజువెల్టుసతి

అమెరికన్ అధ్యక్షుడు రుజువెల్టుగారిసతి ప్రజ్ఞాధురీణ, శక్తిసంపన్న. అపూర్వసామర్థ్యముగల అతివ. ఎంత క్లిష్టవిషయమునైనను సూక్ష్మముగ గ్రహింపగలది. అధ్యక్షుమహాశయుని అర్ధాంగినిగదా యనుగర్వ మామెకులేదు. ఆడంబరమనిన ఆమెకు గిట్టదు. తనభర్త నిర్వహించుచున్న ప్రభుత్వవిధానమున ఇతరులు అనుకొననియంత హెచ్చుపాలే ఆమెకు గలదని చెప్ప వలసియున్నది. నీలవర్ణపు ట్వీడ్ దుస్తులు ఆమెకు ప్రియతమములు. ప్రతిశనివారమునాడును ఆమె తనకు ప్రియతమమైన బ్లూట్వీడ్‌దుస్తులను ధరించి, 'మెగ్గీ' అను పేరుగల తనపెంపుడుగుర్రమెంటనంటి గొనుకుచ్చెళ్లను జీరాడుచుండగా మగని కార్యనిర్వాహకశాఖాకార్యాలయమందిరము నతిక్రమించి తన మందిరమునకుపోవును. అచ్చట ఆమె వార్తాపత్రికలప్రతినిధులతో ముచ్చటించును. అమెరికాదేశమున అధ్యక్షుడనగా ప్రథమపౌరుడు. అట్టిప్రథమపౌరుని అర్ధాంగలక్ష్మి వార్తాపత్రికల ప్రతినిధులతో కలసి ముచ్చటించుట ప్రజాస్వామికమునకు ప్రారంభసీమ యనదగిన ఆదేశమునగూడ ఆశ్చర్యకరవిషయమే. మఱియు, నామె వారమునకు ఒకసారి వాషింగ్టన్‌నందలి వార్తాపత్రికానిర్వాహకులాంధ్ర నెల్లర రప్పించి వైట్‌హౌసునందు ఒకప్రత్యేకమందిరమున సమావేశము గావించును.''

—ది అమెరికన్ మాగజిన్.

## కన్యలు: చక్కిలిగింత

అమెరికన్ జర్నలు ఆఫ్ సైకాలజీనుండి అనువదింపబడి మార్చిమాసపు ఈపత్రిక మణిమాలలో ప్రచురింపబడిన 'చక్కిలిగింత: కామవికారము' అను వ్యాసశకలమును చూచిన పిమ్మట మాక్సు బార్టెల్సు అను వారు 'మెడికల్ మాన్' అను పత్రికలో 'కన్యలు: చక్కిలిగింత' అను విషయమును గూర్చివ్రాసిన ఈ పంక్తులు ప్రచురింపదగుతూహాలముకలిగినది. "వివాహితలగుస్త్రీలు పలువురు నాతో తమకు చంకలయందును, స్తనప్రదేశములందును ఉండిన చక్కిలిగింతలు వివాహానంతరము తగ్గిపోయిన వని చెప్పియున్నారు. అదియే ప్రదేశములను వివాహమునకు పూర్వము ఇతరులు ముఖ్యముగ పురుషులుతాకినచో తాళరానంత చక్కిలిగిలి యుండెడిదని వారుచెప్పియున్నారు. కన్యలు చక్కిలిగింత కలిగియుండుట ప్రకృతి వారికి అభిజాత్యము నిలుపుకొన అనుగ్రహించిన సాధనవిశేష మనవచ్చును. కన్యలు అన్యులచే ముట్టుకొనబడనొల్లరు. వారికి చంకలు మొదలగు ప్రదేశములందు నిశితమైన చక్కిలిగింతయుండును. తాకుడు చేతనే వారు గిచకొట్టుదురు మానపరిరక్షణమున వారికిగల గొప్పఆయుధ మిది. వివాహిత యగు స్త్రీ తా నొకపురుషుని ప్రేమించుటచే చక్కిలి గింత ఆమెకంత యావసరములేదు. అదియును గాక స్పర్శకు పరిచితినొంది వారి చర్మము చక్కిలిగింత యందలి నైశిత్యమును గోల్పోవును. ఐస్‌లాండునందు యువకులయు, యువతులయు పారిశుద్ధ్యమును వారివారికిగల చక్కిలిగింతయొక్క నైశిత్యమునుబట్టి నిర్ణయించుట నేటికి కూడ ఆచారమైయున్నది. చక్కిలిగింత యొక్క నైశిత్యములేని యువకులయు, యువతులయు శీల విషయమున ఐస్‌లాండుదేశస్థులు గాఢముగ శంకించుటయే గాక వారివారి భావిజీవితమునకు అదియొక దుశ్శకునముగగూడ భావింతురు." 'గిలిగింతసేఁతకుఁ గినుకయు సిగ్గును మొలవంగఁ గన్నులు మోడ్చుకొనును' అని కన్యల చక్కిలిగింత విషయమున శృంగారశ్రీనాథుడొకచో నుడివియున్నాడు.

—రేపాక జగన్నాథము.

# పెండ్లి ప్రసంగము

పెళ్ళిఅంటే పసిపిల్లలకు కూడా తెలుసు——ఆడది, మగవాడు నేస్తంకట్టుకొని పిల్లల్నికంటారని. పక్షులలోను, జంతువులలోనుకూడా యీ అలవాటు ఉంది. అయితే, వాటికంటె తను దాంపత్యాన్ని కొంత సౌఖ్యప్రదంగాను, నీతివంతంగాను చేసుకుందామని మానవుడి ఆశయం. మానవసంఘంలోగల పెళ్లిఅనే బాంధవ్యాన్ని అతడు అట్టి సదుద్దేశంతోనే నిర్మించుకున్నాడు. కాని తనశ్రేయంకోసం తాను పన్నుకున్న వలత్రాళ్లలో అప్పుడప్పుడతడు ఉక్కిరిబిక్కిరై విలవిల తన్నుకోవడం కూడాకద్దు. ఒక్కొక్కప్పుడతడు పెళ్ళిఅంటే బతేముచ్చటపడి, చంకలు గుద్దుకుంటాడు; ఒక్కొక్కప్పుడు ఎంతో విసుగుకొని, గుండెపగిలేట్టు యేడుస్తాడు!

పెళ్ళినిగూర్చి పెద్దపెద్దవాళ్ళకు కూడా భిన్నాభిప్రాయాలున్నాయి. పెళ్ళిఅనేది జీవితానికి శోభగూర్చే మహామంత్రమనీ, గృహస్థాశ్రమమే స్వర్గమనీ కొందరి నమ్మకం. మానవసంఘానికి పెళ్ళి పునాదివంటిదని శాస్త్రివేత్తలతీర్పు. వయసు, ఆరోగ్యంగల ప్రతీమనిషీ పెండ్లాడి తీరవలసిందే అని బోధిస్తుంది కొరాన్. ముక్తికి గృహస్థాశ్రమంకంటె ఉత్తమాశ్రమం మరొకటి లేదంటారు మనఋషులు. పెళ్ళిచేసుకోని మనిషి దానంయిచ్చినా ఎవరూ పుచ్చుకోకూడదన్నాడు అత్రి మహాముని! చైనావాళ్ళు తాము పెళ్ళిచేసుకోకుండా ఉండడం పితృదేవతలపట్ల ద్రోహంచేసినట్లని భావిస్తారు. పూర్వం గ్రీసుదేశంలో యుక్తవయస్సువచ్చి పెళ్ళాడకుండా ఉన్నవాళ్ళను పాలకులు శిక్షించేవారట! నేటి ఇటలీలో బ్రహ్మచార్లకు పన్నువిధించాడు ముస్సోలినీ ప్రభువు. జర్మనీలో వధూవరులకు పెండ్లికట్నాలిస్తున్నాడు హిట్లర్ మహాశయుడు! ఇక, వివాహమనేది ఒక ప్రకృతివిరుద్ధమైన వ్యసనమనీ, అనవసరబంధనమనీ, అసందర్భాచారమనీ తలచేవాళ్ళు లేకపోలేదు. పెండ్లాడడమంటే కొరవితో నెత్తిగోకుకోవడమనీ, పెళ్ళిఅనే పాడుఆచారం మనిషియొక్క స్వాతంత్ర్యాన్నిచంపేసి సకలబాధలూ పెడుతూఉందనీ, అంటువ్యాధివలె మానవసంఘాన్ని పీడించి పిప్పిచేస్తూఉందనీ, పెళ్ళిఅంటే దాస్యం అనేమాటకు నాజూకైన పర్యాయపదమనీ ఘోషపెడతారు కొందరు నవనాగరికులు. ప్రత్యేకవ్యక్తులపై సంఘంచేస్తూఉన్న దౌర్జన్యాలలో పెళ్ళి మొదటిదని వారిభావం. పూర్వం సెయింట్‌పాల్ అనే క్రైస్తవమతగురు వొకడు, 'పెళ్ళిచేసుకోవడంకంటె, చేసుకోకపోవడమే గొప్ప!' అని ఉపదేశించాడు భక్తులకు. వివాహమాడడం, పిల్లల్నికనడం, ఆడదానికి అవమానకరములైన సంగతులని భావిస్తూఉంది నేటి అమెరికాస్త్రీ. పెళ్ళికి ఉండవలసిన సాంప్రదాయాలు, కట్టుదిట్టాలు, అన్నీనశించాయి సోవియట్ రష్యాలో. పెండ్లాడడం అక్కడ ఎంతసులువో, పెళ్ళి తెగదెంపులు చేసుకోవడంకూడా అంతసులువు. పెళ్ళిచేసుకోకుండా బిడ్డల్ని కనుక్కున్నా, నేటి రష్యాలో మరేమీ అక్షేపణలేదు. వావివరసల పట్టింపుకూడా అట్టేలేదు. కాని తల్లిని కొడుకు, తండ్రిని కూతురు, అన్నను చెల్లెలు,... మొదలైనవిమాత్రం నిషేధములు! లోకో భిన్నరుచిః', అన్నారు పెద్దలు. పెళ్ళియెడల మానవుడి అభిప్రాయాలు, అనుభవాలు, ఎప్పటికప్పుడు మారిపోతూ ఉండడంలో అసహజం యేమీలేదు.

సంఘం ఒప్పుకునేవిధంగా ఒక పురుషుడు ఒక స్త్రీతోకలసి ఉండడమే పెళ్ళి. సంఘానుమతిపైని ఒక పురుషుడనేకస్త్రీలను, ఒకస్త్రీ అనేకపురుషులను కూడ పెండ్లాడవచ్చును. సంఘం యిష్టపడనిబాంధవ్యం ఎట్టి న్యాయమైనదైనా, ఎంత సౌఖ్యప్రదమైనదైనా వివాహ మనిపించుకోదు. వివాహమనిపించుకునే స్త్రీపురుష బాంధవ్యానికి దేశం, మతం, 'లా', మొదలైన వాటినిపట్టి యేర్పడిన కొన్ని నిబంధనలుండకతప్పదు. ఏమంటే, దాంపత్యంయొక్క ముఖ్యఫలితం సంతానం. పెళ్లిఅనే నిబంధనలేనప్పుడు సంతానపోషణకు యిబ్బంది

కలుగవచ్చును. కాబట్టి, పుట్టడానికి, పెరగడానికి, బిడ్డలకు హక్కునిచ్చే సూత్రమే పెళ్ళి. పెండ్లాడుకున్న స్త్రీపురుషులకు బిడ్డలమూలాన కొన్ని విధాయకకర్మాలు, హక్కులు యేర్పడుతవి. అప్పుడు సంతానసంరక్షణను గూర్చి తల్లిదండ్రులకు తగిన ఉత్సాహం, బాధ్యత కలగకతీరదు. సాధారణంగా భార్యను, పిల్లలను పోషించి రక్షించేభారం పురుషునిది. బిడ్డలనుపెంచి, యిల్లు చక్కబెట్టుకొని, భర్తకు పరిచర్య చెయ్యవలసిన విధి భార్యది.

పెళ్ళికి విధాయకములైన ధర్మశాస్త్రాలు, న్యాయ చట్టాలు, సంఘాచారాలు, మతనియమాలు దేశాలను, దేశకాలపరిస్థితులనుబట్టి అనేకరకాలుగా ఉండవచ్చును కాని, ఏదేశంలోనైనా, ఎట్టిపెళ్ళిఅయినా, ఏదో ఒక కట్టుదిట్టంలేనిదే జరగదు. పెళ్ళికి వధూవరుల సమ్మతి ముఖ్యంకావచ్చు; లేదా తల్లిదండ్రుల అనుమతి అవసరంకావచ్చు. కట్నాలు, కానుకలు విధింపబడవచ్చు. కులం, మతం, దేశం మొదలైనవాటి ననుసరించి వివాహకాండ నిర్ణయింపబడవచ్చు. స్త్రీపురుషులిద్దరు భార్యాభర్తలనిపించుకుందుకు సంఘము, 'లా', విధించే నియమాలను పాటించకతీరదు.

ఆదిని యీ వివాహాచారం శరీరప్రకృతి ననుసరించి మానవసంఘంలో యేర్పడిన ఒక అలవాటని తోస్తుంది. ఏమంటే, పెళ్ళియొక్క సారాంశం ఆడది, మగవాడు కలసి పిల్లల్నికని, పెంచడమే! ఒక పురుషుడొకస్త్రీతోనో, పలువురు స్త్రీలతోనో కలసి ఒకచోట నివసించడం, శరీరవాంఛలను తీర్చుకొని పిల్లల్నికనడం, వాళ్ల సంరక్షణకోసం తాపత్రయపడడం, అనాదినుండి వస్తూ ఉన్న అలవాటే. పశుపక్ష్యాదులలోకూడా కొంతవరకు యిదే పరిపాటు. పెద్దజాతిపక్షులలో సంభోగఋతువులలోనేగాక, పిల్లలు పుట్టినపిమ్మటకూడా మగపక్షిఆడపక్షినుండి విడిపోదు. డాక్టర్ బ్రేహామ్ అనే పక్షిశాస్త్రజ్ఞుడు, 'నిజమైన పెళ్ళిఅంటే పిట్టలలోనే ఉంది!' అని వ్రాశాడు. చక్రవాకాల ఐకమత్యాన్ని మనపురాణ కవులు ఆదర్శదాంపత్యంగా నిరూపించారు. పెద్దజాతి జంతువులలో యిట్టి సఖ్యత బహు అరుదు. వాటిలో పిల్లలపట్ల శ్రద్ధాభిమానాలు ఎక్కువకాలం తల్లికేకాని, తండ్రికి ఉండవు. కాని 'చింపాంజి', 'గొరిల్లా' మొదలైన కోతులలో దాంపత్యమర్యాదలు కొంతకాలం స్థిరంగా నిలుస్తాయి; పిల్లలంటే తండ్రికికూడా ఎంతో అభిమానం. అనాగరికజాతులైన అడవి మనుష్యులలో సహితం, కుటుంబానికి తండ్రి యజమానిగా ఉండి సంతానపోషణకు పాటుపడతాడు. పెళ్ళిఅనే ఆచారం మానవసంఘంలో నెలకొల్పబడక పూర్వమే, అప్రయత్నంగా, స్వభావసిద్ధంగా కొన్నికొన్ని వివాహధర్మాలను పాటిస్తూ ఉండేవాడు నరుడు!

సృష్టిలోని యితర జీవరాసులవలె కట్టుబాట్లులేని ప్రేమసుఖాల ననుభవించడానికి మానవుడు నోచుకోలేదు. ఇందుకు ముఖ్యకారణం వాని అసాధారణ యీర్ష్యాస్వభావమే! మానవునిబుద్ధిబలం, యీర్ష్యగుణం, స్వార్థపరత్వం కలసి వివాహమనే ఆచారాన్ని నిర్మించుకున్నాయి. జంతువులలోకూడా యీ గుణాలున్నాయి కాని, మనకున్నంత దారుణంగాలేవు. కనుకనే వాటికి అగత్యంలేని పెళ్ళినియమాలన్నీ మానవుడికి అవసరమవుతున్నాయి.

నాగరికత అభివృద్ధి అవుతున్నకొలదీ, మారిపోతూ ఉన్నకొలదీ, వివాహాచారాలలోను, ధర్మాలలోను మార్పులువస్తూ ఉండడం సహజం. కాబట్టే ఒకానొక సంఘానికి సరిపడేశాస్త్రాలు మరొకసంఘానికి పనికిరావు. ఒక యుగమునందు ప్రశస్త్యంగాఉన్నధర్మాలు వేరొకయుగమునందు వెగటుగా ఉంటాయి.

ప్రపంచంలో ఏదేశంలోను, యిప్పుడు అమలులో ఉన్న వివాహాచారాలు సర్వజనామోదకరములుకావు. ఎవరివెర్రి వారికానందమన్నట్లు, ఎవరి దేశాచారాలను వాళ్ళు గొప్పగా చెప్పుకుంటూ, మీదుమిక్కిలి పైవాళ్ళను ఆక్షేపిస్తారు. హిందూబాల్యవివాహాలంటే తెల్లవాళ్ళు వెక్కిరిస్తారు. వాళ్ళ ముసలిపెళ్ళిళ్ళు చూస్తే మనకునవ్వు! విడాకులంటే కొందరికి ముచ్చట; విధవరికమంటే కొందరికి పట్టింపు. సాయిబులలోవలె బహుభార్యత్వం కొందరికి శాస్త్రసమ్మతం; టిబెట్‌లో వలె ద్రౌపది మోస్తరుగా బహుభర్తృత్వం కొందరికి పాతి

ప్రత్యధర్మం! ఈడుమీరి, వలపెరిగితేనేగాని పెండ్లి మాట తలపెట్టరాదని కొందరి అభిప్రాయం; వయసు రాక పూర్వమే పెళ్ళిజరిగిపోతే, అటుపైని తప్పుచేయ డానికి అట్టేఅవకాశం ఉండదు కనుక, బాల్యవివాహాలే సర్వోత్కృష్టములని కొందరి నమ్మకం.

పెళ్ళివిషయమై శాస్త్రాలు, కర్మలు, లాంఛనాలు ఎవరి కెట్లా ఉన్నా, ముఖ్యోద్దేశంమాత్రం అందరిదీ ఒక్కటే—శరీరసౌఖ్యా లనుభవిస్తూ, సృష్టికి తోడ్పడడం! ఇట్టి ఉద్దేశంతో వ్యక్తిస్వాతంత్ర్యం, సంఘశ్రేయం, రెండూ పొసగేట్లు చేసుకున్న యేర్పాటే పెళ్ళికనుక, మానవసంఘంలోనుండి దానిని కేవలం తరిమివేయడానికి సాధ్యంకాదు. స్త్రీపురుషబాంధవ్యానికి అట్టే నిర్బంధాలులేని 'బోల్షివిస్టు'లలోకూడా పెళ్ళి అనే ఆచారం యింకా నిలచి ఉండడమే యిందుకు గట్టినిదర్శనం!

హిందూధర్మశాస్త్రకారుడు మనువు ఎనిమిదిరకాల పెళ్ళిళ్ళు వర్ణించాడు. ఈ అన్నిరకాలూ ఎప్పుడో ఒకప్పుడు మానవసంఘంలో అవసరపడినవే. పరిస్థితులను బట్టి ఒకొక్కప్పుడు ఒకొక్క సంఘంలో ఒకొక్కరకం ఆచరణలో ఉండేది—ఉంటుంది. ఇప్పుడు కొన్ని నాగరికజాతులలో ఉన్న 'కాంట్రాక్ట్' వివాహాలు, 'కంపానియన్‌షిప్' పెళ్ళిళ్లు మొదలైనవికూడా యీ రకాలలోనే చేర్చవచ్చును. పాశ్చాత్తులకు పరిపాటైన వలపుపెళ్ళిళ్ళన్నీ మనువుచెప్పిన గాంధర్వ వివాహతరగతిలోనే చేరుతవి. నేడు ఎంతో బాగున్న వివాహాచారం రేపు బొత్తిగా సరిపడకపోవడంలో విపరీత మేమీలేదు. పూర్వులు విధించారుకదా అని ఎప్పుడూ ఒకేఆచారాన్నిపట్టుకొని దేవులాడడం బుద్ధిహీనం! సంఘాచారాలలో యితరదేశస్థులకు మనకున్నంత జలగపట్టులేదు; సమయానుకూలంగా సర్దుకుంటారు.

మానవప్రకృతి, నీతి, అనేవి అందరికీ, అన్నియుగాలలోను సమానమే. మూఢత్వం, నాగరికత, మతం, మొదలైనవిమాత్రం దేశదేశానికీ, జాతిజాతికీ భిన్నంగా ఉండవచ్చును. కాబట్టి అన్యదేశాచారాలు మనకెంత విపరీతంగా, వెగటుగా, వెర్రిగా కనబడినా, వాటి యందుకూడా నీతి, నిజాయతి అనేవి ఉంటాయన్న సంగతి మరచిపోకూడదు. అన్నివిధాలా తృప్తికరమైన పెళ్ళిళ్ళు భూలోకంలో ఎక్కడాలేవన్నమాట సత్యమేకాని, యితరదేశాల పెళ్ళిళ్ళలోఉండే మంచిని మాత్రమే అవసరపడునంతవరకు గ్రహించి, హిందువులేల తమ వివాహాచారాలను దిద్దుకోరాదో తెలియదు!

—తాత కృష్ణమూర్తి, బి ఏ., యల్.టి.

## గత సంచికనుగూర్చి 'సరస్వతి' ప్రశంస

"ముఖపత్రముపై విశాఖపట్టణసముద్రతీరదృశ్యము. ఆంధ్రదేశమునందలి ప్రకృతిదృశ్యముల నేర్చి యాంధ్ర మహాజనులకు బరిచయముగలిగింప సంపాదకుల యుద్దేశ్యమును జూపుచున్నది. సంస్కృతము, తెనుఁగు అనక బమ్మెర పోతరాజు "ఆంధ్రవాఙ్మయ విశేషము లన్నిఁటి నేర్చె" ననుట సరసముగనున్నది. "నిను నాస్థానకవీశ్వరుండని" యను పద్యమున పోతనసార్వభౌమత్వము జూపుచో శ్రీ శేషాద్రిరమణకవుల యుత్కృష్టభావసరళి, కబ్బము సలుపు నేర్పును గాననగును. "తెలుఁగుం జదివినదానికి ఫలమేమన" యను పద్యమునందలి యర్థముగూఢము; ఊహాజనకము. "పతనాలయాలు, గాలివిమానాలు"ను చదువదగిన వ్యాసములు. గ్రంథరచనలవలన పాశ్చాత్యకవిపుంగవుల కున్నరాబడియు, రాజ్యాస్థానములయం దాదరణము నాంధ్రకవుల కిప్పుడెక్కడివి? అసలు ప్రజలకును విద్యాపీఠములకే యాదరణలేనాయె. అట్టియెడ పుస్తకరచనలవలన జీవయాత్రగడపుట యింకెంత కష్టము? సర్ హెన్రీగాయిస్‌గారి విచిత్రవృత్తాంతము పనినేర్చుకొనునభిలాష, పట్టుదల, ధైర్యము, శ్రేష్ఠతమగు వస్తువునే చేయుట, యెల్లరకును ఆదర్శప్రాయము. ఆర్థికపుష్టియున్న గ్రంథాలయోద్యమవిషయముల కింకను కొన్ని పుటల నిత్తుమని సంపాదకులు చెప్పుచున్నారు. ఆంధ్ర మహాజను లెల్లరును దోడ్పడినచో నీ యాంధ్రభూమి యింకను బెక్కు విషయములలో, బెక్కు పుటలలో, పుష్టిఁగలిగి వన్నెకెక్కునని యెంచుచున్నాము."

# జెకోస్లావాకియా రాజ్య నిర్మాణము

యుద్ధమునకు పూర్వము ఐరోపాఖండపు పటముపై 'జెకోస్లావాకియా' అను ప్రత్యేక రాజ్యనామము లేదు. సరిగా నేటికి పదునైదువత్సరముల క్రితము 1918 అక్టోబరు 28-వ తేదీని జెకోస్లావాకియా రాజ్యము స్థాపింపబడెను. 54,600 చదరపుమైళ్ళ విస్తీర్ణము గల దేశము. జనాభా 14,300,000 మంది. ప్రేగ్ పట్టణము రాజధాని నగరము దాని జనాభా 677,000 మంది.

ఏర్పడినప్పటి నుండియు నీ రాజ్యము పరరాజ్యముల జోలికి పోవక స్వకీయాభివృద్ధి యందు పూర్తిగ నిమగ్నమై యుండెను. ప్రజలును, ప్రజానాయకులును రాజ్యసౌధమును మంచిపునాదులపై ఏర్పఱచి పెంపొందించుచున్నారు. జాతీయాభివృద్ధికి అడ్డుతగులు దేశమునందలి పార్టీని పాటింపక, శత్రు దేశముల కన్నెత్తి నను గుర్తింపక జెకోస్లావాకియా ప్రజాస్వామికము స్థిరత్వము నందినది. ఈ స్థిరత్వమునకు కారణములు మూడు:— ఒకటి: నాయకులప్రతిభ; రెండు: ప్రజలదేశాభిమానము; మూడు: ఆదేశముయొక్క సహజసంపద. సహజసంపద యందు ఆదేశమునుమించు ప్రపంచమునందలి మఱికొన్ని దేశములు నేడు తమ్ముకనడుపుటకు సరియైన నాయకుడు లేక అటమటించుచున్నవి. మఱికొన్ని దేశములు పాటుపడుప్రజలను, వారిని సక్రమముగ నడుపు నాయకులను గలిగియుండియు సహజసంపద కొఱవడుటచే వెనుబాటుననే క్రుంగుచున్నవి. జెకోస్లావాకియా దేశము సహజసంపదను, పాటుపడుప్రజలను, వారిని నడుపు నాయకులను గలిగి ఏర్పడిన పదునైదువత్సరములలో విశేషాభివృద్ధిని గాంచినది.

మిత్రమండలి వారిచే జెకోస్లావాకియా 1918 లో ప్రత్యేకరాజ్యముగా అంగీకరింపబడినపుడు దాని అధ్యక్షుడు టి. జి. మాసరిక్ అట్లాంటిక్ మహాసముద్రమునకు అవతలయుండెను; దాని ప్రభుత్వకార్యాలయము ప్యారిస్‌నందుండెను; దాని సేనాబలము సైబీరియాలో నుండెను. దానిరాజధానీనగరమగు ప్రేగ్ పట్టణమున అధ్యక్షుడు మాసరిక్ కాలుపెట్టుసరికి అంతకు పూర్వము అచట ప్రభుత్వము చేయుచుండిన ఆస్ట్రియనులు తొలగియుండిరి. ప్రజలకురైలు, పోస్టలు సౌకర్యములులేవు. ఒక ప్రభుత్వవిధానములేదు; సేన లేదు. నేడు జెకోస్లావాకియా దిగుమతులు 110 మిలియనుల పౌనుల వెల గలవి. ఎగుమతులు 130 మిలియనుల పౌనుల వెల గలవి; ఆదేశమున చేయబడిన వస్తువులు నేడు ప్రపంచమునందలి అన్నిదేశములబజారుల యందును చొఱబాఱి యున్నవి. యూరపునందలి మిగుల ఫలవంతములగు దేశములలో నిది యొకటి. పరిశ్రమలతో పాటు వ్యవసాయమును లెస్సగ పెంపొందింపబడుచున్నది. బట్టల నేత, గాజుసామగ్రి, యంత్రములు, పని ముట్లు, కాగితములు, రసాయనికవస్తువులు మొదలగు వానిని చేయుటకు పండ్రెండువేల ఫ్యాక్టరీలు. పంటలలో పప్పుదినుసులు, దుంపలు, ఫలములు ముఖ్యములైనవి. పశుసంపద విశేషమైనది. హాంబర్గ్, స్టెటిన్ హార్బరులలో కొన్నివార్ఫులు ఉపయోగించుకొనుటకును, ఎల్బునదీతీరమున కొంత స్థలము 99 సంవత్సరముల కౌలును ఈదేశము పొందియుండెను. ఎనిమిదివేలమైళ్లు వ్యాపించినరైలుబాటలు. అంతర్జాతీయవిమానపథములు పదునైదును, దేశీయవిమానపథములు ఐదును గలవు. ఇంతకును ఆరాజ్యము మనదేశమునందలి అస్సాంరాష్ట్రమంత విస్తీర్ణముగలది. జనాభావిషయమున బొంబాయి రాష్ట్రముతో సరితూగును. అట్టిరాజ్యము ఏర్పడిన పదునైదు వత్సరములలో అవ్యక్తస్థితినుండి ఇంతటిఅభివృద్ధికివచ్చుట అత్యాశ్చర్యకరమైన విషయములలో నొకటి.

థామస్ మాసరిక్ మొదటి నుండియు ఈ రాజ్యమునకు అధ్యక్షుడు. స్థానికముగనే గాక అంతర్జాతీయముగ కూడ నీత డధ్యక్షుడగుట అతిముఖ్యమైన విషయము. అంతర్జాతీయసంస్థ తనకురూపసిద్ధినిచ్చినదిగావున జెకోస్లావాకియా ఆసంస్థకు యథాశక్తిని తోడ్పడ వలయుననుట ప్రెసిడెంటు మాసరిక్ రాజనీతి.

హిందూదేశీయులకు ఈ పదునైదువత్సరముల జెకోస్లావాకియాచరిత్రయు అవశ్య పఠనీయమైనది. ఆదేశ చరిత్రనుండి వారు నేర్చుకొనవలసినవిషయములు విశేషముగ గలవు. ఆదేశపు జనులు మనదేశమునందు వలెనే వివిధజాతులకు చెందినవారు, వివిధభాషల మాటలాడువారు. మాసరిక్ తన ప్రతిభావిశేషముచే వీరిని ఒక్క త్రాటిమీద నడిపి ఒక్కరాజ్యమునకు అంకితులగునట్లు చేసినాడు. జాతులలో జెక్కులు, స్లావాక్కులు, రుథేనియనులు, జర్మనులు, జ్యూలు, హంగేరియనులు, రష్యనులు, పోలులుగలరు. ప్రాథమికవిద్యావిధానమున ఈ వివిధభాషలకు అర్హప్రాతినిధ్య మిచ్చు విషయమునందు మేసరిక్ బుద్ధికి అనన్యమైనబుద్ధి రాజ్యవిచ్ఛిత్తికిఎడమిచ్చియుండును. రోమను కాథలిక్, గ్రీకు కాథలిక్, ఆర్మీనియను కాథలిక్, ప్రొటెస్టెంటు జ్యూమతములకు మాసరిక్ వైమనస్యము కలుగకుండ వైదగ్ధ్యము ప్రదర్శించెను. జాతిచేగాని, మతముచేగాని, భాషచేగాని ఒకనికి ఆదేశప్రభుత్వమున స్థానము లేకుండనుండదు. అన్నిజాతులవారు, అన్నిమతములవారు, అన్నిభాషలవారు, అన్నివృత్తులవారు సినేటునందును, శాసనసభయందును సభ్యులైయున్నారు.


ఈ రాజ్యనిర్మాణమున ప్రెసిడెంటు మాసరిక్‌నకు కుడిభుజములై యున్నవారు మువ్వురు—బెన్సు, స్టెఫానిక్, రాశిన్. వీరిమువ్వురిలో స్టెఫానిక్ రాజ్యనిర్మాణపు ప్రారంభదినములలో ప్రమాదమునకు లోనై చనిపోయెను రాశిన్ 1925 లో రాజకీయవిద్రోహులచే చంపబడెను. జెకోస్లావాకియా ఈ పదునైదు వత్సరముల చరిత్రను కలుషితమొనర్చిన రాజకీయహత్య ఇదియొక్కటియే. బెన్సునకిప్పుడు ఏబదిరెండు వత్సరములు. విదేశాంగమంత్రియై అతడిప్పటికిని మాసరిక్‌ను సేవించుచున్నాడు.

అసలు మాసరిక్‌నకు జెకోస్లావాకియా రాజ్యనిర్మాణవిషయమై పురి ఎక్కించినది ఈ బెన్సే అని చెప్పుదురు. మాసరిక్ వలె ఈతడును యూనివర్సిటీ ప్రొఫెసరే. వీరి ఇరువురి అధ్యక్షతను 'మాఫియా' అను రహస్య విప్లవోద్యమము ప్రారంభింపబడెను. ఆదినములలో ఈ అధ్యాపకులు తమ ప్రాణములను గుప్పిటిలో నుంచుకొనియే సంచరించుచుండిరి. యుద్ధమునకు పూర్వము మాసరిక్ దేశమునువీడి విదేశసంచారమునకు దొరకొనెను. 'మాఫియా' ఈతనికిని దేశమునకును నడుమ కొక్కెముగా నుండెను. కొంతకాలమునకు బెన్సు కూడ రహస్యముగ దేశాంతరమునకు పోవలసివచ్చెను. బెన్సు అమెరికన్ అధ్యక్షుడు విల్సనతో సంప్రదించియు మాసరిక్ ఫ్రెంచిఅధ్యక్షుడు బ్రియాండుతో సంప్రదించియు తమదేశమునకు యుద్ధానంతరము ప్రత్యేకస్థానమును సంపాదించుకొనిరి. జెకోస్లావాకియారాజ్యము నిర్మింపబడెను. దేశమునందలి మాసరిక్ స్నేహితులు విదేశములందు వీరిరువురు కావించుచున్న కృషినందుకొని యథాకాలమున మెలకువతో పనిచేయుచువచ్చి దేశమాతకు దాస్యవిమోచనము కల్గించుకొనిరి. జెకోస్లావాకియాప్రజల స్వాతంత్ర్యవాంఛను శతాబ్దములుగ అణచిపెట్టియున్న హాప్సుబర్గుల సామ్రాజ్యమంతమయ్యెను.

మాసరిక్‌నకిప్పుడు ఎనుబదియైదువత్సరములు. ప్రెసిడెంటు కాకపూర్వము అతడు ప్రేగ్ విశ్వవిద్యాలయమున వేదాంతశాఖోపాధ్యాయుడు. ఈ అధ్యాపకుడు తనదేశమునకు స్వాతంత్ర్యసంపాదనముగావించి ప్రపంచము ఎఱిగిన జాతీయనిర్మాతలలో ప్రఖ్యాతుడైయున్నాడు. రాజ్యాంగవిషయములను గూర్చి ఈతడు బహుళగ్రంథములు రచియించెను. పుస్తకములలో వ్రాసినంత ఈతడు తనరాజ్య నిర్మాణమున, నిర్వహణమున చేసి చూపెను. డాన్యూబ్ నదికి ఇరుప్రక్కలయందును ఈతనికి శత్రువులుగలరు. అయితే ఈతనికి, ఈతని దేశమునకు ప్రపంచమునందంతటను స్నేహితబృందము విశేషించి ఉన్నది. వృద్ధాప్యము మాసరిక్‌నందు దేశప్రేమను, దేశసేవాభిలాషను డిందుపాటొందింపలేదు. ఇట్లెన్ని విధముల అతిలోకుడైయున్న ఈతని తలిదండ్రులు సామాన్యులు. తండ్రి బండితోలువాడు, తల్లి వంటలక్క. అట్టివారలకుబుట్టి తన బుద్ధిబలముచే ఆత్మదేశము నభ్యుద్ధరించిన ఈ మహనీయుని పవిత్రచరిత్ర పైమాసపు ఆంధ్రభూమిలో నివేదించుకొందును.

—వి. జగన్నాథస్వామి, బి. ఏ.





# ప్రగల్భ

౧

అతఁ డిట కేగుదెంచి హృదయంబు గుబుల్కొన నన్నుఁ బల్కె 'నో
యతివ, భవత్సుఖామృతము నానఁగఁ గోరిన భృంగమేను స
మ్మతి దయ సేయుదే' యనుచు మారిడ కేను దృగంచలంబులన్
జతఁబడు నీరుటెండలఁ బ్రసాదమొసంగితిఁ బోవఁ డాతఁడున్.

౨

అతఁడు మదీయహస్తయుగళాశ్రయుఁడై నిజవక్షమందు నే
కతలనొ వన్నెలన్ వలపుకావ్యము కిమ్మనకుండ వ్రాయ, నే
నతని మనఃప్రదేశమును హస్తముల న్దిగఁద్రోచి 'యేటికీ
నుతిమురపైన మాయల'ని మన్నన జేసితిఁ బోవఁ డాతఁడున్.

౩

అతఁడు శిరీషకోమలముఖాంబుజ మంతకుసంత దాపునన్
జతఁగొన కేలుదమ్ములను చక్కని చెక్కిలి కౌగలించి తా
ధృతమతి ముద్దువెట్టఁజన 'తియ్యని పల్కులు పుల్లచేత లో
పతితుఁడ, చాలు! చాలు!!'నని ప్రౌఢిమ తెల్పితి నేగ నాతఁడున్.

౪

అతఁ డెట కేగునో తెలియ దాతనితోడనె నాదుపాదముల్
మతిజెడిపోయె యేటియుపమార్గముఁ బట్టెనొ నేరనైతి నా
కతకును గాల్లులాగె; తెలికన్నులజార్చితి బాష్పవార్నిధిన్
వితమిదియంచుఁ గన్గొనమి వెఱ్ఱినిగా నతఁ డేగె నాతఁడై.

౫

అతఁ డొకపూవుఁదోట హృదయంబునఁ గూర్చొని పూవుకన్నెలం
జతురతఁ బ్రోవుసేసి సరసంబుల నాడఁదొడంగె నామనం
బతనిపదంబులంబడియె నాతఁడుఁ దోఁబ్రబలపింపసాగె 'నో
యతిసుకుమారి, నీప్రణయ మానఁగసిమ్మ'ని: సిగ్గునొందితిన్.

—హరి రాధాకృష్ణమూర్తి.

# హారీ గార్డాన్ సెల్ఫ్రిడ్జి

[చిన్నతనమున చీపురుపట్టి కొట్టుతుడుచువాడుగా పనిచేసిన యాతడు పెద్దయై ప్రపంచమునందలి నగరములలో ప్రథమగణ్యమైన లండను మహానగరమున రెండవదియగు గణ్యతగల కొట్టుకు స్వాముదారుడైన అద్భుతవృత్తాంతకథనము.]

అమెరికా సంయుక్తరాష్ట్రములయందు నావికశాఖలో ఉద్యోగమును సంపాదింపప్రయత్నపడు ప్రతి పిల్లవాడును డార్ట్‌మూత్‌నందలి నావికశాఖా ప్రవేశపరీక్షకు బోవుటకుముందు అచటి ఒకానొకశాసనసభ్యుని సిఫారుసునందవలసియుండెను. ఏబదివత్సరములకు పూర్వము హారీగార్డాన్ సెల్ఫ్రిడ్జి అను బాలుడు అపురూపమైన అట్టిసిఫారుసు నొకటిపొందెను. నావికశాఖా ప్రవేశ పరీక్షకు వెళ్ళెను. పరీక్షలో జయమునందెను. అనంతరము డాక్టరుచే పరీక్షింపబడుటకు వెడలెను. ఉండవలసిన పొడుగుకంటె పావుఅంగుళము పొట్టిగ నుండుటచే నాబాలుడు నావికశాఖలో ప్రవేశించుటకు అర్హుడుకాడని ఆ డాక్టరు నిర్ణయించెను.

నావికశాఖలో ప్రవేశింపదలచిన బాలుడొకడు నేడు తాను కొద్ది అంగుళములు పొట్టిగనుండుట తెలిసికొనెనేని నేరుగా వ్యాయామప్రవీణుల కడకుపోయి వారు చెప్పినట్లుచేసి అచిరకాలముననే వలసినపొడుగుకు ఎదిగియుండును. ఏబదియేండ్లకు పూర్వము నాగరికత అంతటి అభివృద్ధినందలేదు. అభివృద్ధినందియున్నను సెల్ఫ్రిడ్జి తలిదండ్రులు తమతనయుడట్లు పొడుగగుటకు వలయు ధనవ్యయమునకు ఓర్చలేని పేదవారు. సివిల్ యుద్ధమున సెల్ఫ్రిడ్జి తండ్రి ఉత్తరభాగముపక్షము వహించి పోరెను. ఆతడు సెల్ఫ్రిడ్జిబాల్యముననే చనిపోయెను. ఆతని భార్య-సెల్ఫ్రిడ్జి తల్లి - నిస్సహాయ యగు నిఱుపేదరాలయ్యెను ఆమె స్కాటిష్ జాతికి చెందినది. స్కాటిష్‌జాతిస్త్రీల పలువురివలె విద్యావతి అగుట ఆమె భర్తమరణానంతరము పూర్వపు కాపురస్థలమును విడిచి మిచిగన్ స్టేటునందలి జాక్సనుకు తరలివెళ్ళి అచటి ఒక పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా కుదిరెను. తాను, తన ఏకైకపుత్రుడు ఉసురులు నిలుపుకొనియుండ గలుగుపాటి ధనమును మాత్రమే ఆమె సంపాదింపగలిగియుండెను. అనంతరకాలమున విశేషధనసంపాదకులైన పలువురివలెనే సెల్ఫ్రిడ్జియు బాల్యమున ఒక్క విలాసవస్తువుకూడ ఉపయోగించి ఎఱుగడు.

యుక్తవయస్సురాగా సెల్ఫ్రిడ్జి జాక్సనునందలి పబ్లికుపాఠశాలకు పోయెను. హారీ సెల్ఫ్రిడ్జి మిక్కిలి చిన్నతనముననే అర్జనకు గడంగెను. పదియవయేట వేసవిశలవులయందు ఆతడు బట్టలు కిరాణాసరుకులు అమ్ము దుకాణమున పనివాడుగ చేరెను. తొలుత ఆతని పని చీపురుపట్టి దుకాణమంతయు తుడుచుట. తరువాత ఫైలులు తయారుచేయుట. పిమ్మట అతనిపని బిల్లులు కాషియరు దగ్గరకు కొనిపోవుట, గుమాస్తాదగ్గరకు చిల్లర కొనివచ్చుట, ఇతర విధముల ఉపయోగించుట. వారమునకు ఒకటిన్నర డాలర్ల కూలి-దినమునకు పండ్రెండు అణాలు. సెల్ఫ్రిడ్జి చాల కష్టపడి పనిచేయువాడు. ఒక్కనిముస మూరకుండు వాడుకాడు. అగుటచే సెల్ఫ్రిడ్జి మొదటి వేసవిశలవులు ముగియులోపల పార్సెళ్లు కట్టు పెద్ద ఉద్యోగమునకు మార్చబడెను.

ఆ దుకాణము నందలి పలువురు, ఒడలు దాచికొనకుండ నిర్దిష్టకార్యములను తృప్తికరముగ నిర్వహించుచున్న సెల్ఫ్రిడ్జిని అత్యాదరముతో చూచుచు మంచి మాటలతో పలుకరించువారు. కాని ఒకరిద్దరు శీఘ్రకోపులు ఆతని చిన్నతప్పిదములను కూడ చిఱ్ఱుపూని చీదరించుకొని తిట్టువారు ఈతిట్టుల నాతడు ఇంతవఱకు మఱచిపోలేదు. మంచిమాటలు తనకు ఎన్ను

ఉత్సాహము కలిగించునవో, తిట్లు తన్ను ఎట్లు క్రుంగదీయునవో అతడు ఎల్లవేళల జ్ఞప్తియందుంచుకొని యుండును. ఆ కారణమున తనక్రింద నేడు పని చేయుచున్న వారి యెడ నాతడు మిక్కిలి మెలకువతో వర్తించును. అభినందింపదగు దానికి అభినందింపకుండుట అతడెఱుంగడు. ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసము పొందుటకు అట్టి అభినందనము లవసరమని అతనితలంపు. చిన్నతనమునకూడ సెల్ఫ్రిడ్జి జ్ఞాపకశక్తి అత్యద్భుతమైనదై యుండెను. నేడుకూడ ఆచిన్నదుకాణము అతని మనోనేత్రములకు కనుపట్టుననియు, అందు పనిచేసిన వారును, ఖాతాదారులును కండ్లఎదుట కనుపట్టుదురనియు అతడు చెప్పును. తన నేత్రములు ఒక్కనిముసము మూసికొనుచో వారివారి కంఠధ్వనులు ఇప్పటికికూడ స్పష్టముగ తనకు వినుపించునని అతడు వచించును

పాఠశాలను వీడువఱకును ఏటేట అతడు ఇట్లే వేసవిశలవులయందు ఇట్టి దుకాణములయందు పనిచేయువాడు. అగుటచే బాల్యముననే అతనికి వ్యాపారానుభవము విశేషముగ తెలిసి వచ్చినది. ఒకనాడు సెల్ఫ్రిడ్జికడకు అతనిస్నేహితు డొకడు వచ్చెను. సెల్ఫ్రిడ్జి కంటె అతడు వయస్సున కొంచముపెద్ద. అతడు పిల్లల కొఱకు ఒక పత్రికను సంపాదించుచుండెను. కాని దానిని ఆర్థికముగ లాభదాయకమగునట్లు అతడొనర్పజాలకుండెను. సెల్ఫ్రిడ్జితో నాతడు పత్రికకు వలసినన్ని ప్రకటనలు కొనిరాలేకుండుట చెప్పుకొనెను. అందుమీద గార్డన్ "ప్రకటనలు నేను కొనివత్తును. ప్రకటనలరూపమున నేనుకూర్చిన సొమ్ములో నాకు నూటికి పదిరూపాయిల వంతున కమీషను ఇత్తువా?' అని అడిగెను. సంపాదకమిత్రుడు సమ్మతించెను. సంవత్సరము నిండు లోపల పత్రిక దాని విత్తములో తొలిసారి లాభము చూపెను. వచ్చిన లాభము కొద్దిపాటిదే. అరవైడోల్లర్లు (పండ్రెండు పౌనులు). కాని అది సరిపోయినది: ఆ ఇరువురుమిత్రులును కలిసి ఆ సొమ్ముతో నయగరా జలపాతమునకు యాత్రసాగించి రాగల్గిరి.

కొంతకాలము ఈ దినములలో అతడు స్వయముగ నొక మాసపత్రికను నడపెను. అతడే సంపాదకుడు, అతడే ముద్రాపకుడు, అతడే ప్రకాశకుడు, పత్రికకు ప్రకటనలు కాన్వాసుచేయువాడును అతడే. అన్నిపనులును ఒక్కచేతిమీదనడుపుచు అతఁడాపత్రికను లాభసాటిగ నిర్వహించి తన ప్రజ్ఞాబలమును ప్రదర్శించెను.

సెల్ఫ్రిడ్జికి పదునాలుగు వత్సరములు వచ్చెను. ఒకనాడు అతడు తల్లిని సమీపించి తానింక పాఠశాలను పూర్తిగ వదలివైచి పనిలో ప్రవేశింప నిశ్చయించితినని చెప్పెను. మాతృదేవి అంగీకరింపలేదు. పాఠశాలవిద్యను ముగించి అనంతరము కళాశాలలో ప్రవేశింపవలసినదని ఆమె నిర్బంధించెను. కాని హారీ నిశ్చితార్థమును వీడలేదు. తల్లి అంగీకరింపక తప్పినదికాదు. జాక్సను పట్టణము నందలి ఒక బ్యాంకులో పనికి కుదిరెను. జీతము నెలకు ఇరువదిడోల్లర్లే (నాలుగు పౌనులు). అగుగాక. కలిగిన అనుభవము గొప్పది. 'జమాఖర్చుల రహస్యము, నేను అచ్చటనే నేర్చుకొంటిని' అని గార్డన్ చెప్పును. అచటి కాషియరు మంచివాడు, స్నేహశీలి. బాలుడగు గార్డన్ మంచిపనిచేసినపుడెల్ల అతని మనోభీష్టము నెఱవేర్చుచుండువాడు. ఆదినములలో గార్డన్ మనోభీష్టమేమి? లెడ్జరు (అవర్జా) పోస్టుచేయుట. ఒక నెల అంతయు ఒకతప్పుకూడలేకుండ పనిచేయుచో గార్డన్‌ను లెడ్జరుపోస్టుచేయనిత్తునని ఆ కాషియరు బేరమాడువాడు.

బ్యాంకులో అతడు రెండు సంవత్సరములు పని చేసెను. అనంతరము ఒక ఫ్యాక్టరీలో ఎక్కవుంటు గుమాస్తాగా చేరెను. జీతము కొంచము పెద్దదయినది. కాని భావియభివృద్ధికి అవకాశములు తక్కువగ నున్నట్లు తోచెను.

జీతమువిషయమై అంత పట్టింపులేదు. పనిచేసి భావికాలమున అభివృద్ధికి రాగలుగుటకు అవకాశముండుట ముఖ్యము. కావున పెద్దనగరమునకు పోవుటలెస్స. ఛికాగోపట్టణము నందలి మెసర్సుఫీల్డులీటరు కంపెనీవారితో ఒకమిత్రుడు గార్డన్‌కు పరిచయము కల్గించెను. ఆకంపెనీవారి స్టోరులో ప్రధాన విక్రయవస్తువులు బట్టలు. మైయిలు అర్ధర్ధములకముగ విస్తారమైన బట్టలవర్తకము గావించెడి నాటిశరహములలో ఫీల్డుకంపెనీ ఒకటి.

హారీకి అందు పనిదొరకెను. జీతము వారమునకు పది డాలర్లు (రెండు పౌనులు). చికాగోవంటి పెద్ద పట్టణమున సెల్ఫ్రిడ్జి వంటి బాలుడు కాలము త్రోయుటకు కూడ అది చాలీచాలనిదే. పని స్టోరులో కూర్చుండి స్టాకుసరిచూచుట, స్టాక్ బుక్కులను ఎప్పటికప్పుడు సరియైన స్థితిలోనుంచుట. వ్యాపారమునందలి సర్వవిషయములను ఆకళించుటకు సదవకాశము కలిగెను. తెలివైనవాడగుటచే నాతడాసదవకాశమును జారవిడువలేదు. రెండుసంవత్సరములు జరిగిపోయినవి. సెల్ఫ్రిడ్జి తెలివితేటలు పలువురకు తెలియవచ్చెను. వేరొక పట్టణమున నూతనముగా స్థాపింపబడుచున్న చిల్లర స్టోరు మేనేజరు ఉద్యోగము అతనికి ఈయజూపిరి. జీతము పెద్దది. అయినను దానికి అంగీకరించులోపల తాను ప్రస్తుతము పనిచేయుచున్న కంపెనీ ప్రొప్రయిటరగు ఫీల్డుతో సంప్రదింప నాతడు నిశ్చయించెను.

“నీవు ఇక్కడనే ఉండిపొమ్ము. ఇక్కడనే నీకు భావి అభివృద్ధికలుగును” అని ఫీల్డు తెలివైన ఆసేవకుని వదలలేక చెప్పెను. యజమాని ఇట్లు చెప్పెనంత మాత్రమున హారీకి ఒలికినదేమియు లేదు. ఈ అవకాశమును పురస్కరించుకొని తాను ఈ కంపెనీయందే మఱియొక పెద్ద ఉద్యోగమును సంపాదించుటకు అతడు కృతనిశ్చయుడయ్యెను. “ఇచట నేను పనిచేయుచున్న డిపార్టుమెంటు డిప్యూటీ మేనేజరు వెళ్ళిపోవుచున్నాడు. నా కాపోస్టునిత్తురా?” అని హారీఅడిగెను. ఫీల్డు కొలది నిమిసములు ఆలోచించెను. ‘ఇత్తును’ అని చెప్పెను. అప్పుడు సెల్ఫ్రిడ్జికి కలిగిన ఆనందమునకు అవధిలేకుండెను.

యువకుడగు ఆడిప్యూటీమేనేజరు ఇక ఆఫరమును వదలు ప్రశ్నయే ఉదయింపలేదు. మఱియొక సంవత్సరము జరుగుసరికి అతడు ‘జనరల్ సేల్సుమాన్’గా మార్చబడెను. ఈ కాలముననే ఫీల్డులీటరు అండ్ కో మార్షల్ ఫీల్డు అండ్ కంపెనీగా మారెను. న్యూయార్కునకు పశ్చిమమున ఆవర్తకమునందు ఆస్టోరు అద్వితీయమైనదయ్యెను. దాని నిర్వహణము సక్రమమును, ఆదర్శప్రాయమును అయియుండెను. అందు పనిచేయువారికొఱకైన నియమావళి దేశముల వెంట ప్రఖ్యాతి నార్జించెను. ఆ నియమముల పుస్తకము తొంబది తొమ్మిది పుటలు గలది. అందు పనిచేయువారు తమకు తారసపడు వివిధపరిస్థితులలో ఎట్లు మెలగవలయునో సూటిగ సూచింపబడియుండెను. ఒక నిదర్శనము:

“కాతాదారులపై అనవసరముగ పరుకురుద్దుట వాంఛనీయముకాదని అనుభవముచే ఈ స్టోరులో కనుగొనబడినది. అయితే ఇంతమాత్రమున కాతాదారుల యెడ ఉపేక్షాభావము వహింపవలెననుట మాతలంపు కాదు. వస్తువులమ్ముటకై ఏర్పాటుపబడినవారు కాతాదారులవిషయమున ఉపేక్షవహించుట ఏవ్యాపారమునకైనను గొప్పనష్టమును కలిగించునదియే. కాతాదారుల యెడ ఉపేక్షవహించిన సూచన కంపెనీ పనివారలవద్ద ఏమాత్ర మగుపించినను వారిని వెంటనే పనినుండి తొలగించుటకు అర్హకారణము లభించినట్లుగ భావింపబడునని ఎల్లరు గుర్తింపవలసియున్నది”

ఆదుకాణమునందలి పనివాండ్రు మర్యాదసు మూర్తులును, సౌజన్యమునకు గనులును అయియుండిరి. ఏదైన వస్తువు కొనదలచి వచ్చినవాడు ఆ స్టోరులో ఆ వస్తువు ఎచ్చటదొరుకునని ఎవరినైన అడుగుచో వారు చేయి విసరుటచేగాని, ముఖము ఊపుటచేగాని ఆస్థలమును చూపరాదు. కావలివానిని పిలచి వానితో వారిని వారు కోరుస్థలమునకు కొనిపొమ్మని చెప్పవలయును.

సెల్ఫ్రిడ్జి ఇంకను యువకుడే. ఐనను తన కంపెనీ వ్యాపారాభివృద్ధి కావించుటకు దేశసంచారమునకు కడంగెను. ఒకప్రదేశమునుండి మఱియొకప్రదేశమునకు పోవుచు ప్రముఖులగు కాతాదార్లతో నాతడు సంప్రదించుచుండెను. ఈ ప్రయాణములలో ఆతడొకసారి యొక హోటలునందుండగా న్యూయార్కునందలి ఒకానొక పెద్ద చిల్లరదుకాణపు సచిత్రమగు కేటలాగును చూచుట తటస్థించెను. అందలి కొన్ని విషయములు ఆతని మనస్సునకు బాగుగ పట్టెను. న్యూయార్కునకు పోవలెనని ఆతనికి అభిలాష పొడమెను. ఒకసారి శెలవులలో తనసొంతఖర్చున అతడు న్యూయార్కుపోయెను. న్యూయార్కుమహానగరమున చిల్లర వ్యాపారవిష

యున్నైు ఆత డెన్నియో క్రొత్తసంగతులను నేర్చుకొనెను. తిరిగివచ్చి తాను గ్రహించిన క్రొత్తవిషయములను తన యజమానియగు ఫీల్డు ఎదుటబెట్టి ఆ కంపెనీయందలి చిల్లరవ్యాపారశాఖలో పెద్ద ఉద్యోగియయ్యెను. అప్పటినుండి ఆతడు వెనుబాటు అనునది ఎఱుంగడు. క్రమాభివృద్ధినందెను. మఱి పదునెనిమిది మాసముల యనంతరము ఆత డాకంపెనీలో చిల్లరవ్యాపారశాఖకు అధ్యక్షుడయ్యెను. మఱియొక పదునెనిమిదిమాసములు తిరిగి వచ్చుసరికి ఆతనికి ఆ కంపెనీలో వాటా ఈయబడెను. తరువాతి ఇరువదివత్సరములును వ్యాపారము బహుళమై సెల్ఫ్రిడ్జిని అధికధనవంతునిగా నొనర్చెను. మంచి వయస్సులో ఉన్నను 1903 లో సెల్ఫ్రిడ్జి విశ్రాంతి గొనుటకు నిశ్చయుడయ్యెను. పుస్తకకాలక్షేపము చేయుటకు, వింతవస్తువులు కూర్చుటకు, విశ్రాంతిగొనుటకు——

ఒక్కసంవత్సరము అగుసరికి విశ్రాంతి ఆతనికి దుర్భరమనిపించెను. "వ్యాపారమే విలాసమునుగూర్చును, దానిని దొరయుపాటిక్రీడ మఱియొకటిలేదు" అని ఆతనికి తోచెను. తిరిగి వ్యాపారములో దిగెను. ష్లీసింగర్ అండ్ మేయర్ అను చికాగో కంపెనీ అమ్ముడుపోవుచుండగా దానిని సెల్ఫ్రిడ్జి 1904 లో కొని దానిపేరు గార్డాన్ సెల్ఫ్రిడ్జి అండ్ కో అని మార్చి వ్యాపారము ప్రారంభించెను. క్రొత్త అధ్యక్షుని పరిశీలనమున వ్యాపారము శతగుణితమై కంపెనీ విశేషాభివృద్ధిగాంచెను. ఇది ఇతరకంపెనీవారల కన్నెఱ్ఱను గుఱియయ్యెను. సెల్ఫ్రిడ్జి నెట్టుకొనైన ఈ వ్యాపారమునుండి మరలించుటకు వారు కృతనిశ్చయులైరి. అగుట విశేషమైన లాభమునిచ్చి గార్డాన్ సెల్ఫ్రిడ్జికంపెనీని వారు కొనివైచిరి. ఫలితముగా గార్డాన్ బ్యాంకుఎక్కవుంటు ఎన్నియో రెట్లు పెద్దదయ్యెను.

సెల్ఫ్రిడ్జి పలుసారులు ఇంగ్లండుకు పోయి యుండెను. లండను మహాపట్టణము ఆతని మనసునకు ఎక్కెను. ఆంగ్లావని తిలకనగరములో క్రొత్తదియు, పెద్దదియునగు ఒక షాపుపెట్టుటకు అవకాశము గలదని ఆతడు నిజమారసెను. 1906లో ఆతడు లండనువచ్చెను. పరిస్థితులుపరికించుటకు దొరకొనెను. తన ఉద్దేశమును కొద్దిమందితో చెప్పెను. ఆ కొద్ది మందిలో పలువురు పెదవివిఱచిరి. 'మరియొక స్టోరుపెట్టుటకు లండనునందు అవకాశములేదు. పెట్టుచో అది పురిటిలోనే సందుకొట్టి పోవుటనిశ్చయము' అని వారనిరి.

లండనునగరమునందలి పరిస్థితుల ఆంతర్యమును గూర్చి తాను నేర్చుకొనవలసినది అనంతముగ నున్నమాట నిశ్చయమే. కాని సెల్ఫ్రిడ్జి తన ఉద్దేశమును విడనాడలేదు. రెండుసంవత్సరములు దీర్ఘమైన ఆలోచన సాగించెను. తుదకు పదిలక్షలపౌనుల మూలధనముతో ఆక్స్ఫర్డు వీధియందు క్రొత్తషాపు నెలకొల్పెను. లండను దుకాణపు మందిరముల అన్నిటి లోనికి తనది గట్టిగను, సుందరముగను ఉండవలెనని ఆత డాశించెను. లండనునగరమున మఱియేమందిరమునకు లేని లోతైన పునాదులు-డెబ్బది అడుగులలోతు. అడుగున గోడలు ఇరువదియేడు అడుగుల మందమునను డెను. అగ్నిభయములేకుండునట్లు నేల అంతయు కాంక్రీటు మయము చేయబడెను. ఆమందిరనిర్మాణమున మూడువేలటన్నుల ఉక్కు ఉపయోగింపబడెను.

ఈక్రొత్త దుకాణము 1909 వ సంవత్సరము మార్చి మాసమున 15-వ తేదీని ప్రారంభింపబడెను. నూటముప్పది వివిధశాఖలు. 400,000 పౌనుల విలువగల సరుకు ఆదుకాణమున నిలువ చేయబడెను. ఆదుకాణములో పనిచేయుటకు పదివేలమంది దరఖాస్తులుపంపిరి. అందు ఎన్నుకొనబడిన వారికి-కాతాదారుడు ఒక్కడు కూడ అతృప్తుడై దుకాణమును వీడకుండునట్లు జాగ్రత్త పెట్టవలెనని ఆతడు ఉపదేశించెను. వివిధశాఖల అధ్యక్షులకు ఇట్లు చెప్పెను: "పనివారలకు మీరు చేయగల యంత సాయమును చేయుడు. అపుడు వారు మనకు తాము చేయగలయంతయు నొనర్తురు."

ముప్పదిఏండ్లకు క్రితము ఇంగ్లండునందును, వేల్సునందును బట్టలవర్తకము ఆ దుకాణములలో పనిచేయువారు ద్వేషించుచుండిరి. పనివారల కేర్పఱచిన భోజనశాలలందే వారు భోజనము చేయవలసియుండెను, భోజనము ఉండవలసినంత ఆరోగ్యవ్వముగ నుండును,

రాత్రులయందు ఒక్కొక్క గదిలో పలువురు నిద్రింపవలసియుండెను. జీతము మిక్కిలి తక్కువ. రెక్కలు ముక్కలు అగునట్లు పని. చిన్నచిన్న తప్పిదములకు కూడ జరిమానాలు బహుళముగా యుండెను. ఖాతాదారుడు వచ్చి ఏదైన కొనకుండ వెళ్ళిపోయినచో వస్తువులమ్ముటకు ఏర్పఱుపబడిన పడుచుకు అరక్రౌను వఱకు జరిమానా విధింపబడుచుండెను.

ఈ శోచనీయస్థితి సెల్ఫ్రిడ్జి ప్రవేశముతో విచ్చిపోయెను. "పనివారలను వారు నీకొఱకు పనిచేయుచుండిరనుకొనుటకంటె వారు నీతో పనిచేయుచున్నారనుకొనుట మంచిది. నీవు ఒకరికడ పనిచేయుచుండినచో ఆ యజమాని నిన్నెట్లు చూడవలయునని నీవు తలంతువో నీక్రింద పనిచేయువారలను నీవు అట్లు చూచుట నీవ్యాపారాభివృద్ధికి మంచిపునాది. వ్యాపారము మందగించినచో తప్పు సాధారణముగ యజమానియందే కలదని చెప్పవలసియుండును. నావ్యాపారమునందు నాకే అభిరుచిలేనిచో నాకులేని అభిరుచి నాపనివారలకుండజాలదు." పనివారలు ఇందుచే సెల్ఫ్రిడ్జి అనిన పడిచత్తురు. ఎప్పుడును ఆతడు పనివారలకు దూరమైయుండడు. పనివాళ్ళు నిరభ్యంతరముగ వాతనికడకు పోవచ్చును. ఎట్టి ఎబ్బెట్టును లేక ఆతడు వారలతో సంభాషించును. వ్యాపారాభివృద్ధికి వారు ఇచ్చు సలహాలను తప్పకవినును. విని వివరించి అర్హములగుచో వెంటనే ఆచరణలో బెట్టును. ప్రపంచమున విశేషముగ కోరబడునది న్యాయము ముద్దాయివాదము వినకుండ ఆతడు తనపనివారలలో ఒక్కనికూడ శిక్షింపలేదు.

ఏదైన దుకాణములోనికి ఖాతాదారుడు కొంచము ఆలస్యముగ వెళ్ళుచో ఆతనికి తప్పక అసంతృప్తి కలుగును. దుకాణము మూయబడనున్న సమయమునవచ్చుట తప్పిదమైనట్లు ఖాతాదారుడు గ్రహింపవలసిన రీతిని దుకాణపు పనివారలు ప్రవర్తింతురు. గడియారము మూచి పనిచేయు ఈ పద్ధతిని సెల్ఫ్రిడ్జి తీవ్రముగ నిరసించును. ఆపద్ధతికి ఆతడు వీడ్కోలు చెప్పెననవచ్చును. ఏదైన సొంతపనియున్నచో సేవకుడు ఆసంగతి చెప్పి వెడలిపోవచ్చును. అంతియేగాని దుకాణముననే ఉండి ప్రొద్దుపోవుచున్నదని విసవిసలాడుట సెల్ఫ్రిడ్జి సహింపడు.

తనక్రింద పనిచేయువారందరును క్రమాభివృద్ధి నందవలయునని ఆతని ఆశయము. 'మాకంపెనీయందు ప్రవేశించిన మూడుసంవత్సరములలోపల ఎవడైన యువకుడు ప్రమోషను పొందనిచో అది ఆతని దోషమైన కావలయును, లేదా మాదోషమైన కావలయును'. అని ఆతడు చెప్పును.

బ్రాంచి కార్యస్థానములు గాక ప్రధాన కార్యస్థానమునందలి వివిధశాఖలలో సెల్ఫ్రిడ్జి కంపెనీయందు పనిచేయువారి సంఖ్య 1928 లో ఐదువేలమంది. తన పనివాండ్రు క్రికెట్టు, ఫుట్‌బాల్, హాకీ, టెన్నిసు, నెట్‌బాల్ మొదలగు ఆటల నాడుకొనుటకు వెంబ్లీలో పదునేడు యకరముల ఆటస్థలము నేర్పఱచెను. ప్రత్యేకముగ నాటకశాల, సంగీతశాల కలవు. విదేశయానము గొప్పవిద్యనొసగునని ఆతని నమ్మకము. కావున ఏటేట స్విడ్జర్లాండు, అమెరికా, కెనడా మొదలగు ప్రదేశములకు పనివాండ్రకు యాత్రలు ఏర్పఱుపబడును.

వ్యాపారవిషయమున సెల్ఫ్రిడ్జి ఒడలుదాచక కష్టపడును. కాని ఆఫీసు తలుపులు మూయబడిన తరువాత ఇక ఆనాటికి ఆత డావిషయమై తలపెట్టడు. 'ఆఫీసు పనులు ఇంటికి కొనిపోవుట నాకు గిట్టదు. ఆఫీసులో ఉన్నంతకాలమును ప్రతిఒక్క నిముసమును నేనువ్యాపారమున వెచ్చింతును. వ్యాపారమనునది అద్భుతమైన సాహసకృత్యము-ప్రపంచమున దానికి మించిన వినోదము మఱియొకటిలేదు.' అని ఆతడు చెప్పును.

1909 లో లండనులో దుకాణము పెట్టుసరికి ఆతని వయస్సు ఏబదియొక్కవత్సరములు. అంగడిపెట్టిన క్రొత్తలో మొదటి రెండువారములందును వార్తాపత్రికలలో ప్రకటించుటకు ఆతడు లక్షడాలర్లు వెచ్చపెట్టెను, దినపత్రికలలో పూర్తిపుట ప్రకటనలు. ఆంగ్లదేశస్థులను అసలు అంగడిదారులని పేరు. అట్టివారి దేశమునకుపోయి వారి రాజధానీనగరమున దుకాణము పెట్టుట సాహసకార్యములలోనికెల్ల సాహసకార్యము.

మఱియు అప్పటికి లండనులోని బట్టలదుకాణములు వార్తాపత్రికలలో ప్రకటించుట ఎఱుగవు. కాని క్రొత్తగావచ్చిన సెల్ఫ్రిడ్జి లండనునందలి ప్రతివార్తాపత్రికాపాఠకునకును తన దుకాణమును పరిచయముచేసెను.

సెల్ఫ్రిడ్జి మఱియొకమార్పు కొనివచ్చెను. ఆరోజులలో లండను దుకాణములందు కొందఱు సేవకులు ప్రత్యేకించి—ఏదైన సరుకుకొనకుండువారిని బయటకు పంపివేయుటకు—నియామింపబడుచుండిరి. సెల్ఫ్రిడ్జి తన దుకాణములో ఇట్టి ప్రత్యేకసేవకులను నియమింపలేదు. మీదుమిక్కిలి కొనినను, కొనకున్నను అందఱిని ఆహ్వానింపదొడంగెను. ఎవరైన రావచ్చును. ఎంతసేపైన ఉండవచ్చును. ఏదియైన చూడవచ్చును. కొనితీరవలయునను నిర్బంధములేదు. ఇష్టమైననే కొనవచ్చును. పైగా ఆవచ్చినవారు సేదతీర్చికొనుటకు పడకకుర్చీలు, ప్రమాదములు సంభవించుచో జాగ్రత్తతీసికొనుటకు చిన్న ఆసుపత్రి, ఒక పుస్తకభాండాగారము, విశ్రాంతిమందిరము, ఒకబ్యాంకు, చిన్నతోట.

దుకాణముల గవాక్షముల నలంకరించుటలోగూడ నాతడు క్రొత్తపద్ధతి నవలంబించెను. ఆ దినములలో లండను దుకాణపు గవాక్షములన్నియు ఆ దుకాణమున దొరుకుసరుకుల నమూనాలతో పిక్కటిల్లియుండునవి. సెల్ఫ్రిడ్జి ఈ పద్ధతిని విడనాడెను. ముక్తసరిగ మూడు నాలుగు వస్తువులుమాత్రమే గవాక్షములందుంపబడుచుండెను. మిగిలిన వస్తువులు ప్రదర్శనపు బీరువాలయందు వసారాలో ఉంచబడుచుండెను.

పనివాండ్రవిషయమున ఆతడు కల్పించిన సౌకర్యములనుగూర్చి ఇదివఱకే కొంత చెప్పబడియున్నది. నేడు ప్రపంచప్రఖ్యాతిగాంచిన గ్రంథకర్తయై వ్రాలుచున్న హెచ్. జి. వెల్సు తన జీవితారంభమున నాలుగేండ్లు ఇట్టి స్టోరులలో ఒకదానియందు ఎప్రెంటిస్ గా నుండెను. ఆ రోజులలో తాను భూలోకనరకమనుభవించితినని వెల్సు పండితుడు చెప్పుచున్నాడు. ఈ భూలోకనరకమునకు విముక్తితెచ్చినవాడు సెల్ఫ్రిడ్జి. ఆ రోజులలో అతని వద్ద పండ్రెండువందలమంది పనివాండ్రుండిరి. విపణిమందిరమునకు బయట వారు సుఖముగ జీవించుటకు అనువైన మంచిజీతములు వారి కీయబడుచుండెను. సెల్ఫ్రిడ్జిదుకాణమున ఉద్యోగము సంపాదింప పలువురకు కాంక్షకలిగెను. లండనునందలి ఇతర అంగడివాండ్రు తమపద్ధతులను కొన్నిమార్చుకొనక తప్పినదికాదు. లేనిచో వారిపనివాండ్రు పనిమానుకొని వెడలిపోవజొచ్చిరి.

ఆశ్చర్యములేదు: లండను వర్తకులు కళ్ళుతెఱచిరి. ఈ సెల్ఫ్రిడ్జి ఎవరు? ఇచ్చటికి ఎందుకు వచ్చినాడు? ఎంతకాలము ఉండును? అమెరికాదేశమున చేయబడిన విలాసవస్తువులతో లండనును ముంచెత్తుచు పత్రికలు గోలచేయకుండుటకై ప్రకటనధనరూపమున వానికి లంచమిచ్చుచున్నాడని సెల్ఫ్రిడ్జినిగూర్చి ఆ రోజులలో ఆంగ్లోకాంటినెంటల్ పత్రిక సంపాదకీయవ్యాసము వ్రాసెను.

లండనులో దుకాణముపెట్టుట ఒకఎత్తు. పెట్టి నిలనిలబడుట మఱియొకఎత్తు. నిలబడుటకు లండను ప్రజలను నిరంతరము తన దుకాణమునకు ఆకర్షించుచుండవలయును. ఈ ఆకర్షణవిద్య సెల్ఫ్రిడ్జికి బాగుగా పట్టువడెను. దినపత్రికలలో తన దుకాణమునుగూర్చి ఆతడు ప్రకటించుచునే యుండెను. ఇతర దుకాణదారులు దీనికి ఎంతయు కంటగించుకొనుచుండిరి.

వాయువిమానయానమున కవి ప్రారంభదినములు. వాయువిమానముపై ఇంగ్లీషు ఛానలును అతిక్రమించినవానికి డెయిలీమెయిలుపత్రిక బహుమానము ఏర్పఱచెను. బ్లేరియట్ అనువాడు ఆ బహుమానముపొందిన వార్త సకుటుంబముగ మోటారుప్రయాణము గావించుచు ఒకనాటి మధ్యాహ్నమున సెల్ఫ్రిడ్జి వినెను. వెంటనే ఆతడు డెయిలీమెయిలు కార్యాలయమునకు తంతికొట్టెను: "మీ కార్యాలయమునకు నేను వేయిపౌనుల నిత్తును. బ్లేరియట్ విమానమును మా దుకాణమున ప్రదర్శింపనిండు. ఎల్లరువచ్చి ఉచితముగ చూచిపోవుటకు నేను ఏర్పాటు గావింతును." డెయిలీమెయిలు నిర్వాహకులు దీనికి అంగీకరించిరి. 1909 లో వేసవికాలమున ఒక సోమవారమునాటి యుదయమున ఆ గాలివిమానము సెల్ఫ్రిడ్జిదుకాణమున ప్రదర్శింపబడెను. చూడవచ్చినజనమునకు లెక్కలేదు. ట్రాఫిక్

కంట్రోలుచేయుటకు స్పెషలు పోలీసులు వీథులలో ఏర్పఱుపబడిరి. ఆంగ్లమహారాజ్ఞి వచ్చి వాయువిమానములతోబాటు సెల్ఫ్రిడ్జి దుకాణమునుకూడ ముమ్మారు చుట్టి చూచెను. బ్లేరియాట్ విమానము తరువాత మఱియొక బహుమానమునందిన హాకర్ విమానముకూడ అచట ప్రదర్శింపబడెను.

జార్జిసార్వభౌముని పట్టాభిషేకసమయమున రాజదంపతుల ఊరేగింపుటుత్సవము జరిగెను. అపుడు సెల్ఫ్రిడ్జి జార్జిసార్వభౌముని బంధువులగు డ్యూక్ ఆఫ్ టెక్ యొక్క బిడ్డలనుకొనివచ్చి తన దుకాణపు మేడ ముందరిభాగమున కూర్చుండచేసెను. ఆ కారణమున ఊరేగింపు అచ్చటికివచ్చినపుడు ఆంగ్లసార్వభౌముడు ఆ అమెరికను షాపుదగ్గర శాల్యూట్ చేయవలసినవాడయ్యెను.

తొలిదినములలో దుకాణము విశేషనష్టమునకు గుఱికాకపోలేదు. కాని కాలక్రమమున విశేషలాభప్రదమయ్యెను. పెట్టిన పదియేండ్లలో అనగా 1919-వ సంవత్సరమున అది అమ్మకము విషయమునందు లండను నందలి దుకాణములలో ద్వితీయస్థానము నందెను. ధనముకూడబెట్టుటయే ప్రధానముగ సెల్ఫ్రిడ్జి ఎంచి యుండినచో ఈసరికి ఆతడు జగ మెఱిగిన కోటీశ్వరులలో నొకడై యుండును. ఆతని సంపాదన భోగము ననుగతినందెను, దివ్యభవంతులందు ఉనికి. లెక్కలేనంత మంది నౌకర్లు. తన ముగ్గురు కూతుండ్రకు పెద్దపెద్ద సంబంధములు తెచ్చెను. అల్లుళ్ళకు విశేషధన మిచ్చెను. మోటారుకారులు బాగుగ వాడుకలోనికిరాక పూర్వమే ఆతనికి పెక్కు మోటారుకారు లుండెను. ప్రభుత్వముల సైనిక విధానమునగూడ వాయువిమానములు విలాసవస్తువులుగనుండినప్పుడే ఆతడు విమానయాన మొనర్చువాడు, విమానములపై విదేశయాత్రలు గావించువాడు, వానిని కొనువాడు, దానముచేయువాడు. ఫలముగా 1926లో ఆతడు అప్పుచేయ వలసి వచ్చెను. ఇప్పు డాతడు తన కంపెనీకే పదిలక్షల డాలర్లవఱకు అప్పుపడియున్నాడు.

మఱియొకడైనచో ఈపరిస్థితులలో మిక్కిలి నిరుత్సాహపడును. వర్తకపతి విషయమునకూడ డెబ్బదియైదవ ఏట అప్పుఉండుట విషమమైనదే. కాని సెల్ఫ్రిడ్జి విషయమున ఇది చెల్లదు. ఆతడు ధనమును వ్యయము చేయు దృష్టితోడనెగాని కూడబెట్టు దృష్టితో ఎప్పుడును చూడడు. యుద్ధప్రారంభ దినములలో సెల్ఫ్రిడ్జి అందుకోకి విశేషలాభము రానారంభించెను. భూవసతి సంపాదింప బుద్ధిపొడమెను. రాజభవన మాత్రముతో నాతనికి తృప్తికలుగదు. సముద్రతీరమున హెంగిస్టుబరీ అను అగ్రమునుకొని అందు పెక్కు-యాకరముల తోటలుపెంచుటకు, ప్రత్యేక మొకనాటకశాల నేర్పఱచుటకు, వివిధవృత్తులవారిని అచట నెలకొల్పుటకు ముప్పదిలక్షల పౌనులు వ్యయముకాగల విధానము నాతడు సంకల్పించెను. తన కుటుంబము వివిధప్రదేశములందు విడివడియుండవలసిన అగత్యము కలుగకుండినచో ఆతడు దానిని ఈసరికి నెఱవేర్చియుండును.

ఆతని కుమారుడు గార్డన్ నకిప్పుడు ముప్పదివత్సరములు. కేంబ్రిడ్జి యందలి ట్రినిటీకాలేజీలో పట్టభద్రుడైనాడు. విమానచోదనమున దిట్ట. రూపసి. ఇపు డాతడు తండ్రివ్యాపారమున ప్రవేశించి తండ్రికి చేదోడువాదోడునగుచు సెల్ఫ్రిడ్జిస్ లిమిటెడ్ ను అభివృద్ధి పఱచుచున్నాడు.

నవ్విన ఊళ్ళే పట్టణములగును. లండను నందలి హాస్యవిషయికపత్రికయగు 'పంచి' సెల్ఫ్రిడ్జి లండను నగరమున దుకాణముపెట్టిన క్రొత్తలో ఆతని క్రొత్త విధానములను వెక్కిరించెను. సెల్ఫ్రిడ్జి దుకాణములో వస్తువులమ్ము స్త్రీపురుషులు - వచ్చిన కాతాదారులను చుట్టుముట్టి బహుమతులపై బహుమతులు కురియించునట్లు ప్రదర్శించు ఒకపూర్తిపుట కార్టూనును (వ్యంగ్యచిత్రమును)—'మేము నిన్ను ప్రేమింతుము గావున నిట్లు చేయుచున్నాము'—అను శీర్షికతో ప్రచురించెను. అట్టి సెల్ఫ్రిడ్జి యిపుడు కాబినేటుమంత్రులతో, ప్రభువులతో, కవిపుంగవులతో, సంపాదకమహాశయులతో చెలిమిగలిగి మెలగుచున్నాడు. తనంత తాను అభివృద్ధికివచ్చి వణిక్పుంగవుడైన సెల్ఫ్రిడ్జిచరిత్ర యువకులకు ఆదర్శప్రాయమైనది, మనదేశపు దుకాణదారులు ఇందుండి గ్రహింపదగినవి అనేకవిషయములు గలవు.

# ఇన్స్యూరెన్సు విషయములు

## జీవిత భీమా : కొన్ని పరభిప్రాయములు

రిజర్వులను అధమపక్షము తగ్గించుటకు రెండు మార్గములున్నవి. (1) మరియొట్టిమార్గము చూపక బోనసు (లాభములను) రొక్క-రూపకముగ నిచ్చుట లేక (2) బోనసుపద్ధతినే పాలిసీలనుండి పూర్తిగ తొలగించుట. ఇట్లు తొలగించినయెడల బోనసులకుగాను ప్రత్యేక రిజర్వు లక్కరలేదు. రొక్కపు బోనసు లివ్వటము ప్రజలకు నచ్చలేదు. పాలసీదారులు వీటిని రివర్షనరీ మొత్తములుగ మార్చుకొనగోరెదరు. (రివర్షనరీపద్ధతి అనగా నేమో తెలిసికొనుట మంచిది. ఈపద్ధతిక్రింద లాభములు నూటికింత నిర్ణయించి ఆసొమ్మును భీమా మొత్తముతో చేర్చి క్లెయిముతో యివ్వబడును. వయసు కాను కాను, మరణకాలమున యివ్వవలసిన మొత్తము యొక్క విలువ హెచ్చుచుండును, గాన యీపద్ధతి రివర్షనరీ బోనసునిచ్చుచున్నది. ఈరివర్షనరీబోనసుల రొక్కపువిలువ వయసుతో పెరుగుచున్నది. రొక్కపు విలువ తీసుకొన్నచో, రివర్షనరీ మొత్తముకంటెను చాల తక్కువగనుండును. అందువలన ప్రజలకు 'రివర్షనరీ బోనసు' అన్న యిష్టము.) మరణసంఖ్య వయసుతో పెరుగుటవలన, అదే రొక్కపుబోనసు, వయసు కాను కాను తక్కువరివర్షనరీబోనసు నిచ్చుచున్నది. జార్జికింగు అను గణితశాస్త్రవేత్త (అక్చుయరీ) బోనసులులేని జీవితభీమాలుండి, అపాయభారము వహించుటకు, కొంతఖర్చులనుమాత్రము, ప్రీమియములు వసూలు చేసిన చాల ఉత్తమము." అని తన అభిప్రాయమును సూచించుచున్నాడు. అయినను ప్రజలకు లాభములుగల పాలిసీలపైననో మోజుగలదు. లాభములులేని పాలిసీలు అంతగ ప్రజలకిష్టములేదు. 1903-8 సంllల పాలిసీలను పరిశీలింపగా నూటికి 80 పాలిసీలు లాభములతో కూడిన పద్ధతిక్రిందను, 20 పాలిసీలుమాత్రమే లాభములులేని పద్ధతిక్రిందను, జారీచేయబడినట్లు తేలినది.

### ఆపివేయబడిన పాలిసీలవలన తక్కువలాభము.

రెండవపొరపాటు అభిప్రాయమేనగా, రద్దుకాబడిన పాలిసీలనుండి కంపెనీలు యెక్కువలాభము పొందుచున్నవి. సాధారణము పాలిసీలను యెవరును సరెండరుచేయరు. అనగా కొంత మొత్తమునకు (కట్టిన ప్రీమియములో తక్కువగనే) పాలిసీని కంపెనికి వాపసుచేయుట. ఏదో ఆపత్తుసంభవించినగాని, తొందరవలనగాని పాలిసీలు సరెండరు చేయబడవు. ఈ కారణము వలననైనను పాలిసీని సరెండరుచేయు వ్యక్తిని మనము ఆదరభావముతో చూడవలెను.

అయితే సందేహించువ్యక్తికి, కంపెనీయిచ్చు సరెండరువిలువ న్యాయమైనదని యెట్లునచ్చచెప్పవలెను? రిజర్వుమూల్యముగురించి తెలిపిన అతనికి కొంతగ్రాహ్యము కావచ్చును. మరియొకవిధముగలదు. రాబడు ప్రీమియములనుండియే క్లెయిములివ్వవలెననియు, పిమ్మట నిలువయైన సొమ్మే రిజర్వుఫండు అనియు చెప్పుట. ఉదా: 30 సంll వయసుగలవారు కొందరు, ఒకే మొత్తమునకు మరణకాలమున యిచ్చుపట్టీక్రింద పాలిసీలు తీసుకొనిరని అనుకొందము. 10 సంllలు దాటినవెనుక, ఒక్కొక్క పాలిసీరిజర్వు విలువయెంతయని తెలుసుకొనవలసినయెడల, ఆపది సంllల ప్రీమియము మొత్తమునుండి, ఆపది సంllల కాలము యివ్వబడిన క్లెయిము మొత్తముపోగా, మిగిలినసొమ్మును మొత్తటచేరి మరగణింపగా మిగిలినవారితో భాగింపగా వచ్చునదే ప్రతి పాలిసీయొక్క రిజర్వువిలువ. ఈవిలువమాత్రమే మిక

మింపగోరు పాలిసీదారునికి కంపెనీ యివ్వగల్గునది.

సరెండరువిలువ, రిజర్వువిలువకంటె తక్కువగనే యుండును. రిజర్వుమూల్యము మొత్తమును కంపెనీ యివ్వజాలదు ఇందుకు రెండు కారణములు (1) ఆరోగ్యజీవులు విరమించుటచే కంపెనీకి నష్టముకలుగును. ఆనష్టపరిహారార్థము కొంతత్రోసివేత. (2) ముందటి ఖర్చులకు వచ్చుసహాయము ఆపుదల అయినందున కొంతత్రోసివేత. ఏదైన సదుపాయము కలుగజేసినపుడు, సందేహముకల్గిన, ఆసదుపాయము కంపెనీకి విరుద్ధముగనే తీర్మానింపబడును. ఉదాహరణము: బోనసు యేవిధముగ పొందవచ్చుననుయిష్టము పాలిసీదారునికి వదలబడునది. పరిశీలింపగా రొక్కపువిలువ తీసుకొన్న జీవితము అత్యుత్తమముగను, ముందు కట్టవలసిన ప్రీమియములలో త్రోసివేత కోరిన జీవితములు, ఉత్తమమైనవనియు, రివర్షనరీ బోనసు కోరిన జీవితములు అంతమంచివికావని తెలిసినది. సరెండరులో ఇట్టిసదుపాయములేదు. ఏకష్టముచేనైనను సరెండరుచేయువానికి యిష్టానిష్టములతో పనిలేదు. కాని మరియొక విధముగకూడ ఆలోచింపవలసియున్నది. మరణశయ్యపైనుండు పాలిసీదారుడు, లేక తీవ్రజాడ్యముచే మరణమే శరణనియెంచు నాతడును, పాలిసీని సరెండరు చేయడు. పాలిసీపై ఋణమైనచేయును; లేక బంధుమిత్రాదుల సహాయమునైనకోరును. అనేక తరగతులుగ గల యీజీవితసమూహమునుండి (కొందరికి చక్కని ఆరోగ్యము, కొందరికి సాధారణ ఆరోగ్యము, కొందరికి చెడుఆరోగ్యము) ఆరోగ్యజీవములను తీసివేసినచో, యేమిఫలమో, అనారోగ్యజీవితములను భీమాచేసిన అంతఫలితము కలుగును. మరణసంఖ్య హెచ్చగును. కాబట్టి యీనష్టపరిహారార్థము రిజర్వు విలువనుండి కొంత తీసివేయుట సమంజసము.

రెండవది: పాలిసీలు అమలులోనున్నచో కంపెనీ ఖర్చులకు కొంతసొమ్ము వచ్చును. పాలిసీలు రద్దయినచో, వారు భరించుచువచ్చిన ఖర్చులు సైతము మిగిలినవారిపై పడునుగదా? క్రొత్తవ్యాపారము జరిగిన యీనష్టముపశమించునుకదా అని యడుగవచ్చును. కాని క్రొత్తవ్యాపారమునకు తగినఖర్చు వుండనేవున్నది. కాబట్టి యీనష్టమునకుగాను కొంత త్రోసివేయుట సమంజసము. కంపెనీలు సరెండరుకాబడిన పాలిసీలనుండి యెక్కువలాభము పొందుటలేదు. పాలిసీల సరెండరు విలువ ధారాళముగనగు సూచనలగుపడుచున్నవి. సరెండరువిలువ పూచీచేయబడు కాలముకూడ రావచ్చును.

### జీవితభీమా: దీర్ఘజీవులు.

వారియొక పొరపాటు అభిప్రాయమేమనగా: మంచిజీవితమని నిరూపింపబడిన వ్యక్తికి ప్రత్యేక ఆదరణ చూపబడుటలేదని. నిర్ణయింపబడిన కాలముకంటె యెక్కువకాలముబ్రతికి, పిమ్మట మరణించిన కంపెనీకి నష్టముండదుకదా? అట్టిసమయమున, చాలాకాలము బ్రతుకనివారికంటె వీరికి ప్రత్యేకమైనఉపకారము చేయవలదా? జీవితభీమాసూత్రముల నెరిగినవారెవరును యీప్రకారము తలపరు. ఈ పొరపాటుకు చాలవరకు బోనసు పద్ధతి కారణముగ నుండవచ్చును. తమ మరణముచే కంపెనీకి నష్టమురానీక చాలకాలము బ్రతుకువారు అట్లు బ్రతుకనివారికంటె హెచ్చుగ ద్రవ్యము పొందవలెనన్న, న్యాయముగ యీపద్ధతి అన్నిపాలిసీలకును సంబంధపడునట్లు చేయవలెను. పాలిసీదారుడు ఎంత దీర్ఘకాలముబ్రతికి, యెంత హెచ్చు ప్రీమియములు కట్టిన, అంత హెచ్చుగ మరణకాలమున ద్రవ్యము పొందును. అనగా ప్రతిపాలిసీదారుని వారసులు సాధారణనిధినుండి అతను కట్టిన ప్రీమియములను వడ్డీతో సహా పొందుదురు. కంపెనీపాలిసీదారునికి రక్షణయొసగుటకు బదులు, కంపెనీని పాలిసీదారుడు నష్టమునుండి తొలగించుచున్నాడు. దీనిని "జీవితభీమా" అని యనలేము. కొందరికి లాభములొనగూర్చిన, కొందరికి నష్టము కల్గించినట్లే. ఇన్సూరెన్సు కంపెనీల ప్రధానోద్దేశము, శీఘ్రముగ మరణించువారికి సహాయముచేయుటయే. వారి మరణమువలన కంపెనీలకు కలుగు నష్టము యితరులు భరించుచున్నారు. దీర్ఘజీవులు భీమాసొమ్ముకంటె ఒకవేళ యెక్కువగనే ప్రీమియములు కట్టియుండవచ్చును. అయితేవారు ముందుగ మరణించియుండిన, -ఒకకిస్తీకట్టి మరణించినను సరే- కంపెనీ భీమామొత్తము నిచ్చియుండెడిదే కదాయని విచారిం

చుచో తృప్తిపడగలరు. ఇదేవిధముగ, కొంతప్రీమియమునకు బదులు, జీవితపర్యంతము పాలిసీదారునికి వార్షికపెన్షను యిచ్చుటకొకకంపెనీ ఒప్పుకొన్నదని అనుకొందము. పాలిశీదారుడు చాలకాలము బ్రతుకుచో, అతను కట్టినసొమ్ముకంటె ఎక్కువ ప్రతిఫలమునే పొందుచున్నాడు. అపుడు కంపెనీ పెన్షనులను ఆపివేయదలచిన పాలిశీదారుడు ఒప్పుకొనునా? ముమ్మాటికి ఒప్పుకొనడు. కంపెనీ కంట్రాక్టును జ్ఞాపకమునకు దెచ్చును.

బోనసుపద్ధతి దురభిప్రాయములకు కారణమని యిదివరకు సూచింపబడినది. 'దీర్ఘజీవులు అల్పజీవుల మేలుకుగాను కొంతద్రవ్యమీయవలసినదే. కాని, వారికి భీమామొత్తమేగాక బోనసులేల యివ్వవలెను?' అని కొందరిప్రశ్న. సమాధానమేమనగా అందుకుగాను ప్రీమియములో కొంతవసూలుచేయబడియున్నది అని. బోనసుపద్ధతి 1762 సం॥న ఓల్డు ఎక్విటబుల్ సొసైటీచే స్థాపింపబడినది. ఆకాలమున సరియైన మరణపట్టీలు లేనందున ఎక్కువ ప్రీమియము వసూలుచేయబడుచు వచ్చెను. మూలధనము అత్యధికముగ పెరిగినందున, వాటిని లాభములుగ ఆకంపెనీ పంచిపెట్టెను. అప్పటినుండి లాభయుతమగు పాలిశీలు (విత్ ప్రాఫిట్ పాలిసీస్) అన్న ప్రజలకు సంతోషము. తదుపరి సరియైన మరణపట్టీ దొరకినను, ప్రజానుకూలమునకుగాను, లాభములులేని పాలిశీల ప్రీమియము ఏర్పరచి, లాభములకెంతయని చేర్చుచుండిరి ఈపద్ధతే యిప్పుడును అమలులో నున్నది.

## ప్రత్యేకప్రీమియముల తత్వము.

జీవితభీమా విషయములందు సరియగు అభిప్రాయము పొందవలెనన్న ఒక వ్యక్తిజీవితమును మాత్రమే పరకుగొనక, భీమాచేసిన జనసమూహము నాధారముగ తీసుకొనవలెను. ఈ "సగటు" ఫలితములే ముఖ్యమైనవి. లేనిచో అనేకమగు పొరపాటు అభిప్రాయములు కలుగును. ఒకపాలిశీదారుని కిస్తీ, అతని కుటుంబములో క్షయవుండినందున, 5 సం॥ హెచ్చుగ వసూలు చేయబడినదనుకొందము. అతను ముసలియగువరకు బ్రతికినచో, ప్రత్యేకప్రీమియమును తీసివేయమని కోరును. కాని ప్రత్యేకప్రీమియములు, జనసమూహము ననుసరించి యోచింపవలసియున్నది. మొదట వారివారి ఆరోగ్యముననుసరించి, కంపెనీడాక్టరు సలహాపై హెచ్చు ప్రీమియములు వసూలుచేయబడును. అప్పటినుండి కాలముగడుచుకొలది కొందరు జాడ్యపీడితులగుదురు. కొందరు మరణింపవచ్చును. కొందరు ఏరోగములేక ఆరోగ్యవంతులుగ నుండవచ్చును. 'సగటున' హెచ్చుకాలము బ్రతికినవారు 'సగటు' కాలముకంటె ముందుగ మరణించినవారికి సహాయముచేయవలెను. వైద్యుడే పొరపాటుపడియుండవచ్చును, కాని ఒకవ్యక్తి ఏరోగము లేక దీర్ఘకాలము జీవించినందుననే అతని అభిప్రాయము తప్పనుట పొరపాటు.

క్షయవలన మరణము 50 సం॥ దాటిన తగ్గును కాబట్టి, హెచ్చుప్రీమియమును తగ్గింపవలెనని కొందరు కోరుదురు. కాని ప్రసవమువలె, ఫలానపుడు రోగము నశించునని గట్టిగ చెప్పలేము. రెండవది జీవితపర్యంతము హెచ్చుగ కట్టవలసిన ప్రీమియముకంటె, 50 సం॥ వరకు కట్టవలసిన ప్రీమియము చాల హెచ్చుగనుండును. అందువలన ఆ హెచ్చు ప్రీమియమును కట్టలేరు.

## జీవితభీమా ముఖ్యావసరము.

'జీవితభీమా ముఖ్యావసరముకాదు, అది ఒక ఐశ్వర్యసూచకము' అని మరికొందరు తలచెదరు. లోకులకు జీవితభీమా చాల ముఖ్యావసరము. ఐశ్వర్యమని ఎంచుటకుబదులు అనేకులకు అది అవసరమనియే యనవలసియున్నది. ఏకొలదిమాత్రులకో మాత్రము ఇది ఐశ్వర్యకారణము. లోకములో ఏయిరువురు ఒకతీరుననుండరు. ఒకవిధముగ తలపరు. కాబట్టి వారివారికి తగినట్లు, వెంటవెంటనే ప్రజల సందేహములను తీర్పవలెను. సందేహముకల్గుట కవకాశమివ్వకూడదు. సరియగు సమాధానమిచ్చుటకు, కంపెనీప్రతినిధి యిన్సూరెన్సువిషయములనెల్ల చక్కగ గ్రహించియుండవలెను. పాండిత్యము, సమయోచితప్రవర్తన, ఓపిక, ధైర్యము, మొదలగు సద్గుణములుగల పతినిధి విజయలక్ష్మినిచేపట్టగలడు.

—ఆలూరు రామచంద్రయ్య, బి.ఏ.

# ఆరోగ్యవిజ్ఞానము

## ౯. అరటిపండ్ల ఆహారము విలువ

బాగుగాపండనిస్థితిలో అరటిపండు తినుచో అది పేగులకుపట్టి కడుపునొప్పి కల్గించును. కాని అరముగ్గిన అరటిపండు సులభముగా జీర్ణమగుటయేగాక గొప్ప ఆహారపు విలువనుకూడ కలిగియున్నది. ఆరోగ్యభంగము కలుగకుండ అరటిపండును చిన్నతనమునుండియు తినుటకు అలవాటుచేసికొనవచ్చును. అరటిపండు ఇష్టములేనివారు సకృత్తుగనుందురు. ఆహారపు విలువలోగాని, సులభముగా జీర్ణమై శరీరమున చొఱబారుటలోగాని అరటిపండుతో మఱి ఇతరఫలములు దొరయజాలవనుట నిశ్చయము. ఇంతకును అరటిపండ్లు ఇతరఫలములవెలలతో పోల్చిచూచినపుడు కారుచౌక అనియే చెప్పవలసియున్నది. మెసాచుసెట్సునందలి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ప్రొఫెసర్ యస్. జి. ప్రెస్కాట్ అరటిపండునుగూర్చి ఇట్లు చెప్పుచున్నాడు: 'బాగుగాముగ్గిన అరటిపండులో మానవశరీరమునకు కావలసిన సర్వవిధములైన ఆహారపదార్థములను కలసియున్నవి. క్రొవ్వుపదార్థములు, ప్రొటీనులు కొంచము కొఱవడియున్నమాట సత్యమేగాని అరటిపండ్లు పాలలోకలిపి తీసికొనుచో ఆరెండింటి మేళవింపును సమగ్రమైన ఆహారమును కలిగింపగలను.'

## ౧౦. నారింజపండ్లు : ఆరోగ్యము

ఉత్తమమైన ఫలజాతులలో నారింజపండు ఒకటి. జీర్ణశక్తిని కలిగించి దేహపుష్టిని పెంపొందించి మంచి ఆరోగ్యమును నిలుపుటలో నారింజకు సాటియగు ఫలము వేఱొకటిలేదు. నారింజపండ్లయందు మంచి మధురపదార్థముగలదు. అది జీర్ణకోశమున విశేషకాలము ఉండనక్కఱలేకనే దేహమునందంతటను వ్యాపించగలదు. జీర్ణకోశమునకు విశేషశ్రమ కల్పింపకయే దేహపుష్టికరమైన ఆహారపదార్థమును ప్రసాదించువానిలో నారింజ అత్యుత్తమమైనది. క్రొవ్వుపట్టి విశేషమైన బలుపు పుట్టింపకయే పుష్టిచేయుగుణము నారింజపండ్లలో విశేషముగలదు కావున దీనిని ఎల్లరును నిరభ్యంతరముగ వాడవచ్చును. నారింజపండ్లు చిన్న పిల్లలకు ప్రత్యేకముగా వరణీయమైనవి. ఏమన అందు ఎముకలు, దంతములు మున్నగునవి వర్ధిల్లుటకు వలసిన లోహసంబంధమైన లవణములు విస్తరించియున్నవి. ఎదిగెడు కాలమున పిల్లలకు వారిఎముకలను, దంతములను వర్ధిల్లజేయు ఆహారపదార్థములుగల నారింజపండ్లను విరివిగా ఈయవలెను. కొద్దియో గొప్పయో అన్నిరకముల విటమినులు నారింజపండ్లలో కలవుగాని ముఖ్యముగా సి విటమిను విశేషముగగలదు. సి. విటమిను ఆరోగ్యమును పెంపొందించి స్కర్వీవ్యాధిని నివారించును. గోముగా ఎదుగక మందకొడిగానుండు పిల్లలకు నారింజపండ్లను ఆహారముగా ఇచ్చుచో వారు త్వరత్వరగా కండపట్టి చుఱుకుతనమును కలిగి ఒప్పుదురు. సి. విటమిను శరీరమున విశేషకాలము నిలిచియుండదు. తఱుచు క్రొత్తగా శరీరమునకు సి. విటమిను సరఫరా కావలసియుండుచుండును. వండినచో సి. విటమిను విలుప్తమైపోవును కావున వంటపదార్థములవలన సి. విటమిను శరీరమునకు కలుగజాలదు. పచ్చి ఆహారమును తినియే శరీరమునకు వలయు సి. విటమినును మనము కలిగించుకొనవలసియున్నది. అట్టి పచ్చి ఆహారములలో నారింజపండ్లు మేలైనవి. నారింజపండ్లు మలబద్ధమును తొలగించి ప్రేగులు వానిధర్మము నవి చేయునట్లు చేయగలవు. నారింజపండ్లలో కొంత మృతకపదార్థము కూడగలదు. మలకోశమును శుద్ధముచేయుటకు అది సమర్థమైనది. నారింజపండ్లు రుచికి పుల్లగానున్నను

జీర్ణకోశమున క్షారగుణమునందుచున్నవి. తమ రక్తము నకు క్షారగుణమును పెంపొందించుకొనదలచువారు ముఖ్యముగా ఈపండ్లను తినవలసియుండును. భోజనము నకు భోజనమునకు నడుమ చేకొనదగు పానీయముల లో నారింజపండ్లరసము శ్రేష్ఠమైనది. నారింజరసము ద్రవపదార్థమైనను ఆహారపువిలువగలది. అయితే ఇతర ఆహారపదార్థములవలె ఇది జీర్ణకోశమునకు విశేష పరిశ్రమను కల్పించుటగాని, ఆకలిని మందగింపచేయుట గాని గావింపదు. దినక్రమమున నారింజఫలములను సేవించువారి నేత్రములు తేజమును గ్రక్కును, వారి వదనము ఆకర్షణీయమై యుండును, విశేషపరిశ్రమకు వారు తట్టుకొనజాలియుందురు, ఎల్లవేళలవారు విలాస వంతులై యుందురు. రోగస్థితిలోనున్నవారికిని, తిరిగి ఆరోగ్యమును పొందుచున్నస్థితిలో నున్నవారికిని ఇవి ప్రత్యేకవరణీయములు. నారింజపండ్లు జీర్ణకోశమునకు పనికల్పింపకయే శరీరపుష్టి నొసగి దేహమునందలి జలభాగమును పెంచి మలమూత్రముల విసర్జనమునకు సాయపడి ఆరోగ్యభాగ్యమును కల్గించును.

## ౯. దంతములు : ఆహారము : ఆరోగ్యము

సుప్రసిద్ధదంతవైద్యుడగు డాక్టరు జె. మెన్సీస్ కాంప్‌బెల్ మాట్లాక్‌నందలి న్యూహెల్తు సొసైటీవారి వేసవిపాఠశాలయందు 'దంతములు : ఆహారము : ఆరోగ్యము' ఈమూడును ఎట్లు అన్యోన్యాశ్రితములై ఉన్నవో వివరించుచు ఇట్లు ఉపన్యసించినాడు : "ప్రపంచములోని వివిధదేశములందు ఆహారవిషయికపరిశోధనలవలన దంతములను పరిరక్షించు పదార్థములను కొన్నిటిని ఏర్పాటుచు వీలుకలిగినది. ఫలములు, పచ్చిఆహారము, సమముగవండబడిన ఆహారము, పాలు, వెన్న, గ్రుడ్లు దంతములను అమోఘముగ పరిరక్షించును. ఈ పదార్థములు జీర్ణమైనతరువాత క్షారసంబంధమైన బూడిదను కల్పించును; మాంసము, పప్పుదినుసులు పులుపుసంబంధమైన బూడిదను ఏర్పఱచును. మనశరీరములందు పులుపుపాలు హెచ్చినచో ప్రకృతి మన ఎముకలనుండియు దంతములనుండియు లోహసంబంధములైన లవణములను లాగికొనును. అందుచే ఎముకలు, దంతములు తమఆరోగ్యమును గోలుపోవును. మనము దినదినము తిను ఆహారములో విశేషభాగము దంతములకు అంటుకొను మెత్తదనమును కలిగియున్నది. దినదినము బ్రష్షుతో దంతములు తోముకొనుట అత్యవసరమైయున్నది. శరీరమున కలుగుచుండు మార్పులను నోరు భారమితియంత్రమువలె చూపగలదు. రోగమును శరీరము నిరోధింపగలిగినదో లేక శరీరమే రోగమునకు లోగినదో చెప్పగలుగుటకు దంతముల కంటియుండు చిగుళ్ళస్థితి కూడ ఒక సాధనమని మనము తెలిసికొనుచో దంతముల విలువను మనము సులభముగ ఊహించుకొనవచ్చును."

## ౯. నీరుల్లిపాయలు దీర్ఘాయువునిచ్చును

ఆజన్మము ప్రతిదినము భోజనముతో కలిపి పచ్చి నీరుల్లిపాయలను తినుటకలవడిన ఒకానొకస్త్రీ నూట ఇరువది వత్సరములు జీవించి ఈనడుమ చనిపోయినది. మెక్సికో నగరమునకు ఏడువందల మైళ్ళదూరమునందున్న కోహూలారాష్ట్రమునందలి టోర్రియాన్ నగరమున ఆమె నివసించుచుండెను. ఆమెనామము సీనోరా తోమసగార్జా. చనిపోవువఱకును ఆమె మంచి ఆరోగ్యవంతురాలై యుండెను. తుదివఱకును ఆమె సర్వాంగకములను తృప్తికరముగా వానివిధులను నిర్వర్తించుచుండెను. చనిపోయినఆమెయొక్క చుట్టములు పురపాలకోద్యోగులఎదుట బెట్టిన కాగితములవలన ఆమె 1812 లో టోర్రియాన్ చెంతగల ఒకపల్లెలో జననమునొందినటుల తెలియుచున్నది. ముగ్గురభర్తల క్రమమరణానంతరము ఆమె నాలగవభర్తను చేపట్టినది. అతడు ఇప్పటికిని జీవించియున్నాడు. చనిపోవుదినమువఱకును ఆమెరోజుకు మూడుపూటలయందును ఆహారమును గొనునది. ప్రతిభోజనముతోడను ఆమె పచ్చినీరుల్లిపాయలను విరివిగా తినునది. ఆమె దీర్ఘాయువునకు ఈ నీరుల్లిపాయలు తినుటయే కారణమైయుండునని ఆమె బంధువులు పలువురు చెప్పుచున్నారు. నీరుల్లిపాయల మంచిగుణములనుగూర్చి లోగడ ఆంధ్రభూమిలో ఈ శీర్షికక్రింద వివరించియున్నాము. క్రిమిసంహారకములగుటతోడు నీరుల్లిపాయలు ఆయుర్వృద్ధికరములు కూడ నైయున్నవి.

స్త్రీలు
ఎచ్చట పూజింపబడుదురో అచ్చట దేవతలు క్రీడింతురు.





# మహిళాలోకము

## బర్మాదేశపు స్త్రీలు

[లండనునుండి ప్రచురింపబడు డెయిలీ హెరాల్డు పత్రికలో బర్మాదేశపుస్త్రీ శ్రీమతి మేయూంగుకన్య వ్రాసిన వ్యాసమున కనువాదము]

ప్రపంచమునందలి మఱియేదేశమునందును బర్మాదేశమునందువలె భార్యాభర్తలు అన్యోన్యములగు హక్కులయందు సమానత్వమునందియున్నారని చెప్పుటకు వీలుచాలదు. మాదేశమున వివాహమనిన ప్రతివిషయమునందును భార్యాభర్తలు సమానభాగస్వాములనియే యర్థము. వివాహము మాదృష్టిలో కేవలము సివిల్ కంట్రాక్టు, అన్యోన్యము సమ్మతినంది చేసికొనిన ఏర్పాటు. ఒకస్త్రీయు, ఒకపురుషుడును ఒండొరులను ప్రేమించుకొనుచున్నట్లు తెలిసికొనిగాని; ఒండొరుల కూడికవలన ఆ దర్శకదంపతులు అగుట గ్రహించిగాని వారుభార్యాభర్తలుగ ఒకచోట నివసించుటకు అంగీకరింతురు. అంగీకరించి ప్రత్యేకగృహమును ఏర్పఱచుకొందురు.

ప్రత్యేకగృహమును ఏర్పఱచుకొనుట అనగా బర్మాదేశమున ప్రత్యేకబాధ్యతను వహించుటయే. పూర్వకాలమున బర్మాదేశమున సర్కారువారు పన్నులను విధించుటకు కుటుంబమును ఒకయూనిట్టుగ చేకొనియుండిరి. ప్రత్యేకగృహమును ఏర్పఱచుటయనగా పన్ను ఇచ్చుకొనుటకు మఱియొకయూనిట్టును కల్పించుటయన్నమాట. అగుటచే బర్మాదేశమున వివాహమై ప్రత్యేకముగా గృహమును ఏర్పఱచుటయనగా వ్యక్తిపరముగాను, ప్రభుత్వపరముగాను ఒక ముఖ్యవిషయమగుచున్నది.

బర్మాదేశమున ప్రతివిషయమునందును దంపతులు భాగస్వాములు. వివాహానంతరము భర్త ఆర్జించుదానియందుకాని, పొందువారసత్వమునందుకాని భార్యకు సమానభాగముకలదు. అట్లే వివాహానంతరము భార్య ఆర్జించుదానియందుకాని, పొందు వారసత్వమునందుకాని భర్తకు సమభాగముకలదు. వివాహమునకు పూర్వము వారివారికి ఉండుకున్న ఆస్తి వారివారి సొంతమైయుండును. వివాహితస్త్రీల ఆస్తి, హక్కుచట్టమనునది మీదేశమున ఇప్పుడుగలదు. మాకట్టి చట్టము లేకపోయినను చట్టముకంటె బలవత్తరమైన ఆచారము అట్టి ఆస్తి, హక్కువిషయమై మాకు సకలసౌకర్యములను కలిగించుచున్నది. భార్యాభర్తలలో ఏ ఒక్కరు చేసిన వ్యాపారమైనను ఇరువురిపేరుమీదుగ జరుగవలసినదే. ఒక ఇల్లుకొనుటగాని, ఒక తనఖాదస్తావేజు వ్రాయుటగాని చేయవలసియున్నచో భార్యాభర్తలిరువురును దానిమీద సంతకము చేయవలసియుండును.

ఎట్టి రహస్యములైనను భార్యాభర్తలు ఒకరినుండి ఒకరు దాచుకొనరు. ఈకారణమున ఇల్లుఅనిన ఇల్లాలికి ఎక్కువప్రేమ యుండును. భార్యాభర్తలకు గృహజీవితమున అభిమానము హెచ్చుగనుండును. భార్యగను, మాతగను గృహమున స్త్రీ మగనితో సమానమైన హక్కులను, బాధ్యతలను, గౌరవమును కలిగియుండును. పంటలుచెడి కుటుంబపుటాదాయము తగ్గిపోయినపుడు స్త్రీలు ఆర్థికపుచిక్కు కొంతవఱకు ఎడ

లించుటకై ఏదైన చిన్నవర్తకమును చేయుదురు. అట్టి సమయములందు మాదేశపుస్త్రీలు చిన్నదుకాణములను పెట్టెదురు. లేదా తాము అమ్మదలచిన వస్తువులను తమ పరిచితులకు, స్నేహితులకు విక్రయింతురు. ఎటులైన నేమి అవసరమువచ్చినపుడు కుటుంబపుటాదాయము యొక్క అభివృద్ధికి భర్తతోబాటు తానుకూడ సాయపడుట తనవిధియని బర్మాదేశపుస్త్రీ తలంచును. కావున మగని ఆర్జనయొక్క యథాస్థితి భార్యకు సర్వదా తెలిసియుండును. భార్యాభర్తల స్థితులలోగల ఈ సమానత్వము వారి అన్యోన్యతకు చాలవరకు తోడ్పడుచున్నదని నా అభిప్రాయము. భార్యాభర్తలలో హెచ్చుతక్కువలు లేవు. అనూనతలు లేవు. వ్యాపారము, కష్టము, సుఖము ఆనందము—వీని అన్నిటియందును భార్యాభర్తలు సమానభాగస్వాములు. మాదేశమున దాంపత్యసుఖమునకు ద్రోహముచేయు మతియొక విషయమునుగూర్చి చెప్పవలసియున్నది. బౌద్ధమతస్థుడగు బర్మీయుడు వీలునామావ్రాయుట తన మతమునకు ఎదురుతిరుగుట. తనమరణానంతరము తనఆస్తిని గూర్చిన ఏర్పాటులు గావించుకొనుట కాతనికి హక్కులేదు. వారసత్వవిషయమై ప్రత్యేకచట్టములుగలవు. సొంతముగా ఆస్తిగలభార్య ముందుగా చనిపోవుచో ఆ ఆస్తిఅంతయు భర్తకు సంక్రమించును. భర్తముందుగా చనిపోవుచో అతనిసొంతఆస్తిఅంతయు భార్యకు సంక్రమించును. తల్లిదండ్రుల మరణానంతరము ఆస్తి బిడ్డలకుచేరును. బిడ్డలులేనియెడల వారసులకుచెందును.

దంపతులలో ఎప్పుడును భేదములుండనే ఉండవని నేను చెప్పుటలేదు. భేదములుకలుగుటకలదు. కలుగుట తఱచుమాత్రముకాదు. సాధారణముగ వివాహములు సుఖవంతములై యుండు బర్మాదేశమునుకూడ వివాహస్వర్గమనుటకు వీలులేదు. భార్యాభర్తలు అన్యోన్యము కలహించుచో ఏమిజరుగును? ఒండొరులు సమ్మతించి ఎట్లు వివాహము గావించుకొనిరో అట్లే ఒండొరులు సమ్మతించి విడాకులు ఇచ్చుకొనవచ్చును. భార్యాభర్తలలో ఏఒక్కరి తప్పువలననైన విడాకు అవసరమైనచో తప్పుచేసినవారు తమఆస్తిలో కొంత నష్టపోవలసియుందురు. మాదేశమున విడాకులు విశేషము అవలంబింపబడవు. పైన నేను పేర్కొనిన కారణములవలన మాదేశమున ఎందఱో ఆలుమగలు ఒండొరులను నమ్మి తఱుగని ప్రేమతో, తొలగని అభిమానముతో సంసారసుఖముల నందుచున్నారు. విడాకు పొందుట సులభమేయైనను దానిని పొందుట ప్రజాభిప్రాయమున విపరీతమును, విరుద్ధమును అయియున్నది.

మగవానికంటె తాను లొచ్చుఅను అభిప్రాయము బర్మాస్త్రీకి ఎప్పుడును ఉండదు. మగవానితో సరిసమానమైనదాననను భావము ఆమె కుండుటచే ఆమె జీవితానుభవమున విశేషవిజ్ఞానమును. పొందుటకును నిరభ్యంతరముగ బయటతిరుగుటకును, అవసరమగుచో తనబ్రతుకు తాను బ్రతుకుటకును అవకాశములు గలవు. ఇట్టి అవకాశములుండినవనుటచే బర్మాస్త్రీలు గృహప్రేమనుండి విముక్తులైయుండురనుటకు బొత్తిగా వీలులేదు. ఇచట ఇంగ్లండునందుకంటె మాసంసారములు పెద్దవి. మాఇండ్లయందు దాయాదులు, మేనత్తలు మున్నగు బంధువులుకలసి నివసించుటకలదు. ఇంటిపనులలో చేదోడగు ఇతరస్త్రీలుండుటచే గృహయజమానురాలగు తల్లి గృహేతరకార్యములందు జోక్యముకలిగించుకొని కార్యనిర్వహణదక్షత్వము సంపాదించుటకు చక్కనివీలు కలుగుచున్నది.

స్త్రీపురుషుల సమానత ఒక్క భార్యాభర్తల విషయముననే కాదు. మాదేశమున మగపిల్లలను ఎక్కువగను ఆడపిల్లలను తక్కువగను చూడము. పర్వదినములందు మేమందరము పెగోడాకు వెళ్ళుదుము. స్త్రీలు, బాలికలు ఉత్సవములందు పురుషులు,బాలురు వీరితో సమానముగ పాల్గొందురు.

బర్మాయందు స్త్రీ ప్రత్యేకవ్యక్తి. ఆమె చేయు కృత్యములకు ఆమెయే బాధ్యురాలు. కాబట్టి వివాహమైనతోడనే ఆమె ఒకనికి బానిసకాదు. ఆమె ఆమెయే. మాదేశమున వివాహపుటుంగరములు ధరించు ఆచారములేదు. వివాహపుటుంగరములధారణ వ్యక్తిత్వమునకు లోపమనియు, సమానత్వమునకు కొఱతఅనియు మాతలంపు.

# గ్రంథాలయోద్యమము

## తంజావూరు సరస్వతిమహల్ గ్రంథాలయము

మదరాసు ప్రభుత్వమువారి పుష్కలధనమునకు నోచిపుట్టి, బ్రౌనుదొర మొదలగు మహనీయుల సేవా సౌభాగ్యమునంది పరిపుష్టిని గాంచిన మదరాసు ప్రాచ్య లిఖితపుస్తకభాండాగారమున సంస్కృతము నందు 22,270 తాళపత్ర గ్రంథములుగలవు. ఇన్ని సంస్కృత తాళపత్రగ్రంథములుగల లిఖితపుస్తక గ్రంథాలయము ప్రపంచమునందు మఱియెచ్చటనులేదు. దీనిని ఈ విషయమున మించిన గ్రంథాలయము మనదేశమునందే మఱియొకటిగలదు. దీనికంటె అది వయస్సున మూడు నాలుగుశతాబ్దులు పెద్దది. అందలి సంస్కృత లిఖితపుస్తకముల సంఖ్య 24,432. గ్రంథముల బహుళసంఖ్యయందే గాక వాని అమూల్యతయందును ఈభాండాగారము ప్రపంచమునందలి సంస్కృతలిఖితపుస్తకభాండాగారములకు తలమానికమగుచున్నది. అది కావేరితీరమున తంజాపురమునందు మహారాజ శరభోజి సరస్వతి మహాల్ గ్రంథాలయము అను నామముతో విలసిల్లుచున్నది.

అపూర్వములును అమూల్యములును బహుళములును అగు తాళపత్రగ్రంథములుగల గ్రంథాలయములలో ప్రపంచమున అద్వితీయమైన తంజావూరునందలి మహారాజ శరభోజి సరస్వతిమహాల్ గ్రంథాలయమునకు పదునారవ శతాబ్దియందు తంజావూరు రాజధానిగా చోళదేశమును మహనీయముగ పాలించిన ఆంధ్రనాయకరాజులే సంస్థాపకులని చెప్పవచ్చును. తెలుగులిపియందును, గ్రంథలిపియందును వ్రాయబడియున్న సంస్కృతాంధ్రతాళపత్రగ్రంథములను కూర్చి ఆనాయకరాజు లీగ్రంథాలయమును పెంపొందించిరి. పదునెనిమిదవశతాబ్దిలో మహారాష్ట్రు లీదేశమును జయించిరి. ఆమహారాష్ట్రరాజులు ఈగ్రంథాలయాభివృద్ధి విషయమున శ్రద్ధగానులై క్రొత్తగ్రంథములను చేర్చుచువచ్చిరి. ఆమహారాష్ట్రరాజులలో నొకడగు శరభోజి 1820-30 సంవత్సరములనడుమ కాశీపట్టణమును సందర్శించినపుడు ఈగ్రంథాలయమునకు పెక్కుపుస్తకములను చేర్చెను. శరభోజితరువాత రాజ్యమునకువచ్చిన శివాజి మఱికొన్ని గ్రంథములను చేర్చెను. అప్పటినుంచి నేటివఱకును ఈ గ్రంథాలయమునకు క్రొత్త గ్రంథము లేమియు చేర్పబడలేదని చెప్పవచ్చును.

1868-వ సంవత్సరమున ఇండియాప్రభుత్వమువారు హిందూదేశమునందలి వివిధగ్రంథాలయములందుగల సంస్కృతగ్రంథములకు ప్రతులు వ్రాయించుట మున్నగు విషయములందు శ్రద్ధవహించి సంస్కృతగ్రంథముల కేటలాగు తయారుచేయుటకు దొరకొనిరి. ఇండియా ప్రభుత్వమువారిట్లు దొరకొనుటవలన మదరాసు ప్రభుత్వమువారి దృష్టి ఈ గ్రంథాలయముపై ప్రసరించెను. వివిధవిషయములకు చెందినవి, వివిధభాషలకు చెందినవి అగు పెక్కుగ్రంథము లీ గ్రంథాలయమున నుండుట తెలియవచ్చెను.

ఇండియాప్రభుత్వమువారి ఆదేశానుసారము మదరాసు ప్రభుత్వమువారు తమకళాశాలలో సంస్కృతాధ్యాపకుడుగనున్న పిక్ఫర్డును తంజావూరు వెళ్ళి అచటి గ్రంథములకు కేటలాగు తయారుచేయుటకు నియమించిరి. అతడు రెండుసంవత్సరములు పనిచేసి రోగగ్రస్తుడై 1870 లో మాతృదేశమగు ఇంగ్లండునకు వెడలిపోయెను.

అందుమీద 1871 లో ప్రభుత్వమువారు జిల్లా జడ్జిగానున్న డాక్టరు బర్నెల్‌ను తంజావూరు గ్రంథాలయమునందలి సంస్కృతగ్రంథములకు కేటలాగు తయారుచేయ నియమించిరి. విశేషమైన పరిశ్రమగావించి యాతడు అచటి సంస్కృతగ్రంథముల కేటలాగును తయారుచేసెను. ఆకేటలాగు 1880 ప్రాంతమున లండనులో మూడు సంపుటములుగ ప్రచురింపబడెను.

# "ఆంధ్రభూమి" పుస్తకపీఠము

## ౨౦ తంజావూరు సరస్వతీమహాల్ గ్రంథాలయమునందలి ఆంధ్రగ్రంథవివరణపట్టిక.

ఇట్టిగ్రంథము ఒకటి ప్రచురింపబడుట ఆంధ్రులుచిరకాలమునుండి వాంఛించుచున్నారు. తుదకు ఆంధ్రవిశ్వవిద్యాలయము వారు మాటదక్కించుకొనిరి. తంజావూరు సరస్వతీమహాల్ గ్రంథాలయములోని సంస్కృతగ్రంథములకు వివరణపట్టికను తయారుచేసినవిద్యాసాగర ప్రొఫెసర్ పి. పి. యస్. శాస్త్రిగారే ఈ ఆంధ్రగ్రంథవివరణపట్టికను కూడ తయారుచేసిరి ఈ పట్టికయందు 816 వ్రాతగ్రంథములను గూర్చిన వివరణగలదు. పద్యకావ్యములు, ద్విపదకావ్యములు, శతకములు, దండకములు, యక్షగానములు, నాటకములు, వచనకావ్యములు, శాస్త్రగ్రంథములు. ఇట్లు సారస్వతము నందలి వివిధశాఖలకుచెందిన అమూల్యగ్రంథముల వివరణములతో ఈపట్టిక విలువగలదియై యున్నది. ఇందు ముద్రితగ్రంథములను పేర్కొనునవసరమున వావిళ్ళవారి కేటలాగును, బ్రిటీషుమ్యూజియము వారి తెలుగు అచ్చుపుస్తకములపట్టికను మాత్రమే ఆధారముగ గొంటిమని సంపాదకులు చెప్పుచున్నారు. ఈ విషయమున వీరు ఆంధ్రపత్రికా కార్యాలయమునుండి ప్రచురింపబడిన ఆంధ్రవాఙ్మయసూచికను చూడకుండుట శోచనీయమని చెప్పవలసియున్నది. రఘునాథనాయకుని వాల్మీకిచరిత్రయు, గోపప్రధానుని కృష్ణార్జునసంవాదమును అముద్రితములుగా ఈ పట్టికయందు పేర్కొనబడినవి. వాల్మీకిచరిత్ర చిత్రాడ అముద్రితాంధ్రగ్రంథసర్వస్వము వారిచేతను, కృష్ణార్జునసంవాదము హైదరాబాదు గోల్కొండ పత్రికాకార్యాలయమువారిచేతను ముద్రితములైయున్నవి. సుగ్రీవవిజయమును రచియించిన యతడు 'గుణరుద్రకవి' అని ఈపట్టికయందు చెప్పబడినది. నిరంకుశోపాఖ్యానకర్తయగు కందుకూరి రుద్రకవియే ఈతడు. 'కోవిదస్తవనీయగుణ రుద్రధీరవిరచిత సుగ్రీవవిజయాభిధాన' అని గద్యమునందుండుటచే సంపాదకులు 'కోవిదస్తవనీయ-గుణరుద్రధీర' అని విపరీతముగ విఱచి చదివిరి. వావిళ్ళవారి కేటలాగులో నిరంకుశోపాఖ్యానముగలదు. దానికవి రుద్రకవి అని అందు ప్రస్ఫుటముగగలదు. అయినను ఈ ప్రమాదము కలుగుట శోచనీయమైనదే. గ్రంథవిస్తరభీతిచే ఇంకను పలుప్రమాదములుచూపక విడనాడుచున్నాము. విశ్వవిద్యాలయము వారి విశిష్టపరిశీలనమున ప్రచురింపబడిన గ్రంథమున ఇట్టి ప్రమాదములు దొరలుట ప్రతిష్ఠాకరముగానిది. గ్రంథము రాయలుసైజున 400 పుటలు. వెల రు. 2-0-0. ఆంధ్రవిశ్వవిద్యాలయప్రచురణములలో నిది పదునొకండవది.

## ౨౧. బసవరాజు అప్పారావుగీతములు

బెజవాడ అప్పారావు మెమోరియలు కమిటీ వారిచే ప్రకటితము. నేటిభావకవులలో అప్పారావు చిరప్రతిష్ఠనార్జించినవాడు. ఈతని కవితావస్తువులందు వివిధత్వముగలదు. కవి దేశాటనప్రియుడనుటకును, పుణ్యక్షేత్రసందర్శనోత్సుకుడనుటకును ఈగ్రంథమునందలి పెక్కుఖండకావ్యములు అమోఘనిదర్శనములై యున్నవి. ఈతడు దేశముమఱువని కవియనుటకు గాంధినిగూర్చి వ్రాసినగీతములు దృష్టాంతములు. నోము, స్వరాజ్యలక్ష్మిపెండ్లి, ఆంధ్రవీధి, గోపికాగీతలు మున్నగునవి సారస్వతమున శాశ్వతముగ నిలచియుండగలవని మానమ్మకము. బ్రతికియుండగా ఈకవిని మనము ఆదరింపలేకపోయితిమి. ఆతనిస్మృతిముద్రణముగా ప్రచురింపబడిన ఈగ్రంథమునైన విరివిగావెలకుతీసి ఆలోపము నిపుడైన ఒకభంగి నీగికొన ఆంధ్రమహాజనులు ప్రయత్నింతురుగాక. గ్రంథముద్రణము సుందరముగనున్నది.

క్రౌనుసైజున ౨౦౦ పుటలు. వెల అణాలు ఎనిమిది మాత్రమే. అప్పారావు కవిత్వమును గూర్చి మేము లోగడ ప్రస్తావించియుంటిమి గావున ఇచట విస్తరింప లేము ప్రతులకు: గోవిందరాజు వేంకటరామారావు, గవర్నరుపేట, బెజవాడ అని వ్రాయవలెను.

## ౭౨. సౌందర్యమంజరి

అభినవభావకావ్యము. కవిశేఖర కాళ్ళకూరిగోపాల రాయప్రణీతము. ప్రకాశకులు: విశల్యాడిపోవారు; 4, ఆచారప్పన్ సందు, జార్జిటవును, మదరాసు. 1. సంకల్పము, 2. శక్త్యుపాసన, 3. భాషోపాసన, 4. రసోపాసన, 5, మన్మథోపాసన, 6, కుమారీస్వయంవరము, 7. కృతిసమర్పణము అను ఏడువిభాగములు గలవు. ఈకావ్యమునకు గుణవిశిష్టమైన ఉపోద్ఘాతమును వ్రాయుచు శ్రీదేశోద్ధారక విశ్వదాత నాగేశ్వరరావు పంతులుగారు 'సౌందర్యమంజరి గంభీరమైన భావకావ్యము. విశ్వసౌందర్యధ్వని గుణబద్ధమైన కావ్యము. సౌందర్యమంజరిలో పాదపాదమునందును ధ్వనియుక్తమైన భావభాషారసయోగానందము ప్రతిధ్వనించుచున్నది. గోపాలరావుగారు ప్రాచ్యపాశ్చాత్త్య సంస్కారమును రూపభావదాంపత్యమును దేహాత్మకల్యాణమును బాహ్యభావమంత్రయోగమును శక్తి పరమేశ్వర సంయోగమును ప్రకృతిపురుషవిలాసమును శృంగారానంతయోగరూపమైన సౌందర్యమంజరీకావ్యమునందు సార్థకము చేయుటకు చేసిన సంకల్పోపాసనములు సరసములు. కావ్యరచనయందు వేదాంత మంత్రయోగ శాస్త్రములు కావ్యాలంకారకళాశాస్త్రములు ప్రకృతి శాస్త్రములు మొదలగు శాస్త్రార్థములు రససమ్మేళనమునం బొందిన విధము ప్రశంసనీయము' అని నుడివియున్నారు. సాహిత్యప్రియులు శ్రీవిక్రమదేవవర్మ మహారాజులుంగారు సభాముఖమున ఈకృతిని ప్రతిగ్రహించియుండుట యొకవిశేషము. గ్రంథముద్రణము సుందరముగను, బైండింగు ఆకర్షణీయముగను ఉన్నది ఆంటిక్ కాగితములు. క్రౌనుసైజున 64 పుటలు.

## ౭౩. అమరావతి.

శిల్పకళాసరస్వతికి నాట్యమందిరమై బ్రతికి చెడ్డయాంధ్రుల పూర్వవైభవమును నేటికికూడ ఆంధ్రులకు చాటు బూరగొమ్ము అయియున్న అమరావతీనగరమును వర్ణించు తేటగీతముల శతకము. జాతీయపునరుద్ధరణదీక్షాదినములనదగిన ఈ దినములలో ప్రాక్తనవైభవమును స్మృతికెలయించు ఇట్టి గ్రంథములరచనమును ప్రచురణమును వాంఛనీయమైనది. కావున ఏతద్గ్రంథకర్తలగు శ్రీకర్లపాలెం కుటుంబశాస్త్రి బి. ఏ. గారిని మేము అభినందించుచున్నాము. ఈ గీతపద్యకదంబము పలువురు ఆంధ్రులచే పఠింపబడునని నమ్మెదము. వెల 0-2-0. ప్రతులకు తెనాలియందలి శ్రీ కొమ్మూరి కాశీవిశ్వనాథముగారికి వ్రాయవలయును.

## ౭౪. సహకారిమిత్ర, తెలుగు సంవత్సరాది పండుగ సంచిక. (నెల్లూరు)

తెలుగువారి సహకారవారవార్తాపత్రికయగు సహకారిమిత్ర తెలుగు సంవత్సరాది పండుగకు ప్రత్యేక సంచిక ప్రచురించుట ఎంతయు ప్రస్తుతింపదగి యున్నది. మదరాసు ప్రావిన్షియలు కొ ఆపరేటివ్ బ్యాంకి భవన చిత్రము, సహకారనాయకశేఖరులు శ్రీయుత వేమవరపు రామదాసు పంతులుగారు మున్నగువారి ఛాయాచిత్రములతో సంచిక పరిపుష్టినొంది ఎంతయు ఒప్పిదమై యున్నది. ఆంధ్రసహకారపత్రికల చరిత్ర; జపాన్ దేశ సహకారోద్యమము, సహకారోద్యమము: కొన్నిసూచనలు, బకాయిబాకీవసూళ్ళు, కొన్నిసలహాలు, రష్యాదేశమునందలి సహకారోద్యమము, సహకారసంఘపరిస్థితులు అను విషయగౌరవముగల వ్యాసములతో ఈ సంచిక నిండారియున్నది.

## ౭౫. ఐరావతిపత్రిక ఏడవ వత్సరాది సంచిక.

రంగూను ఆంధ్రులవారపత్రికయగు ఐరావతిపత్రికను 1928-వ సంవత్సరమున స్థాపించి నిర్వహించుచున్న వెలగల వెంకటరెడ్డిగారు రంగూనువీడి స్వదేశమునకు వచ్చుసందర్భమున ఐరావతిపత్రిక చేతులుమారినది. పత్రికను రంగూనునందలి రెడ్డియువజనసంఘమువారు చేకొనిరి. ఫిబ్రవరి 24-వ తేది శనివారమున ప్రచురితమైన ఐరావతిపత్రిక ఏడవసంపుటపు తొలిసంచిక వీరి పరిశీలనముక్రిందనే ప్రచురింపబడి పూర్వమార్జించిన తన

ప్రతిష్ఠకు ఏమాత్రమును కొఱఁతనిరీతిని అలరారుచు న్నది. ఐరావతి పలువత్సరములు మని రంగూనాంధ్రు లను మహనీయముగ సేవించుగాక యనికోరెదము.

## ౧౫-౧౬-౧౭. నూతనవత్సరపంచాంగములు

మదరాసు ఆంధ్రపత్రికా కార్యాలయము వారును, తెనాలినివాసులు శ్రీకొమ్మూరి కాశీ విశ్వనాథము గారును, బెజవాడ ఆంధ్రప్రావిడెంటు కంపెనీ వారును ఆంధ్రభూమియందు నెనరుంచి వారువారు ప్రచురించిన నూతనవత్సరపంచాంగములను అనుగ్రహించిరి. ఇందులకు మేము వారి కెంతయు కృతజ్ఞులము. ఆంధ్రపత్రికా కార్యాలయము వారి పంచాంగము చివుకుల వెంకట రమణశాస్త్రి, కుప్పా విశ్వపతిశాస్త్రిగార్లచే గుణింప బడినది. మాసము మాసమునకు గ్రహస్ఫుటములు చెప్ప బడినవి. ఆంధ్రప్రావిడెంటు కంపెనీ వారు ప్రచురించిన పంచాంగము శ్రీ గొట్టిముక్కల సుందరరామశాస్త్రి సిద్ధాంతి గారిచే గుణింపబడినది. ఇందు విశేష విషయ ములుగలవు. శ్రీ కాశీవిశ్వనాథము గారు ప్రకటించిన పంచాంగమున కాలవివరణము గంటలలో గలదు. తుది రెండు పంచాంగములది జేబునందిముడుచిన్న సైజు.

# క్రొత్త పత్రికలు

## ౧౮. విశాఖపత్రిక

ఆంగ్లాంధ్ర భాషలలో ప్రతిబుధవారము విశాఖపట్ట ణమునుండి ప్రకటింపబడు వారపత్రిక తొలిసంపుటపు తొలిసంచిక భావసంవత్సరాదినాడు (మార్చి 16-వ తేదీని) వెలువడెను. స్వవిషయమున ఇట్లు తెలుపబడెను: "విశాఖపట్టణము భరతఖండమున నే గాక ఖండాంతర మునగూడ దినదినప్రవర్ధమానమగు ప్రాముఖ్యము సము పార్జించుచున్నది. వివిధకక్షులు స్వార్థపరత్వకళంకితము లగుటచేత ఆంధ్రరాష్ట్రనిర్మాణ మింతవఱకు శాఖా చంక్రమణముగనున్నను, తన్నిర్మాణ మెంతయు యవ సరమైయున్నది. విశాఖపత్రిక యిట్టి సమయమున ప్రభ వించినది." విశాఖపట్టణము కొలఁదికాలములో ఆంధ్ర మహానగరము కాగలదు. ఆంధ్రవిశ్వవిద్యాలయ మచట నెలకొనినకారణమున విద్యార్థులకు పలువురకు అది కాపురపుకాణాచి యగుచున్నది. వారివిజ్ఞానము దేశ జుల కందించుటకు 'విశాఖ' చక్కని వాహిక కాగలదు. మా పత్రికాశీర మలంకరించుచున్న తొలి, మలి సంచిక లలో మునిసిపల్ సెల్ఫుగవర్నమెంటును గూర్చియు, గ్రామపునరుద్ధరణమును గూర్చియు మంచి వ్యాసములు గలవు. పలువత్సరములు జీవించి విశాఖపత్రిక ప్రజాసేవ చేయును గాక యనికోరెదము సాలుచందా రూ 4-0-0.

## ౧౯. వైద్యప్రదీపిక

ది హెరిడిటరీ ఆయుర్వేదిక్ డాక్టర్సులీగు పక్ష మున గుంటూరునుండి వెలువడు మాసపత్రిక. ప్రధాన సంపాదకులు ప్రొఫెసర్ డి. రంగాచార్యులు గారు. ఇంకను పలువురు ఆయుర్వేదవిశారదులు పత్రికానిర్వ హణమున శ్రీ ఆచార్యులవారికి తోడ్పడుచున్నారు. వైద్యమునకు విజ్ఞానమునకుతోడు అనుభవము కూడ ప్రధానమైనది. అనుభవవైద్యమున సిద్ధహస్తులగు అను వంశికాయుర్వేదవైద్యుల విజ్ఞానమునకు ఈ వైద్యప్రదీ పిక ప్రదర్శనశాలగానుండగలదు. విమర్శనార్థము మాకు పంపబడిన తొలి సంపుటపు మూడవసంచికలో ఆయు ర్వేదము యొక్క నిజస్థితిని గూర్చి దీవి రంగనాథా చార్యులుగారు వ్రాసిన వ్యాసము చదువదగినది. అను భూతప్రక్రియలు, హితాహితములు బాగున్నవి. వైద్య లోకవార్తలు విజ్ఞానదములు. సాలుచందా రూ. 2-0-0

## ౨౦. తెలుగు ప్రేమప్రచారక్.

ఆంధ్రసత్సంగసంఘపక్షమున వి. రామబ్రహ్మము బి. ఏ. గారిచే ఖ్భీమవరమునుండి ప్రచురింపబడుచున్న మాసపత్రిక. మార్చిమాసమున వెలువడిన మొదటి సంపు టపు ఏడవసంచిక విమర్శనార్థము మాకు పంపబడినది. ఇందు సత్యమగు సత్సంగమువలన కలుగు లాభమేమి? భక్తిమార్గము: తపస్సు; భక్తిస్వభావము; వాస్తవ మగు మతమొక్కటియే; మానవసేవ చేయుటకు ముందింజ వేయుడు అను వ్యాసములుగలవు. చిత్తమునకు సంస్కా రమును, హృదయమునకు ఉత్తేజమును కలిగించు వ్యాస ములతో ఒప్పారుచున్న ఈ పత్రిక ఆంధ్రమహాజనుల ఆదరణకు పాత్రమగుగాక. సాలు చందా రూ. 1 4-0

# సంపాదకీయ సమాలోచన

**స్టార్ ఆఫ్ ఇండియా అస్యూరెన్సు కంపెనీ:-**

ఆంధ్రులయాజమాన్యమున విశేషాభివృద్ధికివచ్చిన వ్యాపారసంస్థలలో స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియలు అండు జనరల్ అస్యూరెన్సుకంపెనీ ఒకటియని నిరాఘాటముగ చెప్పవచ్చును. ఈకంపెనీ మానేజింగు ఏజంట్లు శ్రీయుత యం. యస్. ఆర్. ఏ. గుప్త అనువారు. వీరు వైశ్యులు, యువకులు. వైశ్యులనుటచే వీరి వ్యాపారకౌశల్యమును, యువకులనుటచే వీరి కార్యదీక్షను పోల్చుకొననగును. విద్యాపూర్తియైనతోడనే వీరు ఆంధ్రయువకులు పలువురివలె ఉద్యోగమున్కై అన్వేషింప దొరకొనలేదు. దేశముయొక్క ఆర్థికసంపత్తికి తోడుపడు భీమావ్యాపారముపై దృష్టినిలిపిరి. ఫలముగా 1928-వ సంవత్సరమున స్టార్ ఆఫ్ యిండియా అస్యూరెన్సు కంపెనీ పుట్టువు నొందినది. అప్పటికి గుప్తగారు ఇరువదియెనిమిదేండ్ల యువకులు. ఉత్సాహకార్యశక్తులకు అవధి లేకుండెను. అప్పుడు ఈ కంపెనీలో బీదసాదలకు ఎల్లరకు అందుబాటునుండు ప్రావిడెంటుభీమావ్యాపారమే చేయబడుచుండెను. 1933-న సంవత్సరము జనవరి మాసమున జీవితభీమావ్యాపారము కూడ ప్రారంభింపబడెను. దేశము ఆర్థికమాంద్యమను భల్లూకపు పిడికిటిలో కిటకిటమనుచున్న ఆసంవత్సరమున పదునారులక్షల రూపాయలకు ప్రొపోజల్సు సంగ్రహింపగలిగిరనినచో ప్రజాలోకమున ఈసంస్థయందును, దీని నిర్వాహకులయందును ఎంతటి నమ్మకము, అభిమానముగలదో సువ్యక్తమగును. సంగ్రహింపబడిన ప్రొపోజల్సునందు సుమారు నాలుగులక్షలరూపాయల విలువగల ప్రొపోజల్సు అంగీకరింపబడినవి. అందు సుమారు పదునొకండులక్షల రూపాయిల విలువగలవి పోలసీలై పట్టాలనుపొందినవి. ఆర్థికమాంద్యపు వీరవిహారమునకు ఉక్కిరిబిక్కిరి యగుచున్నకాలమున ఒక్కసంవత్సరములో సుమారు పదునొకండులక్షల రూపాయిల విలువగల పోలసీలను కూర్పగలుగుట కంపెనీ నిజముగా గర్వింపదగిన విషయము. భారతభీమావ్యాపారమున నిది యొక గొప్పవిషయమని చెప్పవచ్చును. ఈ కంపెనీయొక్క ఇట్టి విశేషాభివృద్ధికి ప్రధానకారణము శ్రీగుప్తగారి వ్యాపారనైపుణ్యమును, విశాలహృదయమునని మాతలంపు. ఈ సంచికయందు వేఱొకతావున కీర్తింపబడిన వణిక్పుంగవుడు గార్డాన్ సెల్ఫ్రిడ్జి తనపనివారలకు సౌకర్యములుకూర్ప శ్రద్ధాళువైయుండినరీతినే శ్రీగుప్తగారును తమ కార్యాలయోద్యోగుల ఉపయోగార్థము ప్రత్యేకమొక క్లబ్బును స్థాపించి నిర్వహించుచున్నారు. తమ కంపెనీ యేజంట్లయెడ వీరు కనుపఱచు సౌజన్యము, వారికష్టసుఖములందు వీరికిగల సానుభూతి వెల్లడిలోనికివచ్చియేయున్నవి. ప్రారంభముననే ఇంతటి విశేషవ్యాపారమునుగూర్చి కంపెనీ భావియభివృద్ధికి మంచి పునాదివైచిన శ్రీగుప్తగారి యాజమాన్యమున 'స్టార్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రియల్ అండ్ జనరలు అస్యూరెన్సు

కంపెనీ' హుటాహుటి నడలతో అభివృద్ధినంది ఆంధ్రులు చూచుకొని సంతోషింపగల పెద్ద సంస్థలలో నొకటియై వెలయుగలదని విశ్వసించుచున్నాము.

ఆర్య బాలసమాజము: పెదపాలెము:—

తెనాలి తాలూకా పెదపాలెమునందలి ఆర్యబాలసమాజమువారి ఇరువదియెనిమిది సంవత్సరములచరిత్ర - ౭ వేదిక మాకార్యాలయమునకు పంపబడినది. గ్రంథాలయోద్యమము తలయెత్తని దినములలో 4-7-1905 లో శ్రీయుత పుతుంబాక సీతారామయ్యగారిచే ప్రారంభింపబడి వాగ్వర్ధినీసభలు, భజనలు, పురాణపఠనము, ఉపన్యాసములు, పత్రికాపఠనము, రాత్రిపాఠశాల, గ్రంథాలయము మున్నగువానిచే గ్రామవాసులను సేవింపుచు ఆర్యబాలసమాజము విజ్ఞానవ్యాప్తికి తోడ్పడుచున్నది. ఆంధ్రదేశమునందలి ప్రతియొక్క గ్రామమున ఇట్టిసమాజ మొకటియుండినచో దేశమున మూగియున్న విజ్ఞానము విచ్చిపోగలదు. ఈ సమాజమునకు ప్రాణమనదగిన శ్రీయుత పుతుంబాక సీతారామయ్యగారు దేశీయుల కృతజ్ఞతకు పాత్రులు కాదగినవారు

సేవాశ్రమము: పెదపాలెము:—

'గ్రామపునర్నిర్మాణము, గ్రామపునర్నిర్మాణము' అను కేకలేగాని దానికి తగునైన ఆచరణసాధ్యమైన విధానమును ఉపదేశించువారు లేకున్నారు. పెదపాలెమునందలి పుతుంబాక శ్రీకృష్ణయ్యగారు మొదలగు యువకులుకూడి నడుపుచున్న సేవాశ్రమముయొక్క కార్యవిధానమును గమనించితిమేని గ్రామపునర్నిర్మాణము నడుప వలసిన మార్గములు సువ్యక్తమగును. స్వదేశవస్తువిక్రయశాల, వ్యవసాయశాఖ, విద్యాలయము, సేవాదళము, గ్రంథాలయము, మున్నగువానిని ప్రసాదించి సేవాశ్రమము వారు పెదపాలెముయొక్క వాససౌకర్యమును పెంచుచున్నారు. ఇట్టిసంస్థల ఉనికి పెదపాలెమును ఆదర్శగ్రామముగ నొనర్చుచున్నది.

యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్సుకంపెనీ:

భీమావిషయిక సారస్వతసృష్టి:—

మదరాసురాష్ట్రమునందలి భీమాకంపెనీలలో వయస్సుచేతను, వ్యాపారము చేతను పెద్దదైన వానిలో యునైటెడ్ ఇండియా లైఫ్ అస్యూరెన్సుకంపెనీ ఒకటి ఆంధ్రభీష్మ న్యాపతి సుబ్బారావుపంతులు, ఆంధ్రకేసరి టంగుటూరిప్రకాశముపంతులు మొదలగు ఆంధ్రమహాశయుల సేవాసౌభాగ్యము ఈకంపెనీపొందియున్నదనుటచే దీని ప్రతిష్టయందు ఆంధ్రులుకూడ భాగస్వాములైయున్నారనుట తెలిసికొనవచ్చును. చిరప్రతిష్ఠితమగు ఈకంపెనీ ఇపుడు భీమావిషయికసారస్వతసృష్టికి దోహదమీయ సంకల్పించుట సముచితయగనున్నది భారతదేశమున భీమావిషయికసారస్వతము విశేషముగ లేదు. ఉన్నకొద్దిపాటి సారస్వతమును ఆంగ్లమున గలదు. దేశభాషలలో అది లేనేలేదని చెప్పవచ్చును. తెలుగున భీమాసారస్వతమును పెంపొందింప 'ఆంధ్రభూమి' యందు మాసమునమాసము కొన్ని పుటలను ప్రత్యేకించుచున్నాము. యథోచితములగు వ్యాసములు సంపాదించుట చాలకష్టముగనున్నది. భీమావిషయములను ఆంగ్లమున వ్రాయునంత సులువుగ తెలుగున వ్రాయుటకు వీలులేదు. పారిభాషికపదములు లేవు. తెనుగునందును, ఆంగ్లమునందును సమానమైన పాండిత్యముగలిగి భీమావ్యాపారానుభవము గల

వారు పూనుకొనుచో ఈవిషమస్థితి కొంత తొలగునని చెప్పవచ్చును. విజయలక్ష్మి జనరల్ అస్యూరెన్సుకంపెనీ మేనేజింగు డైరక్టరులును, ఆంగ్లాంధ్రభాషా కోవిదులును అగు శ్రీయుత దరిశి చెంచయ్యగారు లోగడ 'వాసవి' పత్రికలో ఇన్‌సూరెన్సును గూర్చి కొన్ని చక్కని వ్యాసములు సులభార్థబోధకములైనవి ఆంధ్రమున వ్రాసి యున్నారు. ఇపుడు వారికి అట్టివ్యాసరచనావ్యాసంగమునకు బొత్తిగా తీరకచాలకున్నదని మాతో చెప్పియున్నారు భీమావ్యాపారమున నున్నవారికి తీరికయుండనిమాట నిజమే. ఇతరులు వ్రాసిన వ్యాసములలో అనుభవవిజ్ఞానము మేళవింపునొందదు. ఇట్టి స్థితిలో - ఆంగ్లమునవేయగుగాక - యునైటెడ్ ఇండియా ఇన్‌సూరెన్సు కంపెనీవారు భీమావిషయికసారస్వతసృష్టికి దోహదముచేయుచు భీమావిషయక వ్యాసములకు ఏటేట బహుమానమునీయ నిశ్చయించినది యెంతయు శ్లాఘాపాత్రముగనున్నది. విద్య, ఉత్సాహము భీమావ్యాపారానుభవముగల ఆంధ్రయువతులును ఆంధ్ర యువకులును మదరాసు నందలి యునైటెడ్ ఇండియాలైఫ్ ఇన్సూరెన్సు కార్యాలయము వారికి వ్రాసి ఈ వ్యాసరచనయందలి నియమములను తెలిసికొని అందు పాల్గొందురుగాక అనికోరెదము. బహుమానముపొందిన ఈ వ్యాసములను వివిధదేశభాషలలోనికి అనువదించుటవలన వానియందు భీమావిషయికసారస్వతము పుష్టినొందును.

ఆంధ్రఇన్సూరెన్సుకంపెనీస్వగృహప్రవేశం:


భావసంవత్సరప్రభావము ఆంధ్రులకు శుభప్రదముగనుండు సూచనలగుపడుచున్నవి. భావసంవత్సరాదినాడు ఆంధ్రునిఆంగ్ల దినపత్రికయగు స్వరాజ్యపత్రిక మదరాసునందు స్వగృహమును సంపాదించుకొని అందు ప్రవేశించినది. అనంతరము ఆంధ్ర మహాశయులగు సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారు మదరాసురాష్ట్రపు లామెంబరుగ నియమింపబడిన శుభవర్తమానము వింటిమి. పిమ్మట ఉన్నతోద్యోగభాగ్యము నందిన నేటి ఆంధ్రపుత్రులలో నొకరగు శ్రీ శొంఠి రామమూర్తిగారి సోదరులగు కామేశ్వరపంతులుగారికి కలప పరిశోధనకై వైస్రాయి బహుమానము ఒసంగబడిన వార్త వినవచ్చినది శుభము వెంటశుభము. ఆంధ్రుని వ్యాపారనైపుణ్యమునకు అమోఘనిదర్శనమైయున్న ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ స్వగృహమున ప్రవేశించినదనుశుభవార్త. ఆంధ్రుని వ్యాపారచరిత్ర ఆంధ్ర ఇన్సూరెన్సుకంపెనీ స్వగృహమున ప్రవేశించిన మార్చి 30-వ తేది ఒక ముఖ్యమైన తేదీకాగలదు ప్రారంభింపబడి పట్టుమని పది యేండ్లయినను కాక పూర్వమే స్వగృహమును సంపాదించుకొనిన భీమా కంపెనీలు హిందూదేశమున మిక్కిలి తక్కువగాగలవు. అటిచో తొమ్మిదేండ్లవయస్సుగల ఆంధ్ర ఇన్సూరెన్సుకంపెనీ స్వగృహమును సంపాదించుకొనినదనుట దాని కార్యనిర్వాహకుల ప్రజ్ఞకు, ప్రతిభకు మానదండము కాగలదు.

దాగుడుమూతల పజుల్ సమాధానము

1. వారణాసి. 2. నాగరము. 3 అభిమన్యుడు. 4. చిలుక. 5. వరూధిని. 6. త్రయోదశి. 7. నన్నయ. 8. గౌతముడు. 9. వల్లభాయి. 10. పరమాన్నము.

పోటీచేసిన పలువురిలో ఈ క్రింది ముగ్గురే సరియైన సమాధానము పంపిరి. నిర్ణీతబహుమానము వారికి పంచిపెట్టబడును.

1. వెలువోలు సీతారామయ్యచౌదరిగారు, అమృతలూరు.
2. దామరాజు సుబ్బారావుగారు, మునిపల్లె.
3. టి. యస్. రాములుగారు, బి.ఏ., పూనా.



## ఫిబ్రవరి, ౧౯౩౪

౨౦:—బొబ్బిలిరాజాగారి 34-వ వర్ధంత్యుత్సవము.

౨౩:—వేలూరు. జబ్బుగానుంట పూచీకత్తునిచ్చి అయ్యదేవర కాళేశ్వరరావుగారు విడుదలైరి.

౨౫:—విశాఖపట్టణము.. బి.ఏ.—బి.యస్. సి ప్యాస్ కోర్సులను పెట్టుటకు ఆంధ్రసినేటు తీర్మానము.

## మార్చి, ౧౯౩౪

౧:—నెల్లూరు. వ్యవసాయికపరిశ్రామిక వస్తుప్రదర్శనము.

౪:—విశాఖపట్టణము. స్వదేశవస్తుప్రదర్శనము మహర్షి బులుసు సాంబమూర్తిగారు తెఱచిరి.

౬:—శ్రీబొబ్బిలి రాజాగారు మరి మూడేండ్లు ఆంధ్ర విశ్వవిద్యాలయముయొక్క ప్రోఛాన్సెలరుగ నామినేటు చేయబడిరి.

౧౦:—నెల్లూరు. దివానుబహదరు జె. వెంకటనారాయణనాయుడుగారు వెంకటగిరి దివానుపదవికి రాజీనామానిచ్చినపిమ్మట దివానుగా నియమింపబడిన శ్రీయుత ఎస్. శేషగిరిరావు నాయుడుగారు రాజీనామానిచ్చిరి.

౧౧:—నెల్లూరు. తిక్కన జయంతి సందర్భమున డాక్టర్ కే. యన్. కేసరిగారు శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారిని వేయిన్నూటపదార్లతో సన్మానించిరి

౧౩:—మదరాసు. తాలూకా బోర్డుల రద్దుబిల్లును మద్రాసు గవర్నరుగారు ఆమోదించిరి.

౧౪:—నూజవీడు. చెఱుకువాడ వెంకటనరసింహం, కేతవరపు లక్ష్మీనరసింహారావుగార్లకు చెరినాలుగు నెలలు శిక్ష.

౧౫:—ఢిల్లీ. శొంఠి కామేశంగారు బి. ఇ. ఎం. ఇ. ఐ. ఎం. ఇ. డేరడూను అడవిశాఖ పరిశోధనాలయమున కలప సంరక్షణశాఖ ఉద్యోగిగనున్నవారికి 1932-33 సంవత్సరపు వైస్‌రాయి బహుమతి ఈయబడెను.

:—మదరాసు. స్వరాజ్య పత్రికా నూతన గృహప్రవేశము.

౧౬:—నాగపూరు. ఆంధ్రులు శ్రీ. కె. ఎస్. నాయుడుగారు మధ్యరాష్ట్రమున మంత్రులయిరి.

౧౮:—విశాఖపట్టణము. రావు సాహేబు జయంతి రామమూర్తి పంతులుగారు మరణించిరి.


౧౯:—మదరాసు. సర్ కూర్మా వెంకటరెడ్డి నాయుడుగారు లా మెంబరుగ నియమింపబడిరి.

౨౦:—ఆంధ్రవిశ్వవిద్యాలయములో భౌతిక శాస్త్ర పండితులుగానున్న శ్రీయుత డాక్టరు ఇచ్ఛాపురపు రామకృష్ణారావుగారు ఎం. ఎ; పి. హెచ్. డి. లండన్ విశ్వవిద్యాలయము వారిచే డి. ఎస్. సి. డిగ్రీని నూతనముగా బడసిరి.

౨౧:—మదరాసు. శాసనసభలో పి. వి. కృష్ణయ్యచౌదరిగారు ఓడరేవును రేవుపట్టణముగ నిర్ణయింప కోరిరిగాని ప్రభుత్వము సమ్మతింపలేదు.

౨౨:—బొంబాయి. డాక్టరు భోగరాజు పట్టాభిసీతారామయ్యగారిపై తేబడిన కేసు బందరు మేజస్ట్రేటుకోర్టులో విచారణజరుగుచుండగా పట్టాభిసీతారామయ్యగారిచ్చిన స్టేటుమెంటును ప్రకటించినందులకు బొంబాయిక్రానికలు ముద్రాపకునకు 9 నెలల కఠినశిక్ష 2000 జుర్మానా విధింపబడి యుండెను. అపీలులో హైకోర్టువారు 9 నెలల కఠినశిక్షను ఒకనెల విడి ఖయిదుగా మార్చిరి.

# పుస్తక పజిల్. పోటీబహుమానము —రూ. 10—



ఇందు 16 బొమ్మలును, కొన్ని పుస్తకముల పేర్లును కలవు. ఏబొమ్మకు ఏ పేరు వర్తించునో కనిపెట్టి, కౌపనులో వ్రాయవలెను. ఉదాహరణము: **11. శాకుంతల.** కౌపను కత్తిరించి **20-4 34** తేదీలోపుని **2** అణాల తపాబిళ్ళలతో ఆంధ్రభూమికి పంపవలెను. సరియైన సమాధానములు సంపాదకుని వద్ద ఒకసీలు కవరులో ఉంచబడినవి. పై మాసపు సంచికలో అవి ప్రచురింపబడును. వాటితో సరిపోవునట్లు పంపిన వారికి **10...రు.** బహుమాన మీయబడును. షరా:—సమాధానములు యీ అచ్చు కౌపన్ల మీదనే వ్రాయవలెను. దిద్దుబాట్లు, కొట్టివేతలు పనికిరావు. ఒక్కొక్కరు ఎన్ని కౌపన్లయినను పంపవచ్చును. ఒక్కొక్క అచ్చు కౌపనుకు ప్రవేశరుసుము **2** అణాలు. అదనపు కౌపనులు వ్రాతవి పంపు నప్పుడు, ఒక్కొక్క దానికి 4 అణాల చొప్పున ప్రవేశరుసుము పంపవలెను.

## పుస్తకముల పేర్లు.

(సమాధానములన్నియు యీ పేర్లలోనే ఉన్నవి.)

శాకుంతల—కుమారసంభవము—తులాభారము—చిత్రాంగి—మృచ్ఛకటిక—వలపు—శంకరవిజయము—లీలావతీసులోచన—కపాలకుండల—తొలిబిడ్డ—కమలినీకలహంస—వరూధిని—కంఠాభరణము—జాగిలము—వేణీసంహారము—దమయంతి—మేఘసందేశము—మణిమాల—తారాశశాంక—ఉషఃకాలము—చంద్రగుప్త—మధుసేవ—కుముదిని—పద్మినీపరిణయము—

---

## కౌపను

| | | | |
|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 |
| 5 | 6 | 7 | 8 |
| 9 | 10 | 11 శాకుంతల | 12 |
| 13 | 14 | 15 | 16 |

సంపాదకుని తీర్పును అంగీకరింతును.

పేరు............................ విలాసము...........................